మీడియాకు సంబంధించిన అన్ని విషయాల కోసం 9246213493
సహాయ
మీడియా సర్వీసు రి.
3-7-255,మన్సూరాబాద్,ఎల్బీనగర్,హైదరాబాద్-68

www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

అనుక్షణం
# నవభూమి
ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
Navabhoomi daily fallows..

హైదరాబాద్ | 17 గురువారం | అక్టోబర్ 2024 | పేజీలు 8-12 | వెల: రూ.6 | సంపుటి:3 సంచిక: 31




జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రిగా

# ఒమర్ అబ్దుల్లా ప్రమాణస్వీకారం



2

- జమ్మూకశ్మీర్ సీఎంగా ఒమర్ అబ్దుల్లాతో ప్రమాణస్వీకారం చేయించిన లెఫ్టినెంట్ గవర్నర్ సిన్హా
- శ్రీనగర్ షెరి కశ్మీర్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ సెంటర్‌లో కార్యక్రమం
- ఖర్గే,రాహుల్,ప్రియాంకతో పాటు కూటమి నేతలు హాజరు
- వెలుపలి నుంచే మద్దతు ఇస్తామని కాంగ్రెస్ ప్రకటన

**శ్రీనగర్-నవభూమిబ్యూరో:** జమ్మూ కశ్మీర్ నూతన ముఖ్యమంత్రిగా ఒమర్ అబ్దుల్లా ప్రమాణస్వీకారం చేశారు. లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఆయనతో ప్రమాణం చేయించారు.

సురిందర్ కుమార్ చౌదరీ ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. శ్రీనగర్‌లోని షెరి కశ్మీర్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీలు హాజరయ్యారు. వీరితో పాటు ఇండియా కూటమికి చెందిన ఇతర నేతలు వచ్చారు. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హోదా రద్దు చేసి, కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటించిన తర్వాత ఏర్పాటైన తొలి ప్రభుత్వం ఇది.

2014 తర్వాత తొలిసారి జరిగిన జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్- కాంగ్రెస్ కూటమి విజయం సాధించాయి. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజార్టీ వచ్చింది. ఈ క్రమంలోనే ఎన్‌సీ శాసనసభాపక్ష నేతగా ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈనేపథ్యంలో ప్రభుత్వం ఏర్పాటుకు పిలవాలంటూ ఎన్‌సీతోపాటు కాంగ్రెస్ నుంచి ఎల్‌జీకి విజ్ఞప్తులు వచ్చాయి. దీంతో ఈ రోజు కొత్త ప్రభుత్వ ఏర్పాటు, సీఎం ప్రమాణస్వీకారానికి లెఫ్టినెంట్ గవర్నర్ ఆహ్వానించడంతో ఈ కార్యక్రమం జరిగింది.

**వెలుపలి నుంచే మద్దతు ఇస్తాం: కాంగ్రెస్**

"ప్రస్తుతానికి మేం జమ్మూకశ్మీర్‌లోని నూతన ప్రభుత్వంలో చేరడం లేదు. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరించాలని కాంగ్రెస్ బలంగా డిమాండ్ చేసింది. ఆ హోదాను పునరుద్ధరిస్తామని ప్రధాని మోదీ ప్రచార సభల్లో పదేపదే చెప్పారు. కానీ ఇంతవరకు అది జరగలేదు. దాంతో మేం సంతోషంగా లేము. అందుకే ప్రస్తుతానికి మేం ప్రభుత్వంతో చేరడం

# మళ్లీ ముప్పు?

- దూసుకొస్తున్న వాయుగుండం..
- పలు జిల్లాలకు ఆకస్మిక వరద ముప్పు
- కడప బస్టాండ్‌లోకి భారీగా చేరిన వరదనీరు
- ఉద్ధృతంగా ప్రవహిస్తున్న వాగులు,వంకలు
- పరిస్థితిని సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు

2



**అమరావతి-నవభూమిబ్యూరో:** నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం 15 కి.మీ వేగంతో దూసుకొస్తోంది. దీని ప్రభావంతో ఇప్పటికే దక్షిణకోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. చెన్నైకి 280 కిలోమీటర్లు, పుదుచ్చేరికి 320 కిలోమీటర్లు.. నెల్లూరుకు 370 కిలోమీటర్ల దూరంలో వాయుగుండం కేంద్రీకృతమై ఉందని వాతావరణశాఖ తెలిపింది. పశ్చిమ వాయవ్య దిశగా 15 కిలోమీటర్ల వేగంతో కదులుతోందని ప్రకటించింది. దీని ప్రభావంతో దక్షిణకోస్తా, రాయలసీమలోని కొన్ని చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, వైఎస్ఆర్ జిల్లాల్లో ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉందని, లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించింది. పెన్నా పరివాహక ప్రాంత ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. సహాయక చర్యల కోసం జిల్లాల్లో 5 ఎస్డీఆఆర్ఎఫ్, 2 ఎన్డీఆర్ఎఫ్ బృందాలను అధికారులు సిద్ధంగా ఉంచారు. అవసరమైన చోట పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు.

**కడప బస్టాండ్‌లోకి భారీగా చేరిన వరదనీరు**

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి.

ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు, వైఎస్ఆర్ జిల్లాల్లో కురుస్తున్న వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తమైంది. నెల్లూరు నగరంతో పాటు కావలి, అల్లూరు, బిట్రగుంట, గుడ్లూరు, లింగసముద్రం, వింజమూరు, వరికుంటపాడు,

# కొండా,రేవూరిపై అధిష్టానం గుస్సా!

- ఇదేం తీరు.. ఇవేం గొడవలు..
- వరంగల్ నేతలపై కాంగ్రెస్ అధిష్ఠానం సీరియస్
- కొండా-రేవూరి మధ్య వివాదాన్ని పరిష్కరించే బాధ్యత జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటిదే
- రెండు రోజుల్లో ప్రజాప్రతినిధులతో సమావేశం

2



**వరంగల్-నవభూమిబ్యూరో:**'మంత్రి సురేఖ, ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి మధ్య ఏర్పడిన వివాదాన్ని పరిష్కరించే బాధ్యత ఉమ్మడి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి అధిష్ఠానం అప్పగించింది.ఒకటి, రెండు రోజుల్లో ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులతో ఆయన సమావేశం ఏర్పాటు చేసే అవకాశం ఉంది'

రంగంపేట, వరంగల్ జిల్లా కాంగ్రెస్‌లో కొనసాగుతున్న వర్గపోరును అధిష్ఠానం సీరియస్‌గా పరిగణించింది. ఇక్కడి ప్రజాప్రతి నిధుల తప్పటడుగులపై ఆగ్రహంగా ఉంది. గీసుకొండ మండలం ధర్మారంలో ఏర్పడిన ఫ్లెక్సీ వివాదంలో దాడులు చేసుకునే పరిస్థితి ఎందుకు వచ్చింది? దీని వెనుక ఎవరెవరు ఉన్నారు? కిందిస్థాయి కార్యకర్తలను కట్టడి చేయాల్సిన ప్రజాప్రతినిధులు మౌనంగా ఉండటం, రాష్ట్ర

# భారీ వర్షాలపై అప్రమత్తం

- వరద పరిస్థితిపై ఎప్పటికప్పుడు సమాచారమివ్వాలి
- వర్ష ప్రభావిత జిల్లాల్లోని పరిస్థితులను నివేదించాలి
- భారీ వర్షాలపై సీఎం చంద్రబాబు సమీక్ష..
- అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఆదేశాలు

2



**అమరావతి-నవభూమిబ్యూరో:** భారీ వర్షాలపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఆకస్మిక వరదల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. నెల్లూరు, ప్రకాశం, తిరుపతి, చిత్తూరు సహా పలు జిల్లాల్లో వర్షాలపై అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు.

వర్ష ప్రభావిత జిల్లాల్లోని పరిస్థితులను

# జోక్యం చేసుకోం

- ఐఏఎస్‌లకు షాకిచ్చిన తెలంగాణ హైకోర్టు..
- ముందు వెళ్లి రిపోర్ట్ చేయాలని ఆదేశం
- సివిల్ సర్వెంట్ల నియామకాలను కోర్టులు నిర్ధారించలేవన్న జడ్జి
- ఐఏఎస్‌లు అయినంత మాత్రాన స్టే ఇవ్వలేమని స్పష్టీకరణ



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:**' క్యాట్ తీర్పును వ్యతిరేకిస్తూ కోర్టును ఆశ్రయించిన ఏపీ కేడర్ ఐఏఎస్ అధికారులకు తెలంగాణ హైకోర్టు షాకిచ్చింది.ఇలాంటి విషయాల్లో జోక్యం చేసుకోలేమని తేల్చి చెప్పింది. సివిల్ సర్వెంట్ల నియామకాలను కోర్టులు నిర్ధారించలేవని జడ్జి పేర్కొన్నారు. ఐఏఎస్‌లు అయినంత మాత్రాన స్టే ఇవ్వలేమని స్పష్టం చేసింది. ఇలాంటి వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటే ముగింపు ఉండదని అభిప్రాయపడింది. ముందు వెళ్లి ఎక్కడివాళ్లు అక్కడ రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. కాగా, క్యాట్ తీర్పు ప్రకారం ఇవాళే రిపోర్ట్ చేయాల్సి ఉంది.

కాగా, ఇటీవల డీవోపీటీ బదిలీ చేసిన ఐఏఎస్ అధికారులు తెలంగాణ హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. రొనాల్డ్ రోస్, సృజన, శివశంకర్, హరికిరణ్, ఆమ్రపాలి, వాకాటి కరుణ, వాణీప్రసాద్.. డీవోపీటీ ఉత్తర్వులపై హైకోర్టును ఆశ్రయించారు. ఇటీవల వీరంతా తమను యథావిధిగా బదిలీ చేయకుండా ఉంచాల ని కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్(క్యాట్) ఆశ్రయించారు. వారి విజ్ఞప్తిని అక్కడ నిరాకరించడంతో తాజాగా బుధవారం హైకోర్టు లో పిటిషన్ దాఖలు చేయగా.. కోర్టు విచారణ చేపట్టి.. ముందు వెళ్లి రిపోర్ట్ చేయాలని ఆదేశించింది.

## వైకాపా నేత సజ్జలకు మంగళగిరి పోలీసుల నోటీసులు

- తెదేపా కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో విచారణకు రావాలంటూ నోటీసులు
- దాడి కేసులో సజ్జల ప్రమేయం ఉన్నట్లు పోలీసులు గుర్తింపు

2



**మంగళగిరి-నవభూమిప్రతినిధి:** వైకాపా నేత సజ్జల రామకృష్ణారెడ్డికి మంగళగిరి రూరల్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. తెదేపా కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో విచారణకు రావాలని అందులో పేర్కొన్నారు.గురువారం ఉదయం 10.30 గంటలకు విచారణకు హాజరుకావాలని స్పష్టం చేశారు. వైకాపా అధికారంలో ఉండగా 2021 అక్టోబర్ 19న ఆ పార్టీకి చెందిన మూకలు తెదేపా కేంద్ర కార్యాలయంపై దాడికి పాల్పడ్డాయి. దీనిపై కేసు నమోదు కావడంతో ఇప్పటికే పలువురు వైకాపా నేతలను పోలీసులు విచారించారు.ఈ కేసులో సజ్జల ప్రమేయం ఉందని గుర్తించిన పోలీసులు ఆయన విదేశాలకు వెళ్లకుండా ఇప్పటికే లుక్అవుట్ నోటీసులు జారీ చేశారు. పార్టీ కార్యాలయంపై దాడి కేసులో వైకాపా నేతలు లేళ్ల అప్పిరెడ్డి, దేవినేని అవినాశ్, తలశిల రఘురామ్‌లను ఇప్పటికే ఫలు దఫాలుగా పీఎస్‌కు పిలిపించి విచారించారు. కేసు కొలిక్కి వస్తున్న నేపథ్యంలో దాడి ఘటనలో ప్రమేయం ఉన్న ముఖ్య నాయకులను విచారించేందుకు సిద్ధం అవుతున్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా సజ్జలకు నోటీసులు జారీ

## ఉచిత ఇసుక విధానంపై ఫిర్యాదులు

- సీఎం చంద్రబాబు ఆగ్రహం
- ఉచిత లక్ష్యం నెరవేరాల్సిందేనన్న సీఎం
- ఉచిత ఇసుక విధానంపై మంత్రులతో చర్చ
- రాష్ట్రంలో ఇసుక విరివిగా దొరకాలి
- రవాణా, తవ్వకం ఛార్జీలు కూడా
- వీలైనంత తక్కువ ధర ఉండేలా చర్యలు

2





**అమరావతి-నవభూమిబ్యూరో:** ఎన్డీయే ప్రభుత్వం ఉచిత ఇసుక లక్ష్యం నెరవేరి తీరాలని ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రులకు తేల్చి చెప్పారు. కేబినెట్ సమావేశం అనంతరం ఉచిత ఇసుక విధానంపై అమాత్యులతో ఆయన కీలకంగా చర్చించారు.ఉచిత ఇసుక విధానం ఫిర్యాదులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సీఎం.. 10 రోజుల్లో మార్పు రాకుంటే ఉపేక్షించనని స్పష్టం చేశారు. ఏ స్థాయిలో తప్పు జరిగినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రాష్ట్రంలో ఇసుక విరివిగా దొరకాలన్నారు. అన్ని బంధనాలు తొలగించి, రవాణా, తవ్వకం ఛార్జీలు కూడా వీలైనంత తక్కువ ధర ఉండేలా చర్యలు తీసుకుంటూ ఉచిత ఇసుక అందించి తీరాలని తేల్చి చెప్పారు. ఇసుక తవ్వకుని తీసుకెళ్తే రుసుము వసూలు చేయవద్దని సీఎం ఆదేశించారు. ఇసుక అక్రమాలు జరగకుండా

## ఘోర రోడ్డు ప్రమాదం

- ఏడుగురి ప్రాణాలు తీసిన రోడ్డు విస్తరణ పనులు
- శివ్వంపేట మండలం ఉసరికపల్లి వద్ద ఘటన
- దేవదర్శనానికి వెళ్లి వస్తుండగా అదుపు తప్పిన కారు
- కల్వర్టును ఢీకొని, పక్కనే చెట్టుకు తగిలి కాల్వలోకి..

2



**శివ్వంపేట-నవభూమి:** మెదక్ జిల్లా శివ్వంపేట మండలం ఉసిరికపల్లి వద్ద బుధవారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కారు అదుపుతప్పి కాల్వలోకి దూసుకెళ్లిన ఘటనలో ఏడుగురు మృతి చెందారు.మృతుల్లో నలుగురు మహిళలు, ఇద్దరు బాలికలు, ఓ వ్యక్తి ఉన్నారు. వీరంతా పాముబండ తండాకు చెందిన వారిగా గుర్తించారు.

ఉసిరికపల్లి నుంచి వెల్దుర్తి వరకు రహదారి విస్తరణ పనులు కొనసాగుతున్నాయి.ఉసిరికపల్లి వద్ద వేగంగా వచ్చిన ఓ కారు అదుపుతప్పి రహదారిపైన ఉన్న గుంతలో పడి గాల్లోకి ఎగిరిపడింది. దీంతో రోడ్డు పక్కనే ఉన్న చెట్టును కారు ఢీకొట్టి.. కాల్వలోకి పడింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఏడుగురు వ్యక్తులు అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయారు. కారులో ఉన్న ఏడుగురు నీటమునిగి అక్కడికక్కడే మృతి చెందారు. డ్రైవింగ్ చేస్తున్న నామ్‌సింగ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఒకే కుటుంబానికి చెందిన వీరంతా తూప్రాన్ దగ్గర ముత్యాలమ్మ గ్రామ దేవత ఆలయానికి వెళ్లి వస్తుండగా ప్రమాదం జరిగింది.

సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు.

## త్వరలో రూ.7500తో రైతు బంధు

- వచ్చే నెల నుంచి 2లక్షల పైగా ఉన్న వారికి రుణమాఫీ
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల వెల్లడి
- ఎస్ఎల్బీసీ ప్రాంగణంలోని బత్తాయి మార్కెట్లో ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభం


**నల్లగొండ-నవభూమి:** రైతుబంధు త్వరలో ఎకరానికి రూ.7500 చొప్పున అందించబోతున్నా మని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు వెల్లడించారు. బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో కలిసి ఎస్ఎల్బీసీ ప్రాంగణంలోని బత్తాయి మార్కెట్లో ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.



# రాష్ట్ర ప్రగతిని మార్చే కొత్త పాలసీలు

- ఒకేసారి ఆరు కొత్త పాలసీలు తీసుకొచ్చాం
- ఎలక్ట్రానిక్స్, ఇండస్ట్రియల్, క్లీన్ ఎనర్జీ, గ్రీన్ ఎనర్జీ పాలసీలు తీసుకొచ్చాం: సీఎం చంద్రబాబు
- పర్యాటక, ఐటీ, వర్చువల్ వర్కింగ్ పాలసీలు తీసుకువస్తాం
- 'వన్ ఫ్యామిలీ- వన్ ఎంటర్ ప్రెన్యూర్ నినాదంతో వెళ్తున్నాం

2



**అమరావతి-నవభూమిబ్యూరో:** ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని ముఖ్య మంత్రి చంద్రబాబు తెలిపారు. థింక్ గ్లోబల్లీ, యాక్ట్ గ్లోబల్లీ నినాదంతో ముందుకెళు న్నామన్నారు.

ఏపీ కేబినెట్ సమావేశం ముగిసిన తర్వాత సీఎం మీడియాతో మాట్లాడారు. "ఒకేసారి ఆరు కొత్త పాలసీలు తీసుకొచ్చాం. ఎలక్ట్రానిక్స్, ఇండస్ట్రియల్, క్లీన్ ఎనర్జీ, గ్రీన్ ఎనర్జీ పాలసీలు తీసుకొచ్చాం. పర్యాటక, ఐటీ, వర్చువల్ వర్కింగ్ పాలసీలు తీసుకువస్తాం. 'వన్ ఫ్యామిలీ- వన్ ఎంటర్ ప్రెన్యూర్ నినాదంతో వెళ్తున్నాం. ఉద్యోగం చేయడం కాదు.. ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి. కొత్త పాలసీలు రాష్ట్ర ప్రగతిని మారుస్తాయి. యువత భవిష్యత్తులో పెనుమార్పులు తెస్తాయి" అని సీఎం వివరించారు.

**రాష్ట్రంలో ఐదుజోన్లలో ఇన్నోవేషన్ హబ్‌లు..**

"అమరావతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేస్తాం. ఐదు జోన్లలో (విశాఖ, రాజమ హేంద్రవరం, తిరు పతి, విజయవాడ లేదా గుంటూ రు, అనంతపురం) ఐదు ఇన్నోవేషన్ రతన్ టాటా హబ్‌లు వస్తాయి. ఆధునిక టెక్నాలజీని ప్రజలకు మరింత చేరువ చేస్తాం. కొత్త పాలసీలతో ఏపీలో పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయి. నాలెడ్జ్ ఎకానమీకి ఏపీ ఇన్నోవేషన్ హబ్‌గా మారాలి. కృష్ణా జలాలు రాయలసీమకు ఇవ్వొచ్చని చెప్పింది ఎన్టీఆర్. అది చేసి చూపించింది తెలుగుదేశం పార్టీ. నదుల అనుసంధానంతోనే ఏపీ అభివృద్ధి. దెబ్బతిన్న ఏపీ బ్రాండ్‌ను పునర్ నిర్మించాల్సి ఉంది. భారీగా విదేశీ పెట్టుబడులు తీసుకురావాల్సి ఉంది. ఆదాయం పెంచి ప్రజలకు పంచాలన్నదే మా నినాదం. ఆక్వా కల్చర్ హబ్‌గా ఆంధ్రప్రదేశ్ తయారవుతుంది. ఫుడ్ ప్రాసెసింగ్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చాం. ఫుడ్ హార్టికల్చర్ హబ్‌గా రాయలసీమ



## రాబోయే రెండు రోజుల్లో హైదరాబాద్‌లో తేలికపాటి

**హైదరాబాద్‌-నవభూమి:** తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో గత రెండు, మూడు రోజుల నుంచి వర్షాలు కురుస్తోన్న సంగతి తెలిసిందే. రాబోయే రెండు రోజుల్లో కూడా హైదరాబాద్ నగర వ్యాప్తంగా తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ వెల్లడించింది. చార్మినార్, బండ్లగూడ, రామచంద్రాపురం, శేరిలింగంపల్లి వంటి ప్రాంతాలు మినహా నగరంలోని చాలా ప్రాంతాల్లో గురువారం తేలికపాటి వర్షాలు కురుస్తాయని అధికారులు అంచనా వేశారు. శుక్రవారం కూడా అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉంది. బుధవారం నగరంలోని మియాపూర్, గాజులరామారం, జీడిమెట్ల, పటాన్‌చెరు తదితర ప్రాంతాల్లో ఈదురుగాలులు వీచాయి. ఇక పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. ఇదిలా ఉండగా, రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో కూడా గురువారం తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని, జోగులాంబ గద్వాల్ జిల్లాలో ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.



## బీఆర్ఎస్ సీనియర్ నేత ఫరీదుద్దీన్ మృతి.. నివాళులు అర్పించిన మాజీ మంత్రులు



**హైదరాబాద్‌-నవభూమి:** బీఆర్ఎస్ సీనియర్ నేత సయ్యద్ సబిహుద్దీన్ ఫరీద్ హైదరాబాద్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రులు మహమూద్ అలీ, జగదీష్ రెడ్డి నల్లగొండ జిల్లా మునుగోడు రోడ్ ఖబరస్థాన్‌లో జరిగిన అంత్యక్రియలలో పాల్గొన్నారు. ఆయన పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సూర్యాపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఫరీదుద్దీన్ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో చురుకైనా పాత్ర పోషించారన్నారు. బీఆర్ఎస్ పార్టీ అభివృద్ధికి నిజాయితీగా, నిస్వార్థంగా పనిచేసిన నాయకుడని ప్రశంసించారు. ముస్లిం, మైనార్టీల సంక్షేమం కోసం అలుపెరుగని కృషి చేశారన్నారు. ఆయన మరణం తమకు తీవ్ర ఆవేదన కలిగించిందన్నారు. వారి వెంట జడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి, నకరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.


## నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌పై ఉక్కుపాదం మోపాలి..

### - ఎక్సైజ్ అధికారులకు డిప్యూటీ కమిషనర్ ఆదేశాలు



**హైదరాబాద్‌-నవభూమి:** డ్రగ్స్, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్(ప్లై ఉక్కుపాదం మోపాలని డిప్యూటీ కమిషనర్ పి.దశరథ్ టాస్క్ ఫోర్స్ అధికారులను అదేశించారు. మంగళవారం అబ్కారీ భవన్‌లో రంగారెడ్డి జిల్లా పరిధిలోని ఎక్సైజ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెప్టెంబర్ నెలలో ఎక్సైజ్ అధికారులు, స్టేషన్ల పనితీరు సంతృప్తికరంగా ఉందన్నారు. నాటుసారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించి 56 కేసులు నమోదు చేశారని.. 53 మందిని అరెస్టు చేసి 111 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దూల్‌పేట్‌లో గట్టి చర్యలు చేపట్టడంతో గంజాయి వ్యాపారాలు హైదరాబాద్ పరిసర ప్రాంతాల నుంచి అమ్మకాలు సాగిస్తున్నారనే సమాచారం ఉందని, మరింత నిఘా పెంచి గంజాయి, డ్రగ్స్‌ను నిర్మూలించాలని ఆదేశించారు. పెండింగ్ కేసుల్లో చార్జిషీట్స్ వేయాలని, లిక్కర్ అమ్మకాల్లో ధరల వ్యత్యాసాలు లేకుండా చూడాలని సూచించారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ ఆర్.కిషన్, శంషాబాద్, మేడ్చల్, మల్కాజ్‌గిరి, సరూర్‌నగర్, వికారాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు కృష్ణప్రియ, ఎస్‌కే పయాజోద్దీన్, కె.నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కర్ణాటక పుణ్యక్షేత్రాల సందర్శనకు ప్రత్యేక రైలు



**హైదరాబాద్‌-నవభూమి:** కర్ణాటకలోని పుణ్యక్షేత్రాలను సందర్శించేందుకు డిసెంబర్ 5న భారత్ గౌరవ్ సౌత్ స్టార్ రైల్‌ను ఏర్పాటు చేసినట్లు టూర్ టైమ్స్ రీజనల్ మేనేజర్ రమేష్ అయ్యంగార్, సౌత్‌స్టార్ రైల్ ప్రొటెక్ట్ డైరెక్టర్ విఘ్నేష్ తెలిపారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైల్వే టూర్ పోస్టర్‌ను ఆవిష్కరించి వారు మాట్లాడారు. మార్గశిర మాసం సందర్భంగా నవ బృందావనం, గోకర్ణ, మురుడేశ్వర్, కొల్లూరు, శృంగేరి, హొరనాడు, ధర్మస్థల, కుకి సుబ్రహ్మణ్య, మైసూర్, శ్రీరంగపట్నం, మేల్‌కోటేలను సందర్శించడానికి 9 రోజుల పాటు యాత్ర కొనసాగుతుందని వారు పేర్కొన్నారు.

ఈ టూర్‌కు 33 శాతం రాయితీ పొందవచ్చని, సీనియర్ సిటిజన్స్ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డిసెంబర్ 5న చెన్నైలో బయల్దేరనున్న ఈ ట్రైన్ ఏపీలోని గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల.. తెలంగాణలోని మిర్యాలగూడ, నల్గొండ, సికింద్రాబాద్‌లలో ఆగుతుందన్నారు. పూర్తి వివరాలకు 9355021516 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

# మట్టే బంగారమాయెనే..



**హైదరాబాద్‌-నవభూమి:** అబ్దుల్లాపూర్‌మెట్, యాచారం, మంచాల్, ఇబ్రహీంపట్నం మండలాలలో ప్రభుత్వ, ప్రైవేటు భూముల్లో అక్రమంగా మట్టి తవ్వకాలను నిలిపివేయాలని రంగారెడ్డి జిల్లా మైన్ అండ్ జియాలజీ డిపార్టుమెంట్ అసిస్టెంట్ డిప్యూటీ డైరెక్టర్ ఎం. నర్సిరెడ్డి రెండు నెలల క్రితం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో మట్టికి విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి కోహెడ గ్రామంలో మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయంటూ పలువురు ఆగస్టులో జిల్లా మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అక్రమ మైనింగ్ ఆపాలని సెప్టెంబర్ 9వ తేదీన అసిస్టెంట్ డిప్యూటీ డైరెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఎక్కడ అక్రమంగా మట్టి తవ్వకాలు జరిగినా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, మట్టి తరలిస్తున్న వాహనాలను సీజ్ చేయాలని అబ్దుల్లాపూర్‌మెట్, ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం మండలాల తహసీల్దార్‌లను ఆదేశించారు.

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో మట్టి తవ్వకాలు నిలిపి వేయడంతో లారీల యజమానులు ఇతర ప్రాంతాల నుంచి మట్టిని నగరానికి తరలిస్తున్నారు. అయితే దాదాపు రెట్టింపు ధర తీసుకుంటున్నారు. ప్రధానంగా మహేశ్వరం నియోజకవర్గం, యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి, తూఫ్రాన్‌పేట్, సరళ మైసమ్మ, రాచకొండ గుట్టలు, మల్కాపురం, మునుగోడు, దేవరకొండ ప్రాంతాల నుంచి మట్టిని తీసుకొస్తున్నారు.

ధర రెట్టింపు

మైనింగ్ శాఖ మట్టి తవ్వకాలను ఆపివేయడంతో కొరత ఏర్పడడంతో ధర పెరిగింది. గతంలో 300 ఫీట్ల లారీ మట్టికి రూ. 3,500 తీసుకునే వారు, ప్రస్తుతం రూ. 6,500 వరకు తీసుకుంటున్నారు. 600 ఫీట్ల లారీకి రూ. 6,500 తీసుకుంటుండగా ఇప్పుడు రూ. 10 వేలు తీసుకుంటున్నారు. 12 టైర్ల లారీ మట్టికి రూ. 10 వేలకుగాను ప్రస్తుతం రూ. 15 వేలు తీసుకుంటున్నారు.

పోలీసుల చేతివాటం

వివిధ ప్రాంతాల నుంచి నగరానికి మట్టి తరలిస్తున్న లారీలను పోలీసులు టార్గెట్‌గా చేసుకొని అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని పలువురు లారీల యజమానులు ఆరోపిస్తున్నారు. లారీకి సుమారు రూ. 5 వేలు వసూలు చేస్తున్నారని అంటున్నారు. ప్రశ్నిస్తే.. వే బిల్లు చూపించమంటున్నారని వాపోయారు. కంకర లారీలను వే బిల్లులు అడగడం లేదంటున్నారు. తమకు వచ్చే లాభం పోలీసుల పరం అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ఆర్కిటెక్చర్‌పై లైంగికదాడి.. ఆటో డ్రైవర్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు



**హైదరాబాద్‌-నవభూమి:** గచ్చిబౌలిలో సోమవారం అర్ధరాత్రి ఓ యువతిపై ఆటో డ్రైవర్ లైంగిక దాడికి పాల్పడిన ఘటనలో పోలీసులు పురోగతి సాధించారు. సీసీ కెమెరాల ఫుటేజీ, సెల్‌ఫోన్ నెంబర్ ఆధారంగా కేసును పోలీసులు ఛేదించారు. లైంగికదాడికి పాల్పడిన ఆటో డ్రైవర్ ప్రవీణ్‌ను అరెస్ట్ చేశారు. ప్రవీణ్‌ను శేరిలింగంపల్లి గోపీనగర్‌లో అదుపులోకి తీసుకున్నారు. ప్రవీణ్ నల్లగొండ జిల్లాలోని కేతేపల్లి వాసిగా గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కాగా, సైబరాబాద్ ఐటీ కారిడార్ మంగళవారం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. అత్యంత సేఫ్‌జోన్‌గా భావించే గచ్చిబౌలిలో సోమవారం అర్ధరాత్రి ఓ యువతిపై ఆటో డ్రైవర్, తన స్నేహితుడితో కలిసి లైంగికదాడి చేయడం దేశవ్యాప్తంగా కలకలం రేపింది. ఈ ఘటన పోలీస్‌శాఖ పనితీరుపై మరోసారి విమర్శలకు తావిచ్చింది. చెన్నై నగరానికి చెందిన ఓ యువతి(32) సోమవారం అర్ధరాత్రి 1:30 గంటల సమయంలో నగర శివారులోని బీహెచ్‌ఈఎల్ వద్ద బస్సు దిగింది. అనంతరం అక్కడి నుంచి నానక్‌రాంగూడకు వెళ్లేందుకు ఓ ఆటో మాట్లాడుకుంది. సదరు ఆటో డ్రైవర్ గచ్చిబౌలి ట్రిపుల్ ఐటీ జంక్షన్ వరకు విడిచిపెడతానని ఒప్పందం చేసుకున్నాడు. అక్కడి నుంచి నానక్‌రాంగూడకు చాలా ఆటోలు అందుబాటులో ఉంటాయని చెప్పడంతో ఆమె ఆటో ఎక్కింది. మార్గమధ్యంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రాంతంలో మసీదు బండ కమాన్ దాటగానే జీహెచ్‌ఎంసీ అద్దె క్యాంటీన్ పక్కకు ఆటోను డ్రైవర్ మళ్లించాడు.

ఆ రూట్‌లో రాకపోకలు లేకపోవడం.. అప్పటికే అక్కడ సిద్ధంగా ఉన్న తన స్నేహితుడితో కలిసి యువతిపై లైంగికదాడి చేశారు. యువతి కేకలు విన్న జోమోటో డెలివరీబాయ్‌తో పాటు మరికొందరు వాహనదారులు ఆటోవద్దకు చేరుకున్నారు. వారిని గమనించిన ఇద్దరూ అక్కడి నుంచి పరారయ్యారు. స్థానికులు వెంటనే 100కు కాల్ చేసి పోలీసులకు సమాచారమందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు వెంటనే బాధితురాలని గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆ తర్వాత భరోసా సిబ్బంది సహకారంతో యువతిని కొండాపూర్‌లోని ప్రభుత్వ జిల్లా దవాఖానకు తీసుకెళ్లారు. బాధితురాలు తల, చేతులకు తీవ్ర గాయాలుండడంతో ఆ తర్వాత గాంధీ దవాఖానకు తరలించారు.

# మళ్లీ ముప్పు?

**(1వపేజీ తరువాయి)**ఇందుకూరుపేట, కొండాపురం ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. వరికుంటపాడు మండలం కనియంపాడులో పిల్లపేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. కొండాపురం మండలం సత్యవోలు అగ్రహారం వద్ద మిడతవాగులోకి వరద ఎక్కువగా చేరుతోంది. స్వర్ణముఖి నదిలో వరద ప్రవాహం పెరుగుతోంది.

**నెల్లూరులో..**

ప్రకాశం జిల్లాలోని ఒంగోలు, గిద్దలూరు, మార్కాపురం, కనిగిరి, దర్శి, రాజుపాలెం, కొత్తపట్నం, సింగరాయకొండ తదితర ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది. తీరప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా పరిశీలిస్తున్నారు. సహాయక చర్యలకు ఎన్డీఆర్ఎఫ్‌తో పాటు 360 మంది పోలీసులతో 18 బృందాలను ఏర్పాటు చేశారు. జిల్లాలోని విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. ఉమ్మడి కడప జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం రాత్రి నుంచి ఎడతెరిపిలేని వర్షం కురుస్తోంది. కడప బస్టాండ్‌లోకి భారీగా వరదనీరు చేరింది. పోరుమామిళ్ల, ఒంటిమిట్టలో అత్యధిక వర్షపాతం నమోదైంది. లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. తిరుపతి జిల్లా వ్యాప్తంగా ఎడతెరపి లేని వర్షాలు కురుస్తున్నాయి.

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాల్లోని తీర ప్రాంతాల్లో వర్షం పడుతోంది. లోతట్టు ప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. శ్రీకాళహస్తి-తడ మార్గంలో రాకపోకలు స్తంభించిపోయాయి. ఎగువ ప్రాంతాల వరదతో స్వర్ణముఖి నదిలో నీటిమట్టం పెరుగుతోంది. తిరుమల కనుమ రహదారుల్లో కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉండటంతో తితిదే అప్రమత్తమైంది. శ్రీవారి పాదాలు, జాపాలి, ఆకాశగంగకు భక్తులను అనుమతించడం లేదు. వర్షాల కారణంగా ఇప్పటికే తిరుమలలో వీఐపీ బ్రేక్ దర్శనాలు తితిదే రద్దు చేసిన విషయం తెలిసిందే.

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: విపత్తుల నిర్వహణ సంస్థ**

వాయుగుండం వాయవ్య దిశగా గంటకు 10కి.మీ వేగంతో కదులుతున్నట్లు ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) వెల్లడించింది. ప్రస్తుతం చెన్నైకి 440 కి.మీ, పుదుచ్చేరికి 460 కి.మీ, నెల్లూరుకి 530 కి.మీ దూరంలో కేంద్రీకృతమైనట్లు తెలిపింది. ఇది గురువారం తెల్లవారుజామున చెన్నై, నెల్లూరు మధ్య తీరం దాటే అవకాశముందని పేర్కొంది. వాయుగుండం ప్రభావంతో ఇవాళ దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో పలుచోట్ల విస్తృతంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీఎస్డీఎంఏ సూచించింది.

# కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 3 శాతం డీఏ పెంపు

**న్యూఢిల్లీ-నవభూమి:** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు నరేంద్ర మోదీ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఉద్యోగులు, పెన్షనర్లకు దీపావళి కానుకగా 3 శాతం కరవు భత్యాన్ని పెంచుతూ కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం మూలవేతనంలో 50 శాతం ఉన్న డీఎం 53 శాతానికి చేరుతుంది. ఈ ఏడాది జూలై 1వ తేదీ నుంచి దీన్ని అమలు చేయనున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో 10 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్లకు లబ్ధి చేకూరనుంది. కాగా, సార్వత్రిక ఎన్నికలకు ముందు మార్చిలో డీఏను 4 శాతం కేంద్రం పెంచింది. అది జనవరి 2024 నుంచి అమల్లోకి వచ్చింది. మూడు నెలల బకాయిలను ప్రభుత్వం చెల్లించింది. ఏటా ప్రభుత్వం రెండుసార్లు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల డీఏను సవరిస్తుంటుంది. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఈ కరవు భత్యాన్ని నిర్ణయిస్తారు. ఆల్ ఇండియా కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్ (ఏఐసీపీఐ) ఆధారంగా డీఏ పెంపుదలను



## ఘోర రోడ్డు ప్రమాదం

**(1వపేజీ తరువాయి)**మృతదేహాలను స్వాధీనం చేసుకుని, కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతులను పాముబండ తండా, రత్నాపూర్, తాళ్లపల్లి వాసులుగా గుర్తించారు. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు అయింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## త్వరలో రూ.7500తో రైతు బంధు

**(1వపేజీ తరువాయి)**ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఈ నెలాఖరు వరకు 2లక్షల లోపు రైతులందరికీ రుణమాఫీ ప్రక్రియ పూర్తవుతుందని, వచ్చే నెల నుంచి 2లక్షల పైగా ఉన్న వారికి రుణమాఫీ ప్రక్రియ అమలవుతుందన్నారు. వరి, పత్తి రైతులకు ఇబ్బంది కల్గకుండా మద్ధతు ధర మేరకు కొనుగోలు జరిగేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందన్నారు. తేమ పేరుతో రైతులను అధికారులు ఇబ్బందులు పెట్టవద్దని, రైతులు కూడా తేమ శాతం మేరకు ధాన్యం, పత్తి దిగుబడులు ఉండేలా చూసుకుని మార్కెట్ కు తీసుకురావాలని సూచించారు. రాష్ట్రంలో ఉన్నది రైతు ప్రభుత్వమని, రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు.

## రాష్ట్ర ప్రగతిని మార్చే కొత్త పాలసీలు

**(1వపేజీ తరువాయి)**మారుతుంది. దేశంలో తొలిసారిగా పరిశ్రమల డీకార్బనైజేషన్‌ను ప్రోత్సహిస్తాం" అని సీఎం చంద్రబాబు తెలిపారు.

**రూ.30లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించాలని లక్ష్యం...**

"జీరో బడ్జెట్, నేచురల్ ఫార్మింగ్‌కు ఏపీ చిరునామా. నవంబరు మొదటి వారంలో స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్ విడుదల చేస్తాం. స్వర్ణాంధ్ర 2047లో భాగంగా మానుఫ్యాక్చరింగ్ హబ్‌గా మారుస్తాం. ప్రపంచ దేశాల్లో మార్కెటింగ్ వచ్చేలా మన ఉత్పత్తులను గ్లోబల్ బ్రాండ్‌గా తీర్చిదిద్దుతాం. గ్రీన్ ఎనర్జీ, నదుల అనుసంధానం, పోర్టులను కూడా అనుసంధానం చేస్తాం. 40 బిలియన్ డాలర్ల ఎగుమతులు.. రూ.30లక్షల కోట్ల పెట్టుబడులను తేవడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. ఉత్పత్తి వ్యయం తగ్గేలా చర్యలు ఉంటాయి. విశాఖ నుంచి భావనపాడు వరకు రహదారి నిర్మిస్తాం. భావనపాడులో 10వేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేస్తాం. ఉత్తరాంధ్రను కూడా పోర్టులు, టూరిజంతో అభివృద్ధి చెందేలా కార్యాచరణ. ఎంఎస్ఎంఈలను బలోపేతం చేసి పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహిస్తాం" అని సీఎం తెలిపారు.

## భారీ వర్షాలపై అప్రమత్తం

**(1వపేజీ తరువాయి)**నివేదించాలని సూచించారు. విజయనగరం జిల్లా గుర్లలో అతిసారంతో ఐదుగురి మృతిపై సీఎం విచారం వ్యక్తం చేశారు. మంగళవారం ఒక్కరోజే నలుగురు మృతి చెందారన్న సమా చారంపై ఆరా తీశారు. ప్రస్తుతం ఆ ప్రాంతం లో బాధితుల పరిస్థితి, చికిత్స వివరాలు తెలుసుకున్నారు. అన్నమయ్య జిల్లాలో ఆలయ ధ్వంసం ఘటనను ఖండించారు. కదిరినాథునికోట అభయాంజనేయస్వామి ఆలయంపై దాడిపై విచారణకు ఆదేశించారు. సమగ్ర విచారణ జరిపి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

## ఉచిత ఇసుక విధానంపై ఫిర్యాదులు

**(1వపేజీ తరువాయి)**ఇన్‌ఛార్జి మంత్రులు బాధ్యత తీసుకోవాలన్నారు. ఆంక్షల పేరుతో అధికారులు వేధిస్తున్నారని ఈ సందర్భంగా కొందరు మంత్రులు సీఎం దృష్టికి తెచ్చారు. వర్షాల వల్ల ఇబ్బందులు తలెత్తాయని.. ఇకపై అలా ఉండకూడదని సీఎం వివరించారు.

## ఒమర్ అబ్దుల్లా ప్రమాణస్వీకారం

**(1వపేజీ తరువాయి)**లేదు. ఆ విషయంలో మా పోరాటాన్ని కొనసాగిస్తాం" అని జమ్మూకశ్మీర్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ చీఫ్ తారిఖ్ హమీద్ కర్రా వెల్లడించారు. ఇదిలాఉంటే.. కాంగ్రెస్ మూడు మంత్రి పదవులు ఆశించినట్టుగా తెలుస్తోంది. అయితే ఎన్‌సీ మాత్రం ఒకటే ఇచ్చేందుకు ముందుకువచ్చిందని సమాచారం. దాంతో ప్రస్తుతానికి బయట నుంచే మద్దతు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. మరోవైపు, తమ రెండు పార్టీల మధ్య అంతా బాగానే ఉందని ఒమర్ అబ్దుల్లా ఇప్పటికే వెల్లడించారు.


## కొండా,రేవూరిపై అధిష్టానం గుస్సా!

**(1వపేజీ తరువాయి)**మంత్రి కొండా సురేఖ నేరుగా గీసుకొండ పోలీసు స్టేషన్‌కెళ్లడం తదితర కీలక అంశాలపై ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ వద్దకు నివేదిక చేరింది.

మరోవైపు ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, జిల్లా ముఖ్య నాయకులు మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపదాస్ మున్షిని కలిసి మంత్రి సురేఖ వ్యవహరిస్తున్న తీరు గురించి వివరించినట్లుగా పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. మరోవైపు మంత్రి సురేఖ సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి గీసుకొండ పోలీసు స్టేషన్‌లో జరిగినవి, ధర్మారంలో పార్టీ కార్యకర్తలపై జరిగిన దాడులు తదితర అంశాలు వివరించినట్లుగా సమాచారం. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఉమ్మడి జిల్లా రాజకీయాలు హైదరాబాద్ కేంద్రంగా నడిచాయి. బుధవారం సీఎం, పీసీసీ అధ్యక్షుడిని కలిసేందుకు ఎమ్మెల్యేలు నిర్ణయం తీసుకున్నారని సమాచారం.'పార్టీకి నష్టం: స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధుల మధ్య దూరం పెరగడంపై కాంగ్రెస్ అధిష్ఠానం పెద్దలు సీరియస్‌గా ఉన్నారు. చిన్నా చితక విషయాలు పెద్దవి చేసి తరచూ గొడవ పడటం వల్ల పార్టీకి నష్టం వాటిల్లే అవకాశాలున్నాయని పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గాంధీ భవన్‌లో వ్యాఖ్యానించినట్లుగా తెలిసింది.


**2 అంతస్థుల భవంతి అమ్మకం**

హైదరాబాద్ మన్సూరాబాద్‌లో రెండు అంతస్థుల భవనం అమ్మకానికి కలదు. ప్రస్తుతం 30వేల రూపాయల అద్దె ప్రతినెలా వస్తుంది. వాస్తుప్రకారం నిర్మాణం. ఈస్ట్ ఫేస్. ఆసక్తి ఉన్న వారు దిగువ సెల్ నెంబర్‌లో సంప్రదించండి.9246213493



# 40% వైకల్యం ఉందని సీటు నిరాకరించకూడదు

**న్యూఢిల్లీ-నవభూమి:** నిపుణుల కమిటీ నివేదిక ఇస్తే తప్ప పరిమితులకు మించి అంగవైకల్యం ఉందన్న కారణంతో ఎవరికీ ఎంబీబీఎస్ సీటును నిరాకరించకూడదని మంగళవారం సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. 40% అంతకన్నా ఎక్కువ అంగవైకల్యం ఉన్నవారు ఎంబీబీఎస్ చదవడాన్ని అనర్హులంటూ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ రెగ్యులేషన్-1997లోని నిబంధనను సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యంపై ఈ వివరణ ఇచ్చింది. ఈ నిబంధనను సవాలు చేస్తూ ఓంకార్ అనే విద్యార్థి దాఖలు చేసిన వ్యాజ్యంపై సెప్టెంబరు 18న జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌ల ధర్మాసనం తీర్పు చెబుతూ 40 శాతం అంగవైకల్యం ఉందన్న ఒకే ఒక కారణంతో సీటు



నిరాకరించకూడదని తెలిపింది. ఆ విద్యార్థికి సీటు ఇవ్వాలని ఆదేశించింది. వైద్య విద్య కొనసాగించడానికి అశక్తుడంటూ నిపుణుల కమిటీ నిర్ధారిస్తే తప్ప సీటును నిరాకరించకూడదని తెలిపింది. అభ్యర్థి సామర్థ్యాలపై అంగవైకల్య మదింపు మండలి పరీక్షలు జరపాల్సి ఉంటుందని, అంగవైకల్యం కారణంగా వైద్య విద్యను చదవగలరా, లేదా అన్నదానిపై పరీక్షలు జరపాలని తెలిపింది.


నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in



## బానెట్‌పై పడిన ట్రాఫిక్ కానిస్టేబుల్.. కొంత దూరం ఈడ్చుకెళ్లిన కారు, వీడియో వైరల్



**భోపాల్-నవభూమి:** డ్యూటీలో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను ఒక కారు ఢీకొట్టింది. కారు బానెట్‌పై ఆయన పడినప్పటికీ ఆ వాహనాన్ని డ్రైవర్ ఆపలేదు. సుమారు వంద మీటర్ల దూరం వరకు అలాగే ఈడ్చుకెళ్లాడు. చివరకు ఒక మలుపు వద్ద ఆ ట్రాఫిక్ కానిస్టేబుల్ కారు నుంచి అదుపు తప్పి రోడ్డుపై పడటంతో తలకు గాయమైంది. ఆ ప్రాంతంలోని సీసీటీవీలో రికార్డైన ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో ఈ సంఘటన జరిగింది. బుధవారం ఉదయం మాధవ్ నగర్ జంక్షన్ వద్ద ఏఎస్ఐ సతీషన్ సుధాకరన్, హెూంగార్డు రాకేష్‌తో పాటు ట్రాఫిక్ కానిస్టేబుల్ బ్రిజేంద్ర సింగ్ విధుల్లో ఉన్నాడు.

కాగా, నంబర్ ప్లేట్ లేని ఎర్రటి కారు వంతెన వైపు నుంచి రావడాన్ని కానిస్టేబుల్ బ్రిజేంద్ర గమనించాడు. కారును ఆపమని సిగ్నల్ ఇచ్చాడు. అయితే కారు డ్రైవర్ స్పీడ్ పెంచాడు. కానిస్టేబుల్ బ్రిజేంద్రను ఢీకొట్టడంతో కారు బానెట్‌పై అతడు పడ్డాడు. అయినప్పటికీ కారును డ్రైవర్ ఆపలేదు. దీంతో బానెట్‌పై పడిన కానిస్టేబుల్‌ను 100 మీటర్ల వరకు ఈడ్చుకెళ్లాడు. చివరకు హరిశంకర్ పురం కూడలి వద్ద డ్రైవర్ ఒక్కసారిగా కారును మలుపు తిప్పి పారిపోయాడు. దీంతో కానిస్టేబుల్ బ్రిజేంద్ర సింగ్ రోడ్డుపై పడ్డాడు. ఆయన తలకు గాయం కావడంతో వెంటనే హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందించారు. మరోవైపు పోలీసులు ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కారుతో పరారైన నిందితుడ్ని గుర్తించి అరెస్ట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నారు. కాగా, ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను కారు బానెట్‌పై ఈడ్చుకెళ్లిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## 14 అంతస్తుల నివాస భవనంలో అగ్నిప్రమాదం.. ముగ్గురు మృతి




**న్యూఢిల్లీ-నవభూమి:** దేశ ఆర్థిక రాజధాని ముంబై లో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. లోఖండ్‌వాలా కాంప్లెక్స్ లోని ఓ నివాస భవనంలో మంటలు చెలరేగి.. ముగ్గురు మృతి చెందారు. పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. అంధేరీ ప్రాంతంలోని లోఖండ్‌వాలా కాంప్లెక్స్ వద్ద 4వ క్రాస్ రోడ్డులో ఉన్న 14 అంతస్తుల రియా ప్యాలెస్‌లో బుధవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో మంటలు చెలరేగాయి. భవనంలోని 10వ అంతస్తులో మంటలు వ్యాపించాయి. స్థానికులు వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులు సమాచారం అందించారు. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక బృందాలు ఘటనాస్థలికి చేరుకొని మంటలను అర్పివేశారు. ఈ ఘటనలో ముగ్గురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోగా.. పలువురికి తీవ్ర గాయాలైనట్లు అధికారులు తెలిపారు. మృతులు చంద్రప్రకాశ్ సోని (74), కంఠ సోని (74), పెలుబేట (42) గా గుర్తించారు. ప్రమాదానికి గల కారణాలు మాత్రం తెలియరాలేదు. ఈ మేరకు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు.

## హెలికాప్టర్ ఎమర్జెన్సీ ల్యాండింగ్.. చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌కు తప్పిన పెను ప్రమాదం




**న్యూఢిల్లీ-నవభూమి:** భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ కు త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. ఆయన ప్రయాణిస్తున్న హెలికాప్టర్ అత్యవసరంగా ల్యాండ్ అయ్యింది. ఈ ఘటన ఉత్తరాఖండ్‌లో బుధవారం చోటు చేసుకుంది. సీఈసీ రాజీవ్ కుమార్, ఉత్తరాఖండ్ అదనపు సీఈవో విజయ్ కుమార్‌తో కలిసి మున్సియారీకి హెలికాప్టర్‌లో బయల్దేరారు. అయితే, హెలికాప్టర్ పర్వత ప్రాంతాల మీదుగా ప్రయాణిస్తున్న సమయంలో ప్రతికూల వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ముందు జాగ్రత్త చర్యగా పైలట్ హెలికాప్టర్‌ను పిథోరాగఢ్ జిల్లాలో అత్యవసరంగా ల్యాండ్ చేశారు. ప్రస్తుతం హెలికాప్టర్‌లో ఉన్నవారంతా సురక్షితంగా ఉన్నట్లు ఉత్తరాఖండ్ ప్రభుత్వం వెల్లడించింది. వాతావరణం అనుకూలించిన తర్వాత వీరు తమ పర్యటనను కొనసాగిస్తారని పేర్కొంది.

## జమ్ముకశ్మీర్ డిప్యూటీ సీఎంగా సురేందర్ చౌదరి.. ఒమర్ అబ్దుల్లా ఎందుకు ఎంచుకున్నారంటే?



**శ్రీనగర్-నవభూమి:** జమ్ముకశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతం తొలి సీఎంగా ఒమర్ అబ్దుల్లా బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. జమ్ము ప్రాంతానికి చెందిన సురేందర్ చౌదరి డిప్యూటీ సీఎంగా, సకీనా మసూద్, జావేద్ దార్, జావేద్ రాణా, సతీష్ శర్మ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. జమ్ము ప్రజల వాయిస్ కోసం, తన ప్రభుత్వాన్ని కలుపుకొని పోయేందుకు నౌషేరాకు చెందిన ఎన్సీ నేత సురేందర్ చౌదరిని డిప్యూటీ సీఎంగా ఎన్నుకున్నట్లు ఒమర్ అబ్దుల్లా తెలిపారు. అందరినీ వెంట తీసుకెళ్లడమే తమ ప్రయత్నమని అన్నారు. ఖాళీగా ఉన్న మూడు మంత్రి పదవులను త్వరలో భర్తీ చేస్తామని చెప్పారు. అయితే కూటమిలో భాగమైన కాంగ్రెస్ పార్టీకి మంత్రి వర్గంలో ఇంకా స్థానం కల్పించలేదు. కాగా, పీడీపీ, బీజేపీ మాజీ సభ్యుడైన సురేందర్ చౌదరి, జమ్ముకశ్మీర్ బీజేపీ అధ్యక్షుడు రవీందర్ రైనాను నౌషేరా నుంచి 7,819 ఓట్ల తేడాతో ఓడించారని ఒమర్ అబ్దుల్లా తెలిపారు. ఈ ప్రభుత్వం తమదేనని జమ్మూ ప్రజలు భావించేందుకే ఈ ప్రాంతానికి చెందిన చౌదరిని ఉప ముఖ్యమంత్రిగా ఎన్నుకున్నట్లు చెప్పారు.

# కలలలో సమాచార మార్పిడి... వాస్తవంగా మారిన సైన్స్ ఫిక్షన్ కాన్సెప్ట్!



**న్యూఢిల్లీ-నవభూమి:** కల అనేది పూర్తిగా వ్యక్తిగతంగా ఉంటుంది. ఒకరికి వచ్చే కల మరొకరికి చెబితే తప్ప తెలుసుకునే అవకాశం ఉండదు. ఇక కలలో సమాచార మార్పిడి అనేది సైన్స్ ఫిక్షన్ కాన్సెప్ట్ తప్ప మరొకటి కాదని అంటారు. ఈ సమయంలో... మెదడు తరంగాలను ఉపయోగించి ఇద్దరు వ్యక్తులు తమ కలలలో కమ్యునికేట్ చేశారని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. . సైన్స్ ఫిక్షన్ కాన్సెప్ట్ ను వాస్తవంగా మార్చారు కాలిఫోర్నియాలోని శాస్త్రవేత్తలు. ఇందులో భాగంగా 'రెమ్ స్పేస్' అనే సంస్థ.. ఇద్దరు వ్యక్తులు నిద్రలో ఉన్నప్పుడు, స్పష్టమైన కలలు కంటున్నప్పుడు.. వారి మధ్య టూవే కమ్యునికేషన్ ను సక్సెస్ ఫుల్ గా ఏర్పాటుచేసింది. ఆర్.ఈ.ఎం (రెమ్) అనగా... రాపిడ్ ఐ మూవ్ మెంట్!డైలీ మెయిల్ ప్రకారం... దీనికి సంబంధించిన ప్రయోగం సెప్టెంబర్ 24న జరిగింది. ఈ సమయంలో... డ్రిఫ్టింగ్ కు ముందు.. ఇందులో పాల్గొనేవారికి వారి మెదడు కార్యకలాపాలు, నిద్రా విధానలను నిజ సమయంలో పర్యవేక్షించే ప్రత్యేక పరికరాలను కనెక్ట్ చేశారు. ఇది వారి కలల స్థితిని ట్రాక్ చేస్తుంది. ఇందులో ముందుగా.. మొదటి పార్టిసిపెంట్ స్పష్టమైన కలలోకి ప్రవేశించిన తర్వాత, సిస్టం మెదడు కార్యకలాపాలలో మార్పును గుర్తించింది. ఈ సమయలో కలలుకనేవారికి నిద్రలో ఉన్నప్పుడు "జిలక్" అనే పదం ఇయర్ బడ్ ల ద్వారా వినిపించారు. ఆ వ్యక్తి ఈ పదం విన్న తర్వాత బిగ్గరగా రిపీట్ చేసాడు. %ూశ్రీంశీ =ఘుం% - ఒక హత్య.. ఒక హత్యాయత్నం.. కెనడా-ఇండియా-అమెరికా రగడ కాసేపటి తర్వాత రెండవ పార్టిసిపెంట్ కూడా స్పష్టమైన కల స్థితికి చేరుకున్న తర్వాత.. ఇయర్ బడ్ ద్వారా "జిలక్" అనే పదాన్ని పంపించారు. ఈ సమయంలో ఆమె కూడా తన కలలో ఆ పదాన్ని విని బిగ్గరగా రిపీట్ చేసింది. మేల్కొన్న తర్వాత తన కలలో విన్న పదం "జిలక్" అని కన్ ఫామ్ చేసింది. ఇది కలలో ఉన్న ఇద్దరు వ్యక్తుల మధ్య ఫస్ట్ సక్సెస్ ఫుల్ కమ్యునికేషన్ ను సూచిస్తుంది. దీంతో... మానసిక ఆరోగ్య చికిత్సకు ఇది ఉపయోగపడుతుందని 'రెమ్ స్పేస్' విశ్వసించింది. దీనిపై స్పందించిన రెమ్ స్పేస్ సీఈవో మైఖేల్ రాదుగా... "నిన్న కలలో కమ్యునికేట్ చేయడం సైన్స్ ఫిక్షన్ లాగా అనిపించింది.. రేపు ఈ టెక్నాలజీ లేకుండా మన జీవితాలను ఊహించుకోలేము" అని తెలిపారు.

## లడ్డూ వ్యవహారంలో స్వతంత్ర సిట్ సభ్యులు.. ఏపీ టీమ్ వీరే!



**తిరుమల-నవభూమి:** తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వాడారంటూ తెరపైకి వచ్చిన ఆరోపణలు దేశంలో ఎంత ప్రకంపనలు రేపాయనే సంగతి తెలిసిందే. ఇటు రాష్ట్ర రాజకీయాల్లోనూ, అటు జాతీయ స్థాయిలోనూ ఈ వ్యవహారం తీవ్ర చర్చనీయాంశం అయ్యింది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో ఈ వ్యవహారంపై దర్యాప్తు జరపాలని.. స్వతంత్ర దర్యాప్తు బృందాన్ని కూడా ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో.. తిరుమల లడ్డూ వ్యవహారంలో సుప్రీంకోర్టు సిట్ ఏర్పాటుపై ఏపీ డీజీపీ ద్వారకా తిరుమలరావు కీలక వ్యాఖ్యలు చేశారు. ఇదే సమయంలో సిట్ అధికారుల పేర్లు వెల్లడించారు. అవును... తిరుమల లడ్డూ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వ ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని సుప్రీంకోర్టు అనుమతించలేదని.. సున్నితమైన ఈ అంశంలో స్వతంత్ర దర్యాప్తు జరగాలనే ఉద్దేశ్యంతోనే సిట్ ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈ స్పెషల్ టీంలో ఆంధ్రప్రదేశ్ నుంచి సభ్యులును ఫైనల్ చేసినట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా.. స్పెషల్ సిట్ కు రాష్ట్రం నుంచి సర్వశ్రేష్ఠ త్రిపాటీ, గోపీనాథ్ శెట్టి పేర్లను పంపినట్లు ఏపీ డీజీపీ వెల్లడించారు. వీరిలో సర్వశ్రేష్ఠ త్రిపాఠి.. సుప్రీంకోర్టు తీర్పుకు ముందు ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ కు అధిపతిగా నియమితులయ్యారు! మొత్తం 9మంది సభ్యులతో ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేయగా.. సుప్రీం ప్రత్యేక సిట్ ఏర్పాటు చేయాలని ఆదేశించింది. కాగా... తిరుమల లడ్డూ వ్యవహారంపై దేశవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమైన నేపథ్యంలో.. పలువురు సుప్రీంకోర్టులో పిటిషన్స్ దాఖలు చేశారు. ఇందులో భాగంగా బీజేపీ నేత సుబ్రమణ్యస్వామి, వైసీపీ నేత వైవీ సుబ్బారెడ్డి సహా పలువురు సుప్రీంను ఆశ్రయించారు. ఈ పిటిషన్లను విచారించిన సుప్రీం... ఐదుగురు సభ్యులతో స్వతంత్ర దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించింది.

### ఏపీలో మొదలైన కొత్త లిక్కర్ షాపులు..

# మద్యం ధరల్లో మార్పులివే!



**అమరావతి-నవభూమి:** ఆంధ్రప్రదేశ్‌లో మద్యం షాపుల కేటాయింపులకు సంబంధించిన లాటరీల ప్రక్రియ ముగిసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం నాడు రాష్ట్రవ్యాప్తంగా కొత్త ప్రైవేటు మద్యం దుకాణాలు తెరుచుకున్నాయి. చంద్రబాబు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చినమేరకు క్వాలిటీ మద్యం అమ్ముతున్నామని షాపు యజమానులు చెబుతున్నారు! . ఏపీలో కొత్త లిక్కర్ షాపులు ప్రారంభమయ్యాయి. కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన లిక్కర్ పాలసీలో భాగంగా వీటి నిర్వహణ ప్రైవేటు వ్యక్తులకు కేటాయించింది. ఈ సమయంలో కొత్త దుకాణాలకు మార్గదర్శకాలను సైతం ప్రభుత్వం ఖరారు చేసింది. ఈ సమయంలో లిక్కర్ ధరల్లో స్వల్ప మార్పులు చేసింది! గత ప్రభుత్వం ప్రారంభించిన ప్రభుత్వ మద్యం దుకాణాలను మూసివేసిన కూటమి ప్రభుత్వం.. నూతన లిక్కర్ పాలసీలో భాగంగా కొత్త లిక్కర్ షాపుల నిర్వహణ ప్రైవేటు వ్యక్తులకు అప్పగించింది. ఈ నేపథ్యంలో సోమవారం లాటరీ ప్రక్రియ పూర్తవ్వగా.. బుధవారం షాపులు ఓపెన్ అయ్యాయి. కొత్త స్టాకుతో షాపులు కళకళలాడుతున్నాయని అంటున్నారు. లైసెన్స్ దక్కించుకోవడానికి.. షాపులు ఓపెన్ చెయ్యడానికీ మధ్య ఒక్కరోజే వ్యవధి ఉండటంతో వ్యాపారులు ప్రస్తుతానికి టెంపరరీగా షాపులను ప్రారంభించారు! త్వరలో పూర్తి స్థాయిలో భారీ ఎత్తున తమ షాపులను సకల సౌకర్యాలతోనూ నిర్వహిస్తామని చెబుతున్నారు. ఇక గతంలో ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకూ టైమింగ్స్ ఉండగా.. ఇప్పుడు వాటిని మార్చారు. ఇందులో భాగంగా ఉదయం 10 గంటలకే షాపులు ఓపెన్ చేయొచ్చని.. రాత్రి 10 గంటల వరకూ మద్యం దుకాణాలను తెరచి ఉంచొచ్చని ప్రభుత్వం వెల్లడించింది. ఇదే సమయంలో మద్యం ధరల విషంలోనూ ఏపీ ప్రభుత్వం స్వల్ప మార్పులు చేసింది. ఈ మేరకు అమ్మకాలపై రెండు శాతం సెస్ విధిస్తూ తాజాగా ఉత్తర్వులు జరీ చేసింది. ఏదైనా ఐ.ఎం.ఎఫ్.ఎల్. బాటిల్ ఎమ్మార్పీ ధర రూ.150.50 ఉంటే.. దానిపై రూ.160 వసూలు చేయనుంది. క్వార్టర్ బాటిల్ ధర రూ.90.50 ఉంటే.. ప్రివిలేజ్ ఫీజు ఏపీఎఫ్ కలిపి రూ.100 అవుతుంది. కాగా... క్వార్టర్ లిక్కర్ ధర రూ.99 కే విక్రయించాలని చంద్రబాబు ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే.

### ఒక హత్య.. ఒక హత్యాయత్నం..

# కెనడా-ఇండియా-అమెరికా రగడ

**న్యూఢిల్లీ-నవభూమి:** ఖలిస్థానీ సానుభూతిపరుల హత్యలు, వారిపై దాడులు.. కెనడా-భారత్ మధ్య చరిత్రలో ఎన్నడూ లేనంత రగడకు కారణమైన సంగతి తెలిసిందే. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రపంచంలో ఏ దేశమూ చేయని సాహసానికి కెనడా ఒడిగట్టింది. అయితే, ఈ విషయంలో కెనడాకు పూర్తిగా అండగా నిలుస్తోంది దాని పొరుగు దేశం అమెరికా. కెనడా ప్రధాని ట్రూడో భారత్ పై చేసిన ఆరోపణలను అత్యంత తీవ్రమైనవిగా పేర్కొంది. పైగా ఖలిస్థానీ హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య కేసులో దర్యాప్తునకు భారత్ సహకరించాలని కోరింది. కెనడా మాటే అమెరికా బాట తమ పొరుగునే ఉండే అత్యంత ఆప్త మిత్ర దేశమైన కెనడా మాటను అమెరికా ఎలా ఖండిస్తుంది..? అందుకే ఇండియాను ఆడిపోసుకుంటోంది. తాజా పరిణామాలపై అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి మాథ్యూ మిల్లర్ మాటలు దీనినే స్పష్టం చేస్తున్నాయి. వివిధ వ్యవహారాలపై రోజువారీ బ్రీఫింగ్ సందర్భంగా. కెనడా ఆరోపణలను ఆయన పూర్తిగా సమర్థించారు. వాటిని అత్యంత తీవ్రమైనవిగా అభివర్ణించారు. కాబట్టి భారత్ వాటిని తీవ్రంగా పరిగణించి కెనడాతో దర్యాప్తునకు సహకరించాలని కూడా ఉచిత సలహా ఇచ్చారు. ఇదే సమయంలో భారత్ ను తప్పుబట్టారు. కెనడా-భారత్ బయటకు చెప్పినదానికి అదనంగా మరేమీ వ్యాఖ్యానించంటూనే తమ వైఖరి ఏమిటో బయటపెట్టారు. భారత్ తమకు శక్తిమంతమైన భాగస్వామి అని.. ఇరు దేశాల మధ్య దౌత్య



బంధం చాలా బలంగా ఉందని వ్యాఖ్యానించారు. అటు నిజ్జర్.. ఇటు పన్నూ.. నిరుడు జరిగిన హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య కేసు కెనడా గట్టిగా పట్టుకుంటే.. తనను హత్య చేసేందుకు కుట్ర పన్నారంటూ మరో వేర్పాటువాది గుర్ పత్వంత్ సింగ్ పన్నూ వేసిన కేసు తెరపైకి వచ్చింది. ఈ మేరకు అతడు వేసిన దావాపై అమెరికా కోర్టు భారత్ కు సమన్లు పంపింది. దీంతో భారత అధికారులు అమెరికా విదేశాంగ, న్యాయ శాఖ అధికారులతో సమావేశం అయ్యారు. పన్నూ హత్యకు కుట్ర పన్నారంటూ చేసిన ఆరోపణలను తీవ్రంగా పరిగణిస్తామని తేల్చిచెప్పారు. అమెరికా విదేశాంగ మంత్రి మాథ్యూ మిల్లర్ ఇదే విషయాన్ని మీడియాకు తెలిపారు. గురుపత్వంత్ సింగ్ పన్నూ ఖలిస్థానీ మద్దతుదారు. గత నవంబరులో న్యూయార్క్ లో అతడిపై జరిగిన హత్యా ప్రయత్నాలను భగ్నం చేసినట్లు అమెరికా తెలిపింది. దీనిపైనే అమెరికా కోర్టు భారత ప్రభుత్వానికి సమన్లు జారీ చేసింది. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్, రా మాజీ చీఫ్ సమంత్ గోయల్, రా ఏజెంట్ విక్రమ్‌యాదవ్, భారతీయ వ్యాపారవేత్త నిఖిల్ గుప్తా పేర్లు ఈ సమన్లలో ఉన్నాయి. భారత ప్రభుత్వ ఉద్యోగితో కలిసి పన్నూను హత్య చేసేందుకు భారతీయుడు నిఖిల్ సుపారీ ఇచ్చారని అమెరికా న్యాయవాదులు అభియోగాలు మోపారు. కాగా, గుప్తాను చెక్ రిపబ్లిక్ పోలీసులు అరెస్టు చేశారు. అమెరికా సూచనల మేరకే ఇలా చేసినట్లు వారు వెల్లడించారు. పన్నూ హత్యకు కుట్రపై అమెరికా ఆరోపణలను భారత్ ఖండించింది. దీనిపై దర్యాప్తు బృందాన్ని సైతం ఏర్పాటుచేసింది.

## జన్ సూరాజ్ పార్టీ అభ్యర్థిగా ఆర్మీ మాజీ వైస్ చీఫ్.. బీహార్ ఉప ఎన్నికల్లో పోటీకి దించిన ప్రశాంత్ కిషోర్




**పాట్నా-నవభూమి:** రాజకీయ వ్యూహకర్త నుంచి రాజకీయ నేతగా మారిన ప్రశాంత్ కిషోర్ పార్టీ జన్ సూరాజ్, బీహార్‌లో తొలిసారి పోటీకి సిద్ధమైంది. తరారీ అసెంబ్లీ స్థానం ఉప ఎన్నికకు ఆర్మీ మాజీ వైస్ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ కృష్ణ సిన్హాను అభ్యర్థిగా బుధవారం ప్రకటించింది. ఈ సందర్భంగా ప్రశాంత్ కిషోర్ మీడియాతో మాట్లాడారు. అక్రమ ఇసుక తవ్వకాలు, ఇతర మాఫియాకు పర్యాయపదంగా మారిన తరారీ స్థానంలో ఆర్మీ స్టాఫ్ ఏకైక వైస్ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ సిన్హా అభ్యర్థిత్వాన్ని ప్రకటించడం గర్వకారణమని అన్నారు. వచ్చే నెలలో జరునున్న మరో మూడు స్థానాల ఉప ఎన్నికలకు కూడా తమ పార్టీ అభ్యర్థులను ప్రకటిస్తామని చెప్పారు. కాగా, ఈ సందర్భంగా జన్ సూరాజ్ పార్టీ అభ్యర్థి లెఫ్టినెంట్ జనరల్ సింగ్ మాట్లాడారు. అగ్నివీర్ పథకం పట్ల తాను సంతోషంగా లేనని అన్నారు. రెండేళ్ల కిందట దీనిని రూపొందించినప్పుడు తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొన్నట్లు వెల్లడించారు. సొంత ప్రాంతమైన తరారీపై తనకున్న ప్రేమ వల్ల హాయిగా గడిచిపోతున్న జీవితాన్ని వదులుకున్నట్లు వివరించారు. మరోవైపు ప్రతిపక్ష 'ఇండియా' కూటమిలో భాగమైన సీపీఐ(ఎంఎల్) నేత సుదామ ప్రసాద్ లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో భోజ్‌పూర్ జిల్లాలోని తరారీ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైంది.

## జమ్ముకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లాకు శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ-నవభూమి:** జమ్ము కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాకు ప్రధాని నరేంద్రమోదీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఒకప్పటి జమ్ముకశ్మీర్ రాష్ట్రం జమ్ముకశ్మీర్, లఢఖ్ అనే రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విడిపోయిన చాలా రోజుల తర్వాత తొలిసారి జమ్ముకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ ఘన విజయం సాధించడంతో.. ఆ పార్టీ అగ్రనేత ముఖ్యమంత్రి అయ్యారు. దాంతో కేంద్రపాలిత ప్రాంతమైన జమ్ముకశ్మీర్‌కు తొలి సీఎంగా ఒమర్ అబ్దుల్లా గుర్తింపు పొందారు. గతంలో ఆయన జమ్ముకశ్మీర్ రాష్ట్రానికి కూడా ముఖ్యమంత్రిగా పనిచేశారు. జమ్ముకశ్మీర్ ప్రాంతానికి ఇవాళ తొలి సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన నేపథ్యంలో ప్రధాని నరేంద్రమోదీ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. జమ్ముకశ్మీర్ ప్రాంత అభివృద్ధి కోసం తాము ఒమర్ అబ్దుల్లా సర్కారుతో కలిసి పనిచేస్తామని చెప్పారు. కాగా ఒమర్ అబ్దుల్లా బుధవారం మధ్యాహ్నం జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సక్సేనా ఆయనచేత ప్రమాణస్వీకారం చేయించారు. శ్రీనగర్‌లోని షేర్-ఇ-కశ్మీర్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ లో ఆయన ప్రమాణస్వీకార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి వివిధ పార్టీలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరయ్యారు. వారిలో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ, యూపీ మాజీ సీంఎ అఖిలేష్ యాదవ్ తదితరులు ఉన్నారు. కాగా ప్రమాణస్వీకారానికి ముందు ఒమర్ అబ్దుల్లా కూడా జమ్ముకశ్మీర్ అభివృద్ధి కోసం కేంద్రంతో కలిసి పనిచేస్తానని చెప్పారు.

## మరో రెండు విమానాలకు బాంబు బెదిరింపులు



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశంలో పలు విమానాలకు బాంబు బెదిరింపుల పర్వం కొనసాగుతోంది. మంగళవారం ఏకంగా పలు సంస్థలకు చెందిన ఏడు విమానాలకు ఇలాంటి బెదిరింపులు కలకలం సృష్టించిన విషయం తెలిసిందే. తాజాగా బెంగళూరు వెళ్తున్న అకాశా ఎయిర్ ఫ్లైట్ ఢిల్లీకి వస్తున్న ఇండిగో విమానానికి గుర్తు తెలియని వ్యక్తులు బెదిరింపులకు పాల్పడ్డారు. ఆకాశా ఎయిర్‌లైన్ సంస్థకు చెందిన 1335 విమానం 184 మంది ప్రయాణికులు, సిబ్బందితో బుధవారం ఢిల్లీ నుంచి బెంగళూరుకు బయల్దేరింది. అయితే, విమానం టేకాఫ్ అయిన వెంటనే బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో అప్రమత్తమైన పైలట్ విమానాన్ని తిరిగి ఢిల్లీకి మళ్లించారు. అక్కడ మధ్యాహ్నం 2 గంటలకు సురక్షితంగా ల్యాండ్ చేశారు. అనంతరం విమానంలో అధికారులు తనిఖీలు చేపట్టారు.


నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
4 | హైదరాబాద్
గురువారం
17 । అక్టోబర్ । 2024



## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు దీపావళి కానుక.. డీఏ 3 శాతం పెంపు..!



దీపావళి సందర్భంగా ఉద్యోగులకు కేంద్రం గుడ్ న్యూస్ చెప్పబోతున్నట్లు తెలిసింది. డీఏను (కరవు భత్యం) 3 శాతం పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైనట్లు సమాచారం. ఈ మేరకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపినట్లు సంబంధిత వర్గాలను ఊటంకిస్తూ జాతీయ మీడియా పేర్కొంది.బుధవారం ఉదయం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ మేరకు ఆమోదించినట్లు తెలిసింది. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ మధ్యాహ్నం తర్వాత దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉన్నట్లు సమాచారం. కేంద్ర కేబినెట్ నిర్ణయంతో కోటి మందికిపైగా ఉద్యోగులు, పెన్షనర్లకు లబ్ధి చేకూరనుంది.కాగా కేంద్ర ప్రభుత్వం సాధారణంగా ఏటా రెండుసార్లు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల డీఏ పెంచుతుంది. కేంద్రం డీఏను సవరించిన నేపథ్యంలో రాష్ట్రాలు సైతం [illegible] ఉద్యోగులకు ఆ మేరకు డీఏ పెంచే అవకాశం ఉంటుంది. పెరుగుతున్న ధరలకు పరిహారంగా ఉద్యోగులు, పెన్షనర్లకు డీఏ అందజేస్తారు. ఈ ఏడాది మార్చిలో కూడా ఉద్యోగుల డీఏను, పెన్షనర్ల డీఆర్‌ను కేంద్రం 4 శాతం పెంచిన విషయం తెలిసిందే.



## పదేండ్లు జైల్లో ఉన్న నిర్దోషి

ఢిల్లీ పీఠంపై కాంగ్రెస్, బీజేపీ.. ఏ పార్టీ ఉన్నా దేశంలోని ప్రజాస్వామ్యవాదులపై వాటిది ఒకే రకమైన కన్నెర్ర చూపు. ఏ మూలన రాజ్యాంగం, హక్కులు అని నోరెత్తినా ఆ గొంతును శాశ్వతంగా నులిమేసే ప్రయత్నమే చేస్తున్నాయి. అకారణంగా కఠిన చట్టాలను వారిపై ప్రయోగించి జైళ్లలో క్రూర హింసల పాలు చేసి తమ కసిని తీర్చుకుంటున్నాయి. అందుకు నిలువెత్తు సాక్ష్యమే జీఎన్ సాయిబాబా జీవితం.
శారీరకంగా 90 శాతం అంగవైక ల్యం ఉన్న సాయిబాబా గత పదేండ్లుగా దేశంలో సాగుతున్న దుర్మార్గ పాలనకు బలయ్యారు. ఈ నెల 12న హైదరాబాద్‌లోని నిమ్స్ హాస్పిటల్‌లో ఆయన తుదిశ్వాస విడిచారు. జైల్లో అధికారులు ఆయన ఆరోగ్యం పట్ల చూపిన నిర్లక్ష్యమే సాయిబాబా ప్రాణం తీసిం ది. జైలు గోడల మధ్య 'నేను చావును ఎదిరిస్తున్నాను' అన్న ఆయన జైలు బయటే మరణించారు. తొమ్మిదేండ్ల పాటు నాగపూర్ జైల్లోని అండా సెల్ తనను వేపుకు తిన్నా మరణంలో తన పంతాన్ని నెగ్గించుకున్నారు. తన వేదనను కవిత్వం ద్వారా, ఉత్తరాల ద్వారా లోకానికి తెలియజేశారు. 'నేను చనిపోయేలా ఏం చేయాలో వారికి తెలియదు/ ఎందుకంటే నాకు మొలకెత్తే గడ్డి సవ్వడులంటే చాలా ఇష్టం' అని రాశారు.పోలియో వ్యాధి వల్ల కాళ్లు చచ్చుబడిపోయినా, సాయిబాబా శరీరాన్ని ఈడ్చుకుంటూ యూనివర్సిటీల మెట్లెక్కి ఉన్నత చదువులు అందుకున్నారు. ఇంగ్లీష్‌లో పీహెచ్‌డీ చేసి ఢిల్లీలోని కాలేజీలో ప్రొఫెసర్‌గా పనిచేశారు. 2014, మే 9 నాడు కాలేజీ నుంచి ఇంటికి వస్తుండగా పోలీసులు ఆయనను గడ్చిరోలికి తీసుకువెళ్లారు. ఉపా చట్టం కింద కేసు పెట్టి నాగపూర్ సెంట్రల్ జైలుకు పంపి, సర్వదా పోలీసుల నిఘా ఉండే ఎలుకల బోనులాంటి అం డా సెల్‌లో వేశారు. అంగవైకల్యం కారణంగా ఆయనను నిబంధనల మేరకు సౌకర్యాలు కల్పించాలని ఎన్ని విన్నపాలు చేసినా ఫలితం రాలేదు. ప్రభుత్వం పన్నిన భారీ కుట్రలో భాగంగా ఒక కోర్టు బెయిల్ ఇవ్వగానే మరో కోర్టు దాన్ని రద్దుచేసేది.ప్రభుత్వాన్ని కూల్చివేసే కుట్రలో సాయిబాబా భాగమయ్యారని 2017లో గడ్చిరోలి సెషన్స్ కోర్టు ఆయనకు జీవితఖైదు శిక్ష వేసింది. ఈ తీర్పును సమీక్షించాలని ఆయన బాంబే హైకోర్టును ఆశ్రయించారు. ఐదేం డ్ల తర్వాత ఆయన పిటిషన్ బెంచిపైకి వచ్చింది. ఈ కాలం ఆయన అదే జైల్లో దుర్భర జీవితం గడపక తప్పలేదు. 2022లో బాంబే హైకోర్టు.. గడ్చిరోలి సెషన్స్ కోర్టు విధించిన జీవితఖైదు తీర్పును కొట్టివేసి సాయిబాబాను నిర్దోషిగా ప్రకటించింది. ఆ మర్నాడే పునర్విచారణ పేరిట హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు నిలిపివేసింది. మళ్లీ విచారణ మొదలైంది. మరో రెండేండ్ల పాటు అండా సెల్ నరకం కొనసాగింది. చివరికి బాంబే హైకోర్టు 2024, మార్చి 5 నాడు సాయిబాబాను మళ్లీ నిర్దోషిగా ప్రకటించింది. ఎట్టకేలకు మార్చి 6 నాడు జైలు జీవితం నుంచి ఆయనకు విముక్తి లభించింది.పోలీసులు పట్టుకెళ్లిన నాటి నుంచి విడుదలయ్యేదాకా మావోయిస్టులతో తనకు ఎలాంటి సంబంధాలు లేవని సాయిబాబా చెప్తూనే ఉన్నారు. ఆయన మాట నిజమని తేల్చడానికి చట్టానికి పదేండ్లు పట్టింది. చేయని నేరానికి ఎన్ని తిప్పలు పడ్డా బెయిల్ దొరకలేదు. క్యాన్సర్ వ్యాధి బారినపడి చికిత్స పొందుతున్న తల్లిని చూడటానికి అనుమతించలేదు. కొడుకును చూడకుండానే 2020 ఆగస్టు 1న ఆ తల్లి కన్నుమూసింది. చివరి చూపు కూడా ఆయనకు దక్కలేదు. తల్లి అంత్యక్రియల హాజరుకు పెట్టుకున్న పెరోల్ మంజూరు కాలేదు.రాజకీయ పెద్దలైన శరద్ పవార్, సీహెచ్ విద్యాసాగర్‌రావు లాంటి వారి మాటలు కూడా పనిచేయలేదు. ప్రపంచ మానవ హక్కుల సమాజాలు, ఐక్యరాజ్యసమితి అభ్యర్థనలను ప్రభుత్వాలు ఖాతరు చేయలేదు. భారత, మహారాష్ట్ర ప్రభుత్వాలు ఆయన పట్ల కనీస మానవతా దృక్పథం చూపించలేదు. జైల్లో తానెలా ఉండేదీ, తన ఆరోగ్యం ఎలా దెబ్బ తిన్నదీ మొదలైన విషయాలు సాయిబాబా పత్రికల్లో వివరించారు. అండా సెల్‌లో 14 నెలలు గడిపిన తర్వాత అక్టోబర్ 2015లో రాసిన వ్యాసంలో ఆ సమ యం 14 ఏండ్లుగా అనిపించిందన్నారు. తాను మరో వంద నెలలు అక్కడే ఉండవలసి వస్తుందని అప్పటికి ఊహించి ఉండరు.
8 నెలల తర్వాత వెస్టర్న్ కమోడ్ ఏర్పాటుచేశారు. అది కూడా సరిగ్గా పనిచేసేది కాదు. రోజుకు ఒక బకెట్ నీళ్లు మాత్రమే లభించేవి. తనకు వెన్నుపాములో సమస్య ఉందని తెలిసినా పోలీసులు తన చేతులు పట్టుకొని లాక్కుపోయేవారని, దాని వల్ల ఎడమవైపు శరీరం పనిచేయడం మానేసిందని రాశారు. సరైన వైద్యం చేయించకుండా పెయిన్ కిల్లర్స్ ఇచ్చేవా రు. దానివల్ల శరీరం మరిన్ని రోగాలకు నిలయమైంది. జైల్లోకి వెళ్లేముందు కాళ్లు పనిచేయకపోవడం తప్ప తన కు ఏ అనారోగ్యం లేదు. ఎప్పటికప్పుడు వైద్యం అందిస్తే ఆరోగ్యం ఇంతగా దెబ్బతినేది కాదన్నారు.మార్చి 9న విడుదలైన తర్వాత ఢిల్లీలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 'మీ ముందు సజీవంగా కనబడుతున్నాను కానీ, నా శరీరంలోని అవయవాలన్నీ పాడైనాయి' అన్నారు. ఆ మాటన్న 7 నెలలకే, 57 ఏండ్ల వయసులో సాయిబాబా జీవితం ముగియడం విషాదకరం. తాను కోల్పోయిన జీవితానికి ఫలితం దక్కకుండానే నిష్క్రమించడం బాధాకరం. తెలంగాణవాది అయి న సాయిబాబా మరణం పట్ల నేటి కాం గ్రెస్ ప్రభుత్వం ద్వంద్వ వైఖరి ప్రదర్శించింది. గన్‌పార్క్ అమరవీరుల స్తూపం వద్ద శ్రద్ధాంజలి కోసం ఆయన పార్థివదేహాన్ని ఉంచేందుకు ప్రభుత్వం అనుమతివ్వలేదు. కనికరం లేని ప్రభుత్వాల పాలనలో ముగిసిపోయే ప్రజాస్వామ్య యోధుల జీవితాలు ప్రజలను తప్పక చైతన్యపరుస్తాయి.

# పేదరికం ఓ శాపం కాగూడదు ?



**అక్టోబర్ 17 అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవం.**


ఈ భూమి మీద పేదరికానికి మించిన శాపం ఇంకేది లేదు. తర తరాలుగా మానవ జాతిని పట్టి పీడిస్తున్న అతిపెద్ద సమస్య ఇది. ఈ శాపాన్ని రూపుమాపడం అంత సులభం కాదు. పేదరికం నుండి బయట పడడానికి ఒక రోజు చాలదేమోగానీ, పేదరికం లోనికి కూరుకుపోవడానికి ఒక సెకను చాలు. అవి ప్రకృతి ప్రకోపాలు అయినా కావచ్చు లేదా యుద్ధాలు, సంఘర్షణలు లాంటి మానవ నిర్మితచర్యలైనా అవ్వొచ్చు. ప్రకృతి ప్రకోపాలను ఆపడం మనచేతిలో లేదు. కానీ మానవ దాష్టీనానికి బలైన సామాన్యులు ఒక్కరోజులోనే ఈ పేదరికంలోనికి కూరుకు పోతున్నారు. ఇప్పుడు మనం చూస్తున్న ఇజ్రాయిల్ , పాలస్తీనా యుద్ధంలో గాజా స్ట్రిప్ ప్రాంతాన్ని ఉన్న పళంగా ఖాళీ చేసి వెళ్తున్న వారిలో చాలా మంది నిన్నటి వరకూ బాగా బతికినవారే ! మరి రేపటి వారి దుస్థితి ? అలాగే హమాస్ ఉగ్రదాడిలో తన వాళ్లందరినీ కోల్పోయి మిగిలిన కుటుంబాల గతికూడా అంతే !

**పేదరిక నిర్మూలన దినోత్సవం :**

ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 17న అంతర్జాతీయ పేదరిక నిర్మూలన కోసం దినోత్సవాన్ని జరుపుకుంటారు. పేదరిక నిర్మూలన కోసం 2024 అంతర్జాతీయ దినోత్సవం థీమ్ " సామాజిక సంస్థాగత దుర్వినియోగాన్ని అంతం చేయడం – న్యాయమైన, శాంతియుత సమ్మిళిత సమాజాల కోసం కలిసి పనిచేయడం.

**పేదరికం అంటే ?**

పేదరికం కొలవడానికి ఒక ప్రమాణం చాలదు. ఇది ఎన్నో అంశాలపై ఆధారపడి ఉంటుంది. సరళంగా చెప్పాలంటే ఒక వ్యక్తి లేదా కుటుంబానికి కనీస జీవన ప్రమాణాలను భరించే ఆర్థిక వనరులు లేని పరిస్థితిని పేదరికం అని చెప్పొచ్చు. పేదరికం కేవలం ఆర్థిక సమస్య కాదు. ఇది ఒక వ్యక్తి ఆదాయం, సమాజంలో గౌరవంగా జీవించే హక్కు రెండింటి కలబోత. వీరు వారి పేదరికానికి తోడుగా ప్రమాదకరమైన ప్రదేశాలలో పనిచేయడం, సరైన గృహవసతి లేకపోవడం, పోషకాహారాన్ని తినలేకపోవడం, సమన్యాయం పొందలేకపోవడం, రాజకీయ శక్తి లేకపోవడం,




నాణ్యమైన వైద్యం లభించకపోవడం మొదలైన ఇతర పరిస్థితులను కూడా కలిగి వుంటారు. అంతర్జాతీయ నివేదికలు పేదరికాన్ని కొలవడానికి ప్రధానంగా ఒక కుటుంబం ఆరోగ్యం, విద్య , జీవన ప్రమాణాలను కొలమానంగా తీసుకొని నివేదికలు తయారు చేస్తారు. అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఆర్థికవృద్ధి 2000 నుండి వేగవంతమైంది. ఉద్యోగ కల్పన, లింగ సమానత్వం, విద్య ఆరోగ్య సంరక్షణ, సామాజిక రక్షణ చర్యలు, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, వాతావరణ మార్పుల అనుకూలత వంటి రంగాలలో కూడా విజయాలు నమోదు చేయబడ్డాయి. 2030 నాటికి పేదరికాన్ని నిర్మూలించడానికి ప్రస్తుత జనాభా పెరుగుదల రేటును బట్టి, రోజుకు 1.90 డాలర్ల కంటే తక్కువ ఆదాయంతో జీవిస్తున్న వారి సంఖ్యను ప్రతి సంవత్సరం దాదాపు 110 మిలియన్లకు తగ్గించాల్సిన అవసరం ఉంది. ఆ ప్రపంచ సవాలును ఎదుర్కోవడంలో ఐక్యరాజ్యసమితి వ్యవస్థ ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ప్రస్తుత విభాగం 2030 ఎజెండాను సమర్థవంతంగా అమలు చేయడం కోసం అన్ని దేశాలకు పేదరికం తగ్గించడానికి అవసరమైన విధానాలు రూపొందించినప్పుడు అన్ని అంశాల్లోను తగిన మద్దత్తు ఇస్తుంది.

**పేదరికం – ప్రపంచం :**

రెండు రోజుల క్రితం ఐక్యరాజ్యసమితి విడుదలచేసిన నివేదికను ప్రకారం ప్రపంచ జనాభాలో సగం మంది అంటే దాదాపు 350 కోట్ల ప్రజలు రోజుకు 6.85 డాలర్లు కంటే తక్కువ ఆదాయంతో జీవిస్తున్నారు. ఉన్నత మధ్య ఆదాయ దేశాలలో దాదాపు 70 కోట్ల మంది ప్రజలు రోజుకు 2.15 డాలర్ల కంటే తక్కువ సంపాదిస్తూ తీవ్ర పేదరికంలో జీవిస్తున్నారు. ప్రపంచ జనాభాలో ఐదవ వంతు మంది ఇప్పటికీ అధిక అసమానతలతో కూడిన ఆర్థిక వ్యవస్థలలో నివసిస్తున్నారు. వాతావరణ మార్పు పేదరికం తగ్గింపుకు ప్రధాన ముప్పు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు ఐదుగురిలో ఒకరు తమ జీవితకాలంలో తీవ్రమైన వాతావరణ ప్రభావాలకు గురవడం వలన దాని నుండి వారు కోలుకోవడానికి కష్టపడుతున్నారు.

**మన దేశపరిస్థితి:**

2024 నాటికి దాదాపు 12.9 కోట్ల భారతీయులు తీవ్ర పేదరికంలో ఉన్నారు. వీరు రోజుకు సుమారు రూ. 181 కంటే తక్కువ సంపాదిస్తున్నారు. వీరి సంఖ్య 1990లో 43.1 కోట్లుగా ఉండేది. జనాభా పెరుగుదల కారణంగా 1990 కంటే 2024లో ఎక్కువ మంది భారతీయులు దారిద్ర్య రేఖకు దిగువన జీవిస్తున్నారు. 2021లో భారత్‌లో పేదరికం 3.8 కోట్లు తగ్గి 16.749 మిలియన్లకు చేరుకుందని గతంలో ప్రపంచ బ్యాంకు పేర్కొంది. మన దేశంలో పేదరికానికి అనేక కారణాలు ఉన్నాయి. అందరికీ విద్య అందుబాటులో లేకపోవడం, నిరుద్యోగం, ఆరోగ్య సంరక్షణ ఖర్చు ఎక్కువగా ఉండడం, సామాజిక ఆర్థిక అసమానతలు, వేగవంతమైన జనాభా పెరుగుదల, ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ మార్పులు, అవినీతి, సామాజిక మౌలిక సదుపాయాల కొరత ప్రధాన కారణాలుగా చెప్పొచ్చు.

**పరిష్కారాలు:**

స్థిరమైన పెట్టుబడులను ప్రోత్సహించడం, వాతావరణ ప్రమాదాలను తగ్గించడం, సమ్మిళిత వృద్ధిని ప్రోత్సహించే అవకాశాలను సృష్టించడం ద్వారా కొంత మేరకు పేదరికాన్ని రూపుమాపొచ్చు.

**జనక మోహన రావు దుంగ**
**ఫోన్ 8247045230**

# పేదరికానికి మూలం అవినీతే



పేదరికం ఒక ఆర్థిక సమస్య. కాని ఇది దీర్ఘకాలిక సామాజిక సమస్యగా పరిణమించింది. ఎవరైతే సమాజంలో తినడానికి తిండి, నివసించడానికి ఇల్లు, ఒంటిని కప్పుకోడానికి దుస్తులు పొందలేని పరిస్థితిని ఎదుర్కొంటారో వారిని పేదలని, ఆ స్థితిని అనుభవించడాన్ని పేదరికమని అంటారు. పేదరికం అత్యంత తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘన అని సుప్రీంకోర్టు మాజీప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కే.జీ. బాలకృష్ణన్ ఏనాడో చెప్పారు. ప్రభుత్వాలు అమలు పరుస్తున్న వివిధ పథకాల ప్రయోజనాలు అర్హులైన లబ్ధిదారులకు అందుతున్నట్లయితే బహుశా సమస్య కొంతవరకైనా పరిష్కారమై ఉండేది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాలు దాటినా, ఇంకా మనం పేదరికం గురించి మాట్లాడుకునే స్థితిలోనే ఉన్నామంటే పాలకుల నిర్లక్ష్యమే కారణం. నిజానికి ఈ ఏడున్నర దశాబ్దుల కాలంలో దేశం అనేక రంగాల్లో అభివృద్ధిని సాధించింది. ముఖ్యంగా శాస్త్ర, సాంకేతిక రంగాల్లో మన దేశప్రగతి అంబరాన్ని తాకుతోంది. ఇదిచాలా సంతోషమే అయినప్పటికీ, వాస్తవాభివృద్ధికి ఇదొక్కటే కొలబద్దకాదు. ఆకలి తీర్చలేకపోతున్న టెక్నాలజీకి అర్థమేలేదు. జానెడు పొట్ట నింపుకునేందుకు మనిషి పడరాని పాట్లు పడుతున్నాడు. అంతరిక్షంలోకి దూసుకుపోతున్న ఈ రోజుల్లో కూడా ఆకలి కేకలు వినిపించడంకంటే విషాదం ఏముంటుంది?. ప్రపంచ వ్యాప్తంగా 45 దేశాల్లోని 34.5 కోట్ల మంది ప్రజలు తీవ్రమైన ఆకలితో మరణించారని, సగటున ప్రతి సెకనుకు నలుగురు చొప్పున మృత్యువాత పడుతున్నారని నివేదికలు చెబుతున్నాయి. కరోనాకు ముందు నమోదైన ఆకలి చావులతో పోలిస్తే.. ఇప్పుడు రెట్టింపు అయినట్లుగా నివేదికలు వెల్లడిస్తున్నాయి. 75 దేశాలకు చెందిన ఆక్స్ ఫామ్.. సేవ్ ది చిల్డ్రన్.. ప్లాన్ ఇంటర్నేషనల్ వంటి 238 స్వచ్ఛంద సంస్థలు కలిసి ఐక్యరాజ్య సమితి సర్వప్రతినిధి సభ సమావేశాలకు హాజరయ్యే ప్రపంచ నేతలకు రాసిన లేఖలో, ఆకలి కారణంగా చనిపోతున్న వారికి సంబంధించిన సంచలన విషయాలు వారి దృష్టికి తీసుకువెళ్ళాయి. ఒక అంచనా ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా ఆకలి కారణంగా రోజుకు 19700 మంది మరణిస్తున్నారని, 2019తో పోలిస్తే తాజాగా ఆకలి చావులు రెట్టింపు అయినట్లుగా తెలుస్తోంది. 45 దేశాల్లోని మరో ఐదు కోట్ల మంది ప్రజలు కరువుకు చేరువలో ఉన్నారు. 21వ శతాబ్దంలో కరువు



పరిస్థితిలో మార్పులేదు. ఆకలి చావులు అన్నవి కేవలం ఒక దేశానికో.. ఒక ఖండానికో కాదు.. మొత్తం మానవాళికే జరుగుతున్న అన్యాయంగా భావించాలి. ఏదో సాధించేశామని ప్రభుత్వాలు డబ్బా కొట్టుకోవడమేగాని వాస్తవంలో అంతా శూన్యమే. ఏ దేశ స్వాతంత్ర్య, అభివృద్ధి ఫలాలైనా ప్రాథమికంగా అన్నివర్గాల, ప్రజలకు సమానంగా, నిష్పక్షపాతంగా, న్యాయంగా అందినప్పుడే అభివృద్ధికి ఒక అర్థమనేది ఉంటుంది. ఈనేపథ్యంలో ఏడున్నర దశాబ్దుల మన స్వతంత్ర దేశాన్ని చూసినప్పుడు నిరాశే మిగులుతుంది. భిన్నవర్గ, సముదాయాల మన దేశంలో అందరికీ సమాన ఫలాలు అందుతున్నాయా అన్నది కోటి డాలర్లప్రశ్న. నిజంగానే ప్రజలకు మౌలిక సదుపాయాలు లభిస్తున్నట్లయితే ఈనాడు మనం ఇలా చర్చించుకోవాల్సిన పరిస్థితి ఉండేదికాదు. స్వాతంత్ర్యానంతర కాలం నుండి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పల్లె సీమల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని, తాగునీరు, సాగునీరు, రోడ్లు, డ్రైనేజీలాంటి మౌలిక సదుపాయాలతో పాటు, ఉపాధి కల్పనకు ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తున్నామని చెబుతున్నాయి. అయినా ప్రజల జీవన స్థితిగతుల్లో పెనుమార్పులు చోటు చేసుకోలేదు. ఆధునిక సాంకేతిక విప్లవం పల్లె సీమల అభివృద్ధికి ఎంతోకొంత దోహద పడుతున్నప్పటికీ తగినంతగా ఫలితాలను అందించలేక పోతోంది. పేదరిక నిర్మూలనకు ప్రభుత్వాలు అనేక పథకాలు, ప్రణాళికలు రూపొందించి అభివృద్ధి పేర కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నప్పటికీ వ్యవస్థలో వేళ్ళూనుకుపోయిన అవినీతి కారణంగా ఆశించిన ఫలితం కనబడడంలేదు. ఇప్పటికీ కనీస, మౌలిక సదుపాయాలు లేని పల్లెలు లెక్కకు మిక్కిలిగా ఉన్నాయి. ఐక్యరాజ్య సమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో 2030 నాటికల్లా పేదరికాన్ని నిర్మూలించాలన్నఅంశం ఒకటి. కానీ, ఆ గడువు పూర్తయ్యే నాటికి కూడా ప్రపంచ జనాభాలో ఆరు శాతం మంది అంతర్జాతీయ దారిద్ర్య రేఖకు దిగువనే ఉంటారని స్వయంగా ఐ. రా. స నివేదికే వెల్లడించింది. ఈ దరిద్రాన్ని నిర్మూలించాలంటే విభిన్న వ్యూహాలతో ప్రణాళికలు రూపొందించాల్సిన అవసరముంది. అభివృద్ధిని పరుగులు పెట్టించటంతో పాటు దాన్ని అన్ని ప్రాంతాలకూ సమానంగా విస్తరించటంపైనా దృష్టిసారించాలి. దీనికోసం మొట్టమొదట చేయవలసింది అవినీతి నిర్మూలన. అవినీతి నిర్మూలించబడనంతకాలం పేదరిక నిర్మూలన సాధ్యంకాదు. కేవలం అభివృద్ధి జపంతో పేదరికాన్ని అంతం చేయగలమనుకోవటం అతిశయోక్తితప్ప మరేంకాదు. భారత్ వంటి దేశాల్లో వ్యవసాయానికి తగిన ప్రాధాన్యమివ్వటం తప్పనిసరి. మహిళలకు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో సాధికారత కల్పించటం ముఖ్యం. శ్రమ సాంద్ర ఉత్పాదక రంగాన్ని ప్రోత్సహించడం దారిద్ర్య నిర్మూలన దిశగా గొప్ప ముందడుగవుతుంది. నైపుణ్యాల కల్పన, యువతకు విరివిగా ఉపాధి అవకాశాలు కల్పించటంపై ప్రభుత్వాలు దృష్టిసారించాలి. అందరికీ సమాన అవకాశాలు అందుబాటులో ఉండే వాతావరణం సృష్టించాలి. కనీసం అందరికీ సమానంగా విద్య, వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉండే పరిస్థితులు మెరుగు పరచాలి. అన్నిటికీ మించి సంపదను కొంతమంది గుప్పెట నుండి బయట పడేసే విప్లవాత్మక కార్యాచరణ రూపొందించాలి. సంపద వికేంద్రీకరణ జరగక పోతే, అది 'కొంతమంది' గుప్పెట్లోనే బందీగా ఉంటే ధనవంతులు మరింత ధనవంతులుగా, పేదలు మరింత పేదలుగా రూపాంతరం చెందుతారే తప్ప పేదరిక నిర్మూలన జరగదు. మానవ మస్తిష్కాల్లో పరివర్తనా బీజం నాటుకోనంతకాలం మనం ఎన్ని పేదరిక నిర్మూలనా దినోత్సవాలు జరుపుకున్నా ఫలితం దక్కదు. దానికోసం నిర్ణీత సంపద కలిగిన ప్రతి ఒక్కరూ, తమ సంపదలోని కొంతభాగాన్ని స్వచ్ఛందంగా వదులుకోవలసి ఉంటుంది. దీన్నే ఇస్లాం పరిభాషలో 'జకాత్ ' అంటారు. అప్పుడు మాత్రమే పేదరికం అంతమై మానవ సమాజం సుభిక్షంగా వర్ధిల్లుతుంది. ఆశుభదినం కోసం ఎదురుచూద్దాం.

**(అక్టోబర్ 17 అంతర్జాతీయ పేదరిక నిర్మూలనా దినోత్సవం..)**

**– యండి॰ ఉస్మాన్ ఖాన్**
**సీనియర్ జర్నలిస్టు**

## అక్షయ తృతీయ రోజు ఏం చేయాలి, ఏం చేయకూడదంటే



పండుగను జరుపుకుంటారు. ఈ రోజున లక్ష్మీ దేవిని పూజిస్తారు. ఈ సందర్భంగా బంగారం, వెండి లేదా ఏదైనా కొత్త వస్తువును కొనుగోలు చేసే సంప్రదాయం ఉంది. ఈ నేపథ్యంలో అక్షయ తృతీయ రోజున ఏం చేయాలి, ఏం చేయకూడదో ఇక్కడ తెలుసుకుందాం.వైశాఖ మాసం శుక్ల పక్షంలోని తృతీయ తిథి నాడు అక్షయ తృతీయ పండుగను జరుపుకుంటారు. ఈ రోజున లక్ష్మీ దేవిని పూజిస్తారు. పంచాంగం ప్రకారం వైశాఖ మాసంలోని శుక్ల పక్షంలోని తృతీయ తిథి మే 10న ఉదయం 4:17 గంటలకు ప్రారంభమై మే 11న తెల్లవారుజామున 2:50 గంటలకు ముగుస్తుంది. ఈ సందర్భంగా బంగారం, వెండి లేదా ఏదైనా కొత్త వస్తువును కొనుగోలు చేసే సంప్రదాయం ఉంది. ఇలా చేయడం వల్ల ఐశ్వర్యం చేకూరుతుందని నమ్ముతారు. ఈ నేపథ్యంలో అక్షయ తృతీయ రోజున ఏం చేయాలి, ఏం చేయకూడదో ఇక్కడ తెలుసుకుందాం.

అక్షయ తృతీయ రోజున ఏం చేయాలి?

అక్షయ తృతీయ రోజున ఉదయం 5.33 గంటల నుంచి మధ్యాహ్నం 12.18 గంటల వరకు పూజ, స్నాన, దానానికి అనుకూల సమయం

అక్షయ తృతీయ రోజున ఉపవాసం, దానం చేయడం వల్ల పుణ్యఫలం లభిస్తుంది

మీరు చాలా కాలంగా బంగారం కొనాలని ఆలోచిస్తున్నట్లయితే, అక్షయ తృతీయ దీనికి చాలా పవిత్రమైన రోజు

మీరు కొత్త వ్యాపారం లేదా పనిని ప్రారంభించాలని ఆలోచిస్తున్నట్లయితే, అక్షయ తృతీయ రోజు దానికి చాలా అనుకూలమైనదిఅక్షయ తృతీయ కొత్త వాహనాన్ని కొనుగోలు చేయడానికి కూడా చాలా పవిత్రమైనదిగా పరిగణించబడుతుందిమీరు కొత్త ఇల్లు లేదా ఆస్తిని కొనుగోలు చేయాలని ఆలోచిస్తున్నట్లయితే, అక్షయ తృతీయ రోజు దీనికి చాలా అనుకూలమైనది

అక్షయ తృతీయ రోజున ఏం చేయకూడదు?

సానుకూల దృక్పథాన్ని కొనసాగించండి, వాదనలకు దిగకండి. అవి దురదృష్టాన్ని ఆకర్షించగలవు

విలువైన వస్తువును కొనుగోలు చేయడం ఒక సంప్రదాయం అయితే, ఆర్థిక ఒత్తిడికి దారితీసే అధిక ఖర్చులను నివారించండి

అక్షయ తృతీయ రోజు మద్యం సేవించడం, ధూమపానం చేయడం లేదా జుట్టు, గోర్లు కత్తిరించడం వంటి కార్యకలాపాలకు దూరంగా ఉండండి

ఈ రోజున డబ్బు తీసుకోవడం లేదా అప్పు ఇవ్వడం అశుభకరమైనదిగా పరిగణించబడుతుంది

మీరు చాలా కాలంగా ఏదైనా ఉపవాసం పాటిస్తున్నట్లయితే, అక్షయ తృతీయకు ముందు లేదా అక్షయ తృతీయ రోజున ఆ ఉపవాసాన్ని విరమించకూడదని గుర్తుంచుకోండి

# నవతార





## చర్మాన్ని మెరిపించండిలా...

కాంతులీనే చర్మం కావాలని ప్రతి మహిళ కోరుకుంటుంది. అందుకోసం మార్కెట్లో దొరికే క్రీమ్‌లు, ఫేస్‌ప్యాక్‌లను ఆశ్రయిస్తుంటారు. అయితే ఇవి కొన్నిసార్లు చర్మానికి హాని కలిగిస్తుంటాయి. అలా కాకుండా మన ఇంట్లో దొరికే వస్తువులతోనే నిగనిగలాడే చర్మాన్ని సొంతం చేసుకోవచ్చు. హెర్బల్ ఫేస్ ప్యాక్‌లు: ఒక బౌల్‌లో ఒక చెంచా శనగపిండి, ఒక చెంచా పెరుగు, అర చెంచా తేనె వేసి బాగా కలిపి ముఖానికి, మెడకి రాసుకోవాలి. మునివేళ్లతో మృదువుగా మర్దన చేయాలి. పావుగంట తరవాత చల్లని నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. మెత్తని టవల్‌తో సున్నితంగా అద్దుకుంటూ తుడవాలి. ఈ ప్యాక్ వల్ల చర్మానికి తేమ అంది నిగారింపు సంతరించుకుంటుంది. ముఖాన్ని సహజంగా మెరిపించడంలో ముల్తానీ మట్టి ప్రముఖ పాత్ర పోషిస్తుంది. టీనేజ్‌లో మొటిమలకు కారణమైన సెబమ్ ఉత్పత్తిని ఇది అడ్డుకుంటుంది. రెండు చెంచాల ముల్తానీ మట్టిలో కొంచెం పెరుగు, కొన్ని చుక్కల రోజ్ వాటర్ వేసి ప్యాక్‌లా చేసి ముఖమంతా పట్టించాలి. ఇరవై నిమిషాల తరవాత నీళ్లతో కడగాలి. ఈ ప్యాక్ వల్ల చర్మ రంధ్రాలు శుభ్రపడి మొటిమలు, మచ్చలు తగ్గుతాయి. హోమ్ మేడ్ స్క్రబ్: బౌల్‌లో ఒక చెంచా బియ్యప్పిండి, ఒక చెంచా పెరుగు, ఒక చెంచా తేనె వేసి బాగా కలిపి మిశ్రమాన్ని ముఖానికి, చేతులకు, పాదాలకు పట్టించాలి. ఆరిన తరవాత వేళ్లతో ఒకే దిశలో మర్దన చేస్తూ ప్యాక్‌ను తొలగించాలి. తరవాత చల్లని నీళ్లతో కడగాలి. ఇలా రెండు వారాలకు ఒకసారి చేస్తే మృత కణాలు తొలగిపోతాయి. పోషకాహారం: చర్మం ఆరోగ్యంగా ఉండాలంటే పోషకాహారం తప్పనిసరి. ప్రతి రోజూ విటమిన్లు, మినరల్స్, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ అందేలా డైట్ ప్లాన్ చేసుకోవాలి. వాల్‌నట్స్, చియా సీడ్స్, వేరుశనగల్లో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా ఉంటాయి.

# సంప్రదాయ రుచులకు ఈమే చిరునామా



ఆడపడుచు సలహాతో
ఐదొందల రూపాయలతో మొదలుపెట్టారు. నడివయసులో
వ్యాపారానికి శ్రీకారం చుట్టి... ఆరు పదులు దాటినా
అదే ఉత్సాహంతో పని చేస్తున్నారు.
పచ్చళ్లు... పొడులు... అప్పడాలు... అంచెలంచెలుగా ఎదుగుతూ...
సంస్థను నేడు కోట్ల టర్నోవర్‌కు తీసుకువెళ్లారు.
ఎందరో మహిళలకు ఉపాధి కల్పిస్తూ... సంప్రదాయ రుచులను ప్రపంచంలోని తెలుగువారందరికీ అందిస్తున్నారు.
'జంధ్యాల ఫుడ్స్' అధినేత
జయప్రద జంధ్యాలతో మాటామంతి.

"అంతకముందు మా కుటుంబంలో వ్యాపారం చేసినవారు ఎవరూ లేరు. నాకూ ఆ ఆలోచన ఎప్పుడూ రాలేదు. అదికూడా పెళ్లయ్యి, ఇద్దరు పిల్లలు పుట్టాక బిజినెస్ గురించి ఆలోచించేంత సమయం ఎక్కడుంటుంది! నాటి పరిస్థితులవల్ల అనుకోకుండా నా అడుగులు ఇటువైపు పడ్డాయి. ఇదంతా ఇరవయ్యేళ్ల కిందట మొదలైంది. మా నాన్నావాళ్లది గుంటూరు జిల్లా రేపల్లె దగ్గర పెదపులివర్రు. దర్శకుడు కె.విశ్వనాథ్ గారి ఊరు. మా అత్తగారిది తెనాలి. 1986లో నా పెళ్లి అయింది. మావారు జంధ్యాల శివరామకృష్ణకు హైదరాబాద్ ఐడీపీఎల్ మార్కెటింగ్ విభాగంలో ఉద్యోగం. నేను తెనాలి ప్రభుత్వ పాఠశాలలో హిందీ టీచర్‌గా చేసేదాన్ని. 1983లో ఉద్యోగంలో చేరాను. పెళ్లయ్యాక రెండేళ్లు తెనాలిలో మా అత్తగారి దగ్గర ఉన్నాను. అయితే ఆయన హైదరాబాద్‌లో... నేను తెనాలిలో... ఇలా అయితే కుదరదనుకున్నా. దాంతో 1990లో ఉద్యోగానికి రాజీనామా చేసి హైదరాబాద్‌కు వచ్చేశాను. సాధారణంగా కష్టపడి సాధించుకున్న ప్రభుత్వ ఉద్యోగం వదులుకోవడానికి ఎవరూ ఇష్టపడరు. కానీ మావారి కోసం ఆ నిర్ణయం తీసుకున్నాను. ఇక్కడ ఏదోఒక స్కూల్లో చేరవచ్చని అనుకున్నా. చాలాచోట్ల ప్రయత్నించాక ఒక స్కూల్లో ఉద్యోగం వచ్చింది.

**ఆడపడుచు ఆలోచన...**

కొన్నాళ్లకు మా అత్తగారు పోయారు. మా ఆడపడచులు, మరిది పెళ్లిళ్లు వచ్చాయి. మావారే ఇంటికి పెద్ద కావడం... ఆ బాధ్యతలన్నీ చూసుకోవాల్సి రావడంతో స్కూలు మానేశాను. అదే సమయంలో ఐడీపీఎల్ కూడా ఒడుదొడుకులు ఎదుర్కొంటోంది. దాంతో ఆయన వీఆర్ఎస్ తీసుకున్నారు. ఆయన ఖాళీ. నేనూ ఖాళీ. ఇద్దరు పిల్లలు, వారి చదువులు... ఇల్లు గడవాలి కదా. ఏంచేద్దామని ఆలోచిస్తున్నాం. ఒక రోజు మా ఆడపడుచు వచ్చింది. 'వదినా... నువ్వు పచ్చళ్లు, పొడులు బాగా చేస్తావు కదా. రూ.500 ఇస్తాను. దాంతో మొదలుపెట్టు' అంది. ఆ సలహా నాకు బాగా నచ్చింది. ఆ ఐదొందలతో కందిపప్పు, ఇతర దినుసులు తీసుకువచ్చాను. కంది పొడి కొట్టి తెలిసినవాళ్లదరికీ ఇచ్చాను. చాలా బాగుందన్నారు.

**స్నేహితులకు పంపిస్తే...**

తరువాత రెండు కిలోలు టమాటా, కిలో అల్లం తెచ్చి పచ్చళ్లు చేసి ఇచ్చాం. అందరికీ నచ్చాయి. మావారు... 'జయప్రద చేసింది' అని తన స్నేహితుడికి పంపించారు. ఆ పచ్చళ్లను తమ ఇంట్లో డైనింగ్ టేబుల్ మీద పెట్టుకున్నారట. అదే సమయంలో వాళ్లింటికి విదేశాల నుంచి స్నేహితులు వచ్చారు. వాళ్లు ఆ పచ్చళ్లు తిని, తమకూ కావాలని అడిగారు. వాళ్ల కోసం మొదటిసారి కాస్త ఎక్కువ మొత్తంలో పచ్చళ్లు చేసి ఇచ్చాను. అందరూ బాగున్నాయంటున్నారు. అలాంటప్పుడు దీన్ని ఒక వ్యాపారంగా మారిస్తే ఎలా ఉంటుంది? ఆ ఆలోచనతో 2003లో ఇంట్లోనే పచ్చళ్ల తయారీ మొదలుపెట్టాను. అప్పుడు నా వయసు నలభై ఏళ్లు. నెలకు ఐదు వేలు సంపాదిస్తే చాలనుకున్నాను. ఒక అమ్మాయిని హెల్పర్‌గా పెట్టుకున్నాను. పచ్చళ్లు, పొడులు... ఏదైనా పొద్దున అడిగితే సాయంత్రానికల్లా చేసేదాన్ని. మావారు కిలో అయినా... పావుకిలో అయినా ఆర్డర్లు ఇంటికి వెళ్లి ఇచ్చేవారు. వచ్చిన డబ్బుతో సరుకులు కొని... రొటేషన్ చేసేదాన్ని. గ్రైండర్ ఉన్నా... మంచి రుచి కోసం అన్నీ రోట్లోనే రుబ్బేదాన్ని. క్రమంగా ఆర్డర్లు పెరిగాయి. ఆరేడేళ్ల తరువాత ఒడియాలు కూడా ప్రారంభించాం. అప్పటినుంచి గ్రైండర్ వాడకంమొదలైంది.

**ఇరవై దేశాలకు...**

కొన్నేళ్లకు మా 'జంధ్యాల ఫుడ్స్' పేరిట వెబ్‌సైట్ తెరిచాం. ఇప్పుడు ఇరవై రకాల పచ్చళ్లు, పది రకాల పొడులు, అప్పడాలు, ఒడియాలు తయారు చేస్తున్నాం. చర్లపల్లిలో తయారీ యూనిట్ ఉంది. హబ్సిగూడలో ఒక స్టోర్ నెలకొల్పాం. మరో రెండు చోట్ల కూడా స్టోర్స్ ప్రారంభించే ఆలోచన ఉంది. అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ సహా ఇరవై దేశాలకు మా ఉత్పత్తులు వెళతాయి. యాభై మందికి పైగా మా సంస్థలో పని చేస్తున్నారు. అందులో అత్యధికంగా మహిళలే. ఐదు వందలతో మొదలైన మా సంస్థ ఇప్పుడు 3.6 కోట్ల టర్నోవర్‌కు చేరింది

**వాళ్లిద్దరి నుంచే...**

నేను వంటలు ఇంత బాగా చేయడానికి కారణం... మా అమ్మ, తరువాత మా అత్తగారు. తెనాలిలో అత్తగారి దగ్గర ఉన్నప్పుడు చాలా వంటలు నేర్చుకున్నా. ఏదైనా వెరైటీ చూస్తే... అది బాగా వచ్చేవరకు నిద్రపోను. వంట చేయడం నాకు ఎంతో ఇష్టం. మన సంప్రదాయ వంటలన్నీ బాగా చేస్తాను. అయితే మసాలాల జోలికి వెళ్లను. నాణ్యత, రుచి... ఇదే మా ప్రత్యేకత.

**ఇష్టంతో కష్టపడితేనే...**

వ్యాపారంలో రాణించాలనుకొనే మహిళలకు నేను చెప్పేది ఏంటంటే... ఇష్టంతో కష్టపడాలి. ఆసక్తి ఉంటేనే ఇందులోకి అడుగుపెట్టాలి. ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని... పైకి ఎదగాలన్న పట్టుదల, కసితో నిజాయతీగా పని చేయాలి. స్వశక్తితో మనం నిలదొక్కుకొంటే... మనతోపాటు మరికొందరికి ఉపాధి మార్గం చూపినవారం అవుతాం. వ్యాపారంలో ఎంత బిజీగా ఉన్నా ఒక మహిళగా ఇంటి బాధ్యతలు కూడా తప్పవు. రెండిటినీ సమన్వయం చేసుకొంటూ ముందుకు సాగడం పెద్ద సవాలే. కానీ ఏ సవాలునైనా స్వీకరించడానికి సిద్ధంగా ఉండాలి.

**లేటు వయసులో మొదలుపెట్టి...**

నలభై ఏళ్ల వయసులో కొత్తగా వ్యాపారం ఏంటని చాలామంది అనుకున్నారు. కానీ లక్ష్య సాధనలో పట్టుదల ఉంటే వయసు అవరోధం కాదనేది నా నమ్మకం. ప్రత్యేకించి ఆ వయసు మహిళలు... ఇల్లు, పిల్లలు, వారి భాధ్యతల్లో మునిగిపోతారు. వాటి నుంచి బయటికి రావడం అంత సులువు కాదు. అయితే ఎంచుకున్న రంగంలో మహిళలు రాణించాలంటే... కుటుంబ సహకారం ఎంతో అవసరం. నా విషయమే తీసుకొంటే... నేను బిజినెస్ ప్రారంభించేనాటికి మా అమ్మాయి సీఏ ఇంటర్ అయిపోయింది. మా అబ్బాయీ పెద్ద తరగతుల్లో ఉన్నాడు. ఆర్థికంగా ఇబ్బందులు. అయితే నాకు ఇంట్లో ఖాళీ దొరికింది.

మావారితో పాటు పిల్లలు కూడా నాకు సహకరించారు. వారందరి సహకారంతోనే ఇంతవరకు రాగలిగాను. ఇప్పుడు మా అమ్మాయికి పెళ్లయింది. మా అబ్బాయి నా బిజినెస్ చూసు కొంటున్నాడు.

# వేసవి కాలం.. బరువు తగ్గే సమయం



శీతాకాలం కంటే ఎండాకాలంలో మనం ఎక్కువ చురుగ్గా ఉంటాం. చెమట రూపంలో శరీరంలోని నీరు బయటికి పోతుంది. ఈ సమయంలో అన్నం సరిగ్గా తినాలనిపించదు. నీళ్లు ఎక్కువగా తాగుతాం. ఈ కారణంగా బరువు తగ్గుతాం. చలికాలంలో వెయిట్‌లాస్ అయిన వాళ్లు దాన్ని కొనసాగించడానికి కూడా ఇది మంచి సమయం.


ఉక్కపోతగా ఉంటుంది కనుక, ఎక్కువ సేపు ఇంట్లో ఉండలేం. చల్లగాలి కోసం కాస్త బయట నడుస్తూ ఉంటాం. అలాగే స్విమ్మింగ్ చేసేందుకూ ఈ సమయంలో చాలామంది ఆసక్తి చూపిస్తారు. అలా ఫిజికల్ యాక్టివిటీ పెరుగుతుంది. ఈ సమయంలో ఎక్కువ దాహం వేయడం వల్ల ఆహారం సరిగ్గా తీసుకోలేం. అలాంటప్పుడు నీళ్లతో పాటు మజ్జిగ, షర్బత్‌లు, పండ్ల రసాలు, జావ తదితర ద్రవాలు తీసుకుంటే శరీరానికి కావలసిన పోషకాలు అందుతాయి.

అలాగే ఘనాహారం తినాలనిపించదు కాబట్టి పప్పుచారు, గోధుమ, జొన్న గటకలాంటివి తినొచ్చు. వీటి ద్వారా శరీరానికి కావాల్సిన ప్రొటీన్ అందుతుంది. మామిడి పండ్లలో క్యాలరీలు ఎక్కువగా ఉంటాయి. డయాబెటిస్‌లాంటి ఇబ్బందులు లేని వాళ్లు రాత్రి పూట అవి తిని మజ్జిగ తాగినా సరిపోతుంది. కీరదోస, పుచ్చకాయ, క్యారెట్.. లాంటివి కూడా సాయంత్రం లేదా రాత్రి పూట తింటే పొట్ట నిండిన అనుభూతి ఉంటుంది. కాబట్టి ఎండాకాలం తినే వేళల్లో కొత్తగా మార్పులు ఏమీ చేసుకోనక్కర్లేదు. తీసుకునేది సమతులాహారం అయ్యేలా చూసుకుంటే సరి.

షుగర్ ఉన్న వాళ్లు న్యూట్రీషనిస్టుల సాయంతో మంచి డైట్ ప్లాన్ తీసుకుంటే డయాబెటిస్‌ని నియంత్రణలో పెట్టుకోవచ్చు. మరో విషయం ఏమిటంటే, వేసవిలో శరీరానికి ఎండ ఎక్కువగా తగులుతుంది. కాబట్టి విటమిన్ డి పుష్కలంగా దొరుకుతుంది. ఇది ఎముకలు దృఢంగా ఉండేందుకు, రోగ నిరోధక శక్తి పెరిగేందుకు సాయపడుతుంది. అంతేకాదు వేసవిలో టీ, కాఫీలు తాగడం తగ్గిస్తుంటాం. దీనివల్ల మనం తినే ఆహారంలోని పోషకాలను శరీరం బాగా శోషించుకుంటుంది. కాబట్టి ఎండగా ఉందని, ఏసీల్లో ఎక్కువగా కూర్చోకుండా కాస్త కాలు కదిలిస్తే మొత్తంగా శరీర వ్యవస్థ చక్కబడుతుంది. ఆదిత్యుడి దయతో ఆరోగ్యం మన సొంతమవుతుంది!



# కంటి ఆరోగ్యాన్ని కాపాడే ఎరుపు రంగు ఆహారాల గురించి తెలుసా..!



చూడడానికి అందంగా ఆకర్షణగా కనిపించే దానిమ్మ, టమాటా వంటి వాటిలో ఎన్ని పోషకాలు దాగున్నాయో..తెలుసా. రెడ్ కలర్ ఫుడ్స్ అందంగా కనిపించడమే కాకుండా ఆరోగ్యంగా కూడా ఉంటాయి. గుండె ఆరోగ్యానికి ఎరుపు రంగు ఆహారాలు మేలు చేస్తాయి...ఆరోగ్యకరమైన ఎరుపు రంగు ఆహారాలలో కూరగాయలు, పండ్లను గురించి అవి ఇచ్చే ఆరోగ్యం గురించి తెలుసుకుందాం.

**ఎరుపు రంగు ఆహారాలు ఏమిటి?**

ఎరుపు రంగు ఆహారాలు పండ్లు, కూరగాయలు ప్రధానంగా లైకోపీన్, ఆంథోసైనిన్‌లు, బీటాలైన్‌ల వంటి సమ్మేళనాల ఉనికి కారణంగా ఎరుపు వర్ణద్రవ్యాన్ని కలిగి ఉంటాయి. ఎర్రటి ఫుడ్స్‌లోని సమ్మేళనాలు శక్తివంతమైన రంగును కలిగి ఉంటాయి. ఇవి అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి.

**1. గుండె ఆరోగ్యం**

రెడ్ ఫుడ్స్, ముఖ్యంగా టొమాటోలు, లైకోపీన్‌ను కలిగి ఉంటాయి, ఇది గుండె రక్షిత లక్షణాలకు ప్రసిద్ధి చెందింది. లైకోపీన్ రక్తపోటును తగ్గిస్తుంది. హృదయ సంబంధ వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. బయోసైన్స్ రీసెర్చ్‌లో ప్రచురించబడిన 2021 అధ్యయనంలో పుచ్చకాయలో లభించే పొటాషియం, గుండె జబ్బులను ఎదుర్కోవడంలో సహాయపడుతుంది. గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుందని తేల్చింది.

మంచి జీర్ణ ఆరోగ్యానికి వేసవిలో తీసుకోవాల్సిన డ్రింక్స్ ఇవే..

**2. క్యాన్సర్ నివారణ**

రెడ్ ఫుడ్స్‌లోని యాంటీఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్‌తో పోరాడుతాయి. ఇవి రొమ్ము, ప్రోస్టేట్ క్యాన్సర్‌తో సహా కొన్ని క్యాన్సర్‌ల ప్రమాదాన్ని సమర్థవంతంగా తగ్గిస్తాయి.

**3. మెరుగైన దృష్టి**

స్ట్రాబెర్రీ, పుచ్చకాయ వంటి ఎర్రటి పండ్లలో విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. అవి కంటి ఆరోగ్యాన్ని పెంచుతాయి.

**4. రోగనిరోధక శక్తి పెరిగింది**

రెడ్ ఫుడ్స్‌లో విటమిన్ సి ఉండటం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. అవి శరీరానికి అంటువ్యాధులతో పాటు అనారోగ్యాలను కూడా దూరం చేస్తాయి.

**5. ఆరోగ్యకరమైన చర్మం**

రెడ్ ఫుడ్స్‌లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు చర్మ ఆరోగ్యానికి కూడా తోడ్పడతాయి.

**6. జీర్ణ ఆరోగ్యం**

రాస్ప్బెర్రీస్, చెర్రీస్ వంటి ఎర్రటి పండ్లలో ఫైబర్ అధికంగా ఉంటుంది. అవి జీర్ణక్రియకు సహాయపడతాయి.

**గమనిక:** పైన పేర్కొన్న వివరాలను ఆరోగ్య నిపుణులు అందించిన సమాచారం మేరకు ఇవ్వడం జరిగింది. దీనిని ధృవీకరించడం లేదు. ఆరోగ్య నిపుణుల సలహాల మేరకు పైన చెప్పిన సూచనలు పాటించాలి.

# అధిక బరువు తగ్గించే శాకాహారం.. రోజూ తీసుకుంటే .!



బరువు తగ్గాలని ఆశించేవారు దానికి తగిన విధంగా ఆహారంలో కూడా మార్పులు చేయడం ముఖ్యం. దీనిలో శాకాహారాన్ని తీసుకుంటే ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. పుష్కలంగా కూరగాయలతో సమతుల్య ఆహారం తీసుకోవడం ఆరోగ్యకరమైన బరువును నిర్వహించడం ప్రభావవంతమైన మార్గాలలో ఒకటి. కూరగాయలు సహజంగా తక్కువ కేలరీలను కలిగి ఉంటాయి, అయితే వీటిలో నీరు, ఫైబర్ అధికంగా ఉంటాయి, ఇది కడుపును ఎక్కువసేపు నిండుగా ఉంచడంలో సహాయపడుతుంది. అదనంగా, కూరగాయలలో విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి, ఇవి మంటను తగ్గించగలవు. దీర్ఘకాలిక ఆరోగ్య పరిస్థితుల నుండి రక్షించగలవు. ఆరోగ్యకరమైన, స్థిరమైన బరువు తగ్గించే విధానంలో కూరగాయలు ఉత్తమమైనవి.

1. బచ్చలికూర, కాలే, స్విస్ చార్డ్, కొల్లార్డ్ గ్రీన్స్‌లో కేలరీలు తక్కువగా ఉంటాయి. అలాగే పోషకాలు అధికంగా ఉంటాయి.
2. బీన్స్, కాయధాన్యాలు, చిక్ పీస్ మొక్కల ఆధారిత ప్రోటీన్, ఫైబర్ అద్భుతమైన మూలాలు.
3. క్వినోవాలో పూర్తిగా ప్రోటీన్ ఉంటుంది. అంటే ఇందులో మొత్తం తొమ్మిది ముఖ్యమైన అమైనో ఆమ్లాలు ఉంటాయి. ఇది ఫైబర్ ను కూడా ఎక్కువగా ఉంటుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గిస్తుంది.
4. బాదం, వాల్ నట్స్, చియా గింజలు, అవిసె గింజలలో ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రోటీన్లు, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. ఇవి క్యాలరీలు దట్టంగా ఉన్నప్పటికీ కడుపునిండిన ఫీలింగ్‌ని ఇస్తాయి.
5. సాధారణ పెరుగుతో పోలిస్తే గ్రీకు పెరుగులో ప్రోటీన్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి కడుపు నిండుగా ఉన్న ఫీలిగ్‌ని ఇస్తాయి. బరువు తగ్గడానికి సహాయపడతాయి.
6. ఈ సోయా ఆధారిత ఉత్పత్తులు మొక్కల ఆధారిత ప్రోటీన్ అద్భుతమైన మూలాలు. వీటిని తీసుకోవడం వల్ల బరువు తగ్గిన ఫీలింగ్ ఉంటుంది.

దంతాలను సహజంగా తెల్లగా చేసుకోవడం ఎలా..!
జుట్టు పెరగాలంటే ఈ సమస్యలు దాటేస్తే చాలు.. ఒత్తైన జుట్టు మీ సొంతం..!
ఆలోచనను మార్చి పడేసే పాప్‌కార్న్ బ్రెయిన్ గురించి తెలుసా..!

7. స్ట్రాబెర్రీలు, బ్లూబెర్రీస్, రాస్ప్బెర్రీస్ వంటి బెర్రీలలో కేలరీలు తక్కువగా ఉంటాయి. ఫైబర్ అధికంగా ఉంటాయి. ఇవి యాంటీ ఆక్సిడెంట్లలో కూడా పుష్కలంగా ఉంటాయి. ఇవి మంటను తగ్గిస్తాయి.
8. బ్రౌన్ రైస్, క్వినోవా, బార్లీ, ఓట్స్ వంటి తృణధాన్యాలలో ఫైబర్ పోషకాలు పుష్కలంగా ఉంటాయి.
9. అవకాడోలో ఆరోగ్యకరమైన కొవ్వులు, ఫైబర్స్, విటమిన్లు, ఖనిజాలు అధికంగా ఉంటాయి.
10. ఇందులో క్యాలరీలు దట్టంగా ఉన్నప్పటికీ ఇది సలాడ్లు, శాండ్ విచ్, టోస్ట్‌కు సరిగ్గా సరిపోతుంది.



## ఐదేండ్లలో 5 లక్షల ఉద్యోగాలు ఇవ్వబోతున్నాం.. వెల్లడించిన టాటా గ్రూపు చైర్మన్



**న్యూఢిల్లీ–నవభూమి:** రాబోయే ఐదేండ్లలో తయారీ రంగంలో టాటా గ్రూపు 5 లక్షల ఉద్యోగాలు సృష్టించబోతున్నదని టాటా గ్రూపు చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ తెలిపారు. సెమీ కండక్టర్, ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీ, సంబంధిత రంగాల్లో ఈ ఉద్యోగాలు రానున్నాయన్నారు. ఇండియన్ ఫౌండేషన్ ఫర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరై ఆయన మాట్లాడుతూ..తయారీ రంగంలో పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా అభివృద్ధి చెందిన దేశంగా మారడం అంత సులువుకాదని చెప్పారు.
వ్యాపార రంగం రూపాంతరం చెందుతున్నదని, దీనికి తగ్గట్టుగా టాటా గ్రూపు కూడా పెట్టుబడులను పెంచిందని, ముఖ్యంగా సెమికండక్టర్ల తయారీ, అసెంబ్లింగ్, ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీ, ఇందుకు సంబంధించిన రంగాల్లో భారీగా పెట్టుబడులు పెట్టబోతున్నట్లు ఆయన ప్రకటించారు. దీంతో వచ్చే ఐదేండ్లలో 5 లక్షల ఉద్యోగాలు కల్పించనున్నట్లు చెప్పారు. అస్సాంలో సెమికండక్టర్ ప్లాంట్‌తోపాటు ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీల తయారీకోసం ఉత్పత్తి కేంద్రాలను నెలకొల్పబోతున్నట్లు ప్రకటించారు. దీనికి సంబంధించి మరింత సమాచారం ఇవ్వడానికి నిరాకరించారు.

## జియో నుంచి మరో రెండు ఫోన్లు.. ధర ఎంతంటే..!



**న్యూఢిల్లీ–నవభూమి:** రిలయన్స్ జియో మరో రెండు ఫీచర్ ఫోన్లను మార్కెట్లోకి అందుబాటులోకి తీసుకొచ్చింది. వీ2 సిరీస్‌లో భాగంగా మరో రెండు మాడళ్లను ప్రవేశపెట్టింది. జియో భారత్ వీ3, వీ4 పేరుతో విడుదల చేసిన ఈ ఫోన్ల ప్రారంభ ధర రూ.1,099గా నిర్ణయించింది. 1000 ఎంఏహెచ్ బ్యాటరీతో తయారైన ఈ రెండు ఫోన్ల మెమొరీని 128 జీబీకి పెంచుకునే అవకాశం ఉన్నది.

**ఇక్కడే డాటా స్టోరేజ్ చేయాలి: ఆకాశ్**

భారతీయులందరూ దేశీయంగానే తమ డాటాను స్టోరేజ్ చేయాలని రిలయన్స్ జియో చైర్మన్ ఆకాశ్ అంబానీ అన్నారు. ఢిల్లీలో జరుగుతున్న మొబైల్ వరల్డ్ కాంగ్రెస్‌లో ఆయన మాట్లాడుతూ..దేశీయ డాటా స్టోరేజ్ సంస్థలకు ప్రభుత్వాలు ప్రోత్సాహకాలు అందించాల్సిన అవసరం ఉన్నదని, ముఖ్యంగా విద్యుత్‌తో రాయితీ ఇస్తే దేశీయ కంపెనీలు ఇక్కడే ఏఐ ఆధారిత డాటా సెంటర్లను ఏర్పాటు చేయడానికి ముందుకు రానున్నట్లు చెప్పారు.

## రీగల్ ఎడిషన్‌గా బాలెనో.. ధర ఎంతంటే..!



**న్యూఢిల్లీ–నవభూమి:** దేశీయ కార్ల దిగ్గజం మారుతి సుజుకీ..ప్రస్తుత పండుగ సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని నూతన ఫీచర్లతో రూపొందించిన బాలెనోను మార్కెట్‌కు పరిచయం చేసింది. ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ సెగ్మెంట్‌లో ఇప్పటికే కీలకపాత్ర పోషిస్తున్న బాలెనోను లిమిటెడ్ ఎడిషన్‌గా అందుబాటులోకి తీసుకొచ్చింది.రెండు రకాల్లో లభించనున్న ఈ కారు రూ.6.66 లక్షల నుంచి రూ.9.83 లక్షల ధరల శ్రేణిలో లభించనున్నది. ఈ ధరలు ఢిల్లీ షోరూంనకు సంబంధించినవి. ఈ ప్రత్యేక ఎడిషన్‌లో నూతన గ్రిల్ అప్పర్ గార్నిష్, ఫాగ్ ల్యాంప్, నూతన సీట్ కవర్లు, తొమ్మిది ఇంచుల స్మార్ట్‌ప్లే ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ ప్రోగ్రాం వంటి 40 అడ్వాన్స్‌డ్ స్మార్ట్ ఫీచర్స్‌తో తయారు చేసింది.

## ఐదేళ్లలో 5 లక్షల ఉద్యోగాలు

**న్యూఢిల్లీ–నవభూమి:** వచ్చే ఐదేళ్లలో టాటా గ్రూప్ తయారీ రంగంలో 5 లక్షల ఉద్యోగాలను సృష్టించనుందని టాటా సన్స్ చైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్ మంగళవారం తెలిపారు. సెమీకండక్టర్లు, ప్రెసిషన్ మాన్యుఫాక్చరింగ్, అసెంబ్లింగ్, విద్యుత్ వాహనాలు (ఈవీ), బ్యాటరీలు, సంబంధిత పరిశ్రమల్లో ఈ ఉద్యోగాలను కల్పించనుంద న్నారు. ఇండియన్ ఫౌండేషన్ ఫర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ (ఐఎఫ్‌క్యూఎం) నిర్వహించిన సింపోజియమ్‌లో ప్రసంగిస్తూ ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సింపోజియమ్‌లో కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్, టీవీఎస్ మోటార్ కంపెనీ గౌరవ చైర్మన్ వేణు శ్రీనివాసన్ కూడా పాల్గొన్నారు. చంద్రశేఖరన్ ఇంకా ఏమన్నారంటే..
అసోంలో టాటా సెమీకండక్టర్ల తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోంది. అలాగే ఈవీలు, వాటి బ్యాటరీలతో పాటు పలు తయారీ యూనిట్లను నెలకొల్పుతోంది. ఈ ప్లాంట్ల ఏర్పాటుతో భారీగా ఉద్యోగాల కల్పనతోపాటు వాటికి సమీపంలో కనీసం 5 లక్షల చిన్న, మధ్య స్థాయి పరిశ్రమలు సైతం ఏర్పాటు కావచ్చని అంచనా.
కేంద్ర ప్రభుత్వం తయారీ రంగానికి, ఈ రంగంలో ఉద్యోగాల కల్పనకు భారీగా మద్దతునిస్తోంది. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలన్న భారత లక్ష్య సాకారంలో మాన్యుఫాక్చరింగ్ రంగం కీలక పాత్ర పోషించనుంది. ఈ రంగంలో భారీగా ఉద్యోగాలు సృష్టించలేకపోతే వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోలేం. ఎందుకంటే, ప్రతి నెలా 10 లక్షల మంది యువత ఉద్యోగ మార్కెట్లోకి వస్తున్నారు. వారందరికీ ఉపాధి కల్పించేందుకు 10 కోట్ల ఉద్యోగాలు సృష్టించాల్సిన అవసరం ఉంది.
సెమీకండక్టర్ల వంటి ఆధునిక సాంకేతికతతో కూడిన ఉత్పత్తుల తయారీ రంగంలో కల్పించే ప్రతి ఒక్క ఉద్యోగం 8 నుంచి 10 పరోక్ష ఉపాధి అవకాశాలను సృష్టించగలదు.

**వారిని గుడ్డిగా అనుసరించవద్దు: శ్రీనివాసన్**

అత్యంత నాణ్యమైన సేవలు, ఉత్పత్తుల మార్కెట్లో ప్రపంచ అగ్రగామిగా ఎదిగేందుకు మనదైన ప్రత్యేక శైలి అవసరమని టీవీఎస్ చైర్మన్ వేణు శ్రీనివాసన్ సూచించారు. ఆర్థికాభివృద్ధి విషయం లో జర్మనీ, అమెరికా, జపాన్, దక్షిణ కొరియా, చైనా ఎంచుకున్న బాటను మనమూ గుడ్డిగా అనుసరించవద్దని, అలా చేస్తే మనం వెనకబడిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

**ఎన్నికలతో సంబంధం లేని అభివృద్ధి పథం: వైష్ణవ్**

దేశంలో ఎన్నికలతో సంబంధం లేకుండా అభివృద్ధి చెందే ప్రక్రియకు పునాది వేస్తున్నట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా అవతరించాలంటే నామినల్ జీడీపీ 30 లక్షల కోట్ల డాలర్లకు, తలసరి ఆదాయం 18,000 డాలర్ల స్థాయికి చేరుకోవాలన్నారు. ప్రస్తుతం జీడీపీ 4 లక్షల కోట్ల డాలర్లు, తలసరి ఆదాయం 3,000 డాలర్ల స్థాయిలో ఉందన్నారు. ఈ లెక్కన మనం లక్ష్యాన్ని చేరుకునేందుకు రాబోయే 25 ఏళ్లలో 6–7 రెట్ల వృద్ధిని సాధించాల్సిన అవసరం ఉందన్నారు.

## క్విక్ సర్వీస్ రెస్టారెంట్లలో మొదటిగా సైన్ లాంగ్వేజ్ శిక్షణను తన ఉద్యోగులందరికీ ఇప్పించిన కేఎఫ్‌సీ



**న్యూఢిల్లీ–నవభూమి:** అంతర్జాతీయ సంజ్ఞా భాషల దినోత్సవాన్ని పురస్కరించుకుని, ఆతిథ్య పరిశ్రమలో కేఎఫ్‌సీ ఒక స్మారక అడుగు ముందుకు వేస్తోంది. ఎందుకంటే ఇది తన 100% ఉద్యోగులకు సంకేత భాషా శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన భారతదేశం లో మొదటి క్విక్ సర్వీస్ రెస్టారెంటుగా నిలిచింది. ఇది 240ం నగరాల్లో విస్తరించిన తన 1200ం రెస్టారెంట్లలోని 17,000ం కేఎఫ్‌సీ ఉద్యోగులకు, అలాగే బ్రాండ్ కార్పొరేట్ కార్యాలయాల్లో పని చేసే వారికి ఈ తరహా శిక్షణను తప్పనిసరి చేసింది.సంకేత భాషా నిపుణుడితో సంప్రదించి రూపొందించబడిన ఈ ఆన్‌లైన్ శిక్షణ ఐఎస్‌ఎల్ (%×ూా%) బేసిక్స్‌ను అనుభవం లేని వ్యక్తి నేర్చుకునేందుకు ప్రత్యేకంగా రూపొందించిన మల్టిపుల్ మాడ్యూళ్లను కవర్ చేస్తుంది. మొదటి మాడ్యూల్ ఐఎస్‌ఎల్‌లోని వర్ణమాలలపై దృష్టి కేంద్రీకరిస్తుంది. అనంతరం సంకేత భాషలో సంభాషణను నిర్వహించడానికి కీలకమైన గ్రీటింగ్‌లు సాధారణ పదబంధాలపై దృష్టి పెడుతుంది. ఈ శిక్షణ కేఎఫ్‌సీ ఇండియా క్షమత కార్యక్రమంలో భాగంగా ఉంది. ఇది సిబ్బందికి సామర్థ్యాన్ని అందిస్తూ, జెండర్ సామర్థ్యాల అంతరాన్ని తగ్గించే లక్ష్యాన్ని కలిగి ఉంది. క్షమతతో రెస్టారెంట్లలో మహిళలు మూగ వినికిడి లోపం ఉన్నవారికి సాధికారత కల్పించేందుకు కేఎఫ్‌సీ కట్టుబడి ఉందిబీ 2026 నాటికి మూగ వినికిడి లోపం ఉన్న ఉద్యోగుల సంఖ్యను రెట్టింపు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.ఈ ఏడాది, క్యాంపెయిన్‌కు విస్తరణగా, కేఎఫ్‌సీ భారతదేశంలో మొట్టమొదటి ఇంటరాక్టివ్ సైన్ లాంగ్వేజ్ కియోస్క్‌ను ప్రారంభించడం ద్వారా మొత్తం ఆతిథ్య పరిశ్రమను ఒకచోట చేర్చాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇది భారతీయులు ఉపయోగించే సంజ్ఞల భాషను ఉపయోగించి బ్రాండ్‌లు వంటకాల్లో వినియోగదారుల కు ఇష్టమైన ఆహార పదార్థాలను ఆర్డర్ చేయడాన్ని నేర్చుకునేలా చేస్తుంది. ఈ ఎగ్జిబిట్ నేడు సెలెక్ట్ సిటీవాక్, న్యూ ఢిల్లీ ఆంబియన్స్ మాల్, గురుగ్రామ్‌లో ప్రారంభమైంది. హాట్ %ు% క్రిస్పీ, చికెన్ పాప్‌కార్న్, జింగర్ వంటి కేఎఫ్‌సీ ఫేవరెట్స్‌తో పాటు పిజ్జా, బర్గర్, దోస, మోమోస్, పాస్తా వంటి 30ం ప్రసిద్ధ ఆహార పదార్థాలను సైన్ లాంగ్వేజ్‌లో ఆర్డర్ చేయడాన్ని నేర్చుకునేందుకు వినియోగదారులను ఆహ్వానిస్తోంది.
దీని గురించి కేఎఫ్‌సీ ఇండియా పార్ట్‌నర్ కంట్రీస్ జనరల్ మేనేజర్ మోక్ష్ చోప్రా మాట్లాడుతూ, "మా కేఎఫ్‌సీ క్షమత కార్యక్రమం ద్వారా, వినికిడి లోపం ఉన్న సముదాయానికి అందుబాటులో ఉన్న అవకాశాలను అన్‌లాక్ చేయడంలో సహాయపడాలన్న ఉద్దేశాన్ని కలిగి ఉన్నాము. ఈ దిశగా అత్యంత ముఖ్యమైన దశల్లో ఒకటి సైన్ లాంగ్వేజ్ వినియోగాన్ని వ్యాప్తి చేయడం 2021 నుంచి మా వార్షిక క్యాంపెయిన్ ఈ లక్ష్యాన్ని ప్రారంభించడంపై దృష్టి సారిస్తుంది. ఈ ఏడాది, మా టీమ్‌లలో 100% మంది ప్రాథమిక భారతీయ సంకేత భాషలో శిక్షణ పొందారని, దేశవ్యాప్తంగా ఉన్న మా రెస్టారెంట్‌లను మరింత కలుపుకొని పోతున్నామని తెలియజేసేందుకు మేము గర్విస్తున్నాము. మేము ఈ సైన్ లాంగ్వేజ్ ఉద్యమాన్ని మా సంస్థతో పాటు హాస్పిటాలిటీ పరిశ్రమలోకి కూడా తీసుకువెళుతున్నాము. జనాదరణ పొందిన ప్రదేశాలలో ఇంటరాక్టివ్ కియోస్క్‌తో, సంకేత భాషను ఉపయోగించి బ్రాండ్‌లలో తమకు ఇష్టమైన ఆహార పదార్థాలను ఆర్డర్ చేయడం నేర్చుకోవాలని మేము వినియోగదా రులను ప్రోత్సహిస్తున్నాము" అని వివరించారు.కేఎఫ్‌సీ ఇండియా ఫ్రాంచైజీ భాగస్వాములు దేవయాని ఇంటర్నేషనల్ లిమిటెడ్ సఫైర్ ఫుడ్స్ ఇండియా లిమిటెడ్ క్షమత ప్రయాణంలో ఒక చక్కని పాత్రను పోషించాయి.దేవయాని ఇంటర్నేషనల్ లిమిటెడ్ లో కేఎఫ్‌సీ సీఈఓ ప్రదీప్ దాస్ మాట్లాడుతూ, "డీఐఎల్‌లో మనమందరం కేఎఫ్‌సీ క్షమతా కార్యక్రమంలో గర్వించదగిన భాగస్వాములం. సామర్థ్యాలకు సంబంధించిన అంతరాన్ని తగ్గించడం అనేది యాక్సెస్ చేయగల కలుపుకొని వెళ్లగలిగిన కార్యాలయాలను సృష్టించడం చాలా కీలకం. తప్పనిసరిగా సైన్ లాంగేవజ్ శిక్షణ రోల్‌అవుట్ అనేది ముందుకు ఆలోచించే విధానం. ఇది మా రెస్టారెంట్‌లు కార్యాలయాలలో మూగ, వినికిడి లోపం ఉన్న వ్యక్తులు, బృందాలు లేదా వినియోగదారులు నమ్మకంగా పరస్పరం వ్యవహరించగల వాతావరణాన్ని పెంపొందించడంలో సహాయపడుతుంది" అని తెలిపారు.

## మెక్‌డోవెల్స్ - కో నుంచి -సిరీస్ నూతన శ్రేణి ప్రీమియం వోడ్కా, రమ్ జిన్ మార్కెట్‌లోకి అందుబాటులోకి..



**న్యూఢిల్లీ–నవభూమి:** ప్రపంచవ్యాప్తంగా కొవిడ్ అనంతరం సామాజిక క్రమంలో పలు మార్పులు, విధానాలు వచ్చాయి. సాంఘికీకరణ, సంబంధాలు, వేడుకల విషయానికి వస్తే జీవితాన్ని ఉత్సాహంగా, చురుకుగా జీవించాలనే కోరిక ప్రజల్లో పెరుగుతోంది. భారతదేశంలో దీనికి భిన్నంగా ఏమీ లేదు. వృద్ధి చెందుతున్న మధ్య భారతదేశం, అలాగే జెన్ జి యుక్తవయస్సులోకి అడుగుపెట్టడం, పరిణితితో కూడిన అనుభవాల కోసం చూస్తున్న మిలీనియల్స్ కొత్త స్థితి చిహ్నాల ఆవిర్భావానికి దారితీయడంతో ఈ మార్పు మరింత ఊపందుకుంది. సంప్రదాయ విస్కీకి మించిన దృష్టికోణంతో, మెరుగైన మద్యపాన అనుభవాల కోసం కోరిక పెరుగుతోంది. కాక్‌టెయిల్ సంస్కృతి వృద్ధి కూడా కూడా అదే విషయాన్ని ధృవీకరిస్తోంది. వినియోగదారులు, యువకులు పెద్దలు మరింత ప్రయోగాత్మకంగా వ్యవహరిస్తున్నారు. కచేరీ అనేది ప్రస్తుత కాల్. కనుక, భారతదేశంలోని అత్యంత ప్రసిద్ధ, లెజెండరీ బ్రాండ్‌లలో ఒకటైన మెక్‌డోవెల్స్ కో, 125 ఏళ్ల నాటి పవర్‌హౌస్. వినియోగదారునికి తన ఉత్పత్తులను సరికొత్త రూపంలో అందించేందుకు, తనను తాను తిరిగి ఆవిష్కరించుకోవడానికి ఇంతకంటే మంచి సమయం ఏముంది! దేశం, ప్రపంచం నలుమూలల నుంచి ముడి పదార్థాలు పదార్థాలను అందుకుంటూ, దేశ వ్యాప్తంగా ఏడు విభిన్న డిస్టిలరీలతో, మెక్‌డోవెల్స్ కో తన సిరీస్ వినియోగదారులు ఇప్పుడు అత్యుత్తమ మద్యం శ్రేణిని ఆస్వాదిస్తున్న విధానాన్ని మళ్లీ అందుబాటులోకి తీసుకువచ్చింది. వోడ్కా, జిన్ నుంచి శక్తివంతమైన కొత్త సిట్రాన్ రమ్ రుచికరమైన డార్క్ రమ్ వరకు వీటిలో ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా అన్యదేశ రుచులతో అత్యుత్తమ భారతీయ పదార్థాలను మిళితం చేస్తూ, మెక్‌డోవెల్స్ కో రూపొందించిన సిరీస్ విభిన్నమైన కొత్త పోర్ట్‌ఫోలియోను అందజేస్తుంది. వీటిలో అత్యుత్త మైనవి భారతదేశంలో ఇంతకు ముందెన్నడూ చూడలేదు అత్యుత్తమ, ప్రత్యేకమైన రెసిపీలు, శక్తివంతమైన కొత్త ప్యాకేజింగ్‌తో అసమానమైన అంగిలి అనుభవాన్ని అందించే ఉద్దేశాన్ని కలిగి ఉంది.ఈ నూతన శ్రేణి తాజా, ఉత్తేజకరమైన వాటితో ప్రయోగాలు చేయడానికి సిద్ధంగా ఉన్న యువతీ యువకులకు వినోదాన్ని పెంచేందుకు, వినోదాన్ని పునర్నిర్వచిం చేందుకు సిద్ధంగా ఉంది. మెక్‌డోవెల్స్ కో ద్వారా తన సిరీస్ ను విడుదల చేస్తున్న సందర్భంలో డియాజియో ఇండియా మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ పోర్ట్‌ఫోలియో హెడ్ వరుణ్ కూరిచ్ మాట్లాడుతూ, "మెక్‌డోవెల్స్ దాని అసాధారణమైన రుచి దీర్ఘ–కాలాలతో ఆత్మల ప్రపంచంలో అత్యు త్తమ ప్రమాణాలను స్థిరంగా నెలకొల్పింది. నాణ్యత స్థిరమైన వారసత్వం. మెక్‌డోవెల్స్ కో. నుంచి సిరీస్‌ని విడుదల చేయడం ద్వారా మేము మా ఘన వారసత్వాన్ని ముందుకు తీసుకువెళుతూ, అధునాతనత శ్రేష్ఠతతో కూడిన కొత్త యుగాన్ని స్వీకరిస్తున్నాము. ప్రీమియం వోడ్కా, జిన్, సిట్రాన్ రమ్ డార్క్ రమ్ ఈ కొత్త శ్రేణి పెద్ద కచేరీల కోసం అభివృద్ధి చెందుతున్న వినియోగదా రుని ప్రాధాన్యతల నుంచి ప్రేరణ పొందింది. మెరుగైన నాణ్యత మద్యపాన అనుభవాలకు ప్రాధాన్యతని స్తుంది. ప్రయో గాలు వీటిలో ప్రాధాన్యతను కలిగి ఉన్నాయి. దాని ప్రత్యేక మైన ఫ్లేవర్ ప్రొఫైల్‌లతో, మెక్‌డోవెల్స్ కో. నుంచి సిరీస్ ప్రయోగాలు చేయాలనుకునే వారి కోసం మిక్స్‌బిలిటీ ఇన్వెంటివ్ కాక్‌టెయిల్‌లను మెరుగుపరిచేందుకు సెట్ చేయబడింది.

## ఎయిర్ అరేబియా 'సూపర్ సీట్ సేల్' ఆఫర్.. ఇంకొన్ని రోజులు మాత్రమే



**న్యూఢిల్లీ–నవభూమి:** ఎయిర్ అరేబియా ప్రయాణికుల కోసం అదిరిపోయే ఆఫర్ ప్రకటించింది. తన ప్లాట్‌ఫారమ్‌లో సూపర్ సీట్ సేల్‌ను నిర్వహిస్తోంది. ఈ సేల్ ఇంకా కొన్ని రోజులు మాత్రమే మిగిలి ఉంది. ఈ ప్రత్యేక సేల్ సమయంలో ఆసక్తిగల ప్రయాణికులు(తమ సీట్లను చాలా తక్కువ ధరకే రిజర్వ్ చేసుకోవచ్చు. ఇదే సమయంలో ప్రపంచంలోని అనేక దేశాలకు అతి తక్కువ ధరల్లో సీట్లు బుక్ చేసుకునే అవకాశాన్ని ఈ ఎయిర్ లైన్స్ కల్పిస్తోంది. అయితే ఈ సేల్ ముగిసేలోపు బుకింగ్ చేసుకుని ఉండాలి. ప్రయాణ తేదీ తప్పనిసరిగా నిర్దేశిత సమయ వ్యవధిలోనే ఉండాలి.

*5 లక్షల సీట్లు..ఎయిర్ అరేబియా అనేది మిడిల్ ఈస్ట్, నార్త్ ఆఫ్రికాలోని ప్రముఖ తక్కువ ధర విమానయాన సంస్థ. ఈ నేపథ్యంలో సూపర్ సీట్ సేల్ ఆఫర్ ద్వారా 500,000 సీట్లపై భారీ తగ్గింపులను అందజేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో అక్టోబర్ 20లోపు టికెట్లను బుక్ చేసుకున్న వారి గమ్యస్థానాలకు రూ. 5,727 నుంచి పొందవచ్చని కంపెనీ తెలిపింది. ఈ ప్రమోషన్‌లో భాగంగా యూఏఈలోని అబుదాబి, షార్జా, రస్ అల్ ఖైమాలోని కొన్ని గమ్యస్థానాలకు భారతదేశం నుంచి విమానాలు నడుపుతున్నట్లు ప్రకటించారు. ఇది కాకుండా టీబీలిసీ, బాకు, ఏథెన్స్, మిలన్, క్రాకో, మాస్కో, అల్మాటీ వంటి యూరోపియన్, ఆఫ్రికన్ దేశాలకు కూడా తక్కువ ధరలకు ఫ్లైట్స్ నడుపుతున్నట్లు వెల్లడించారు.*
*జర్నీ మాత్రం.. ఈ ప్రారంభ ఆఫర్ అక్టోబర్ 20, 2024 వరకు మాత్రమే చెల్లుబాటులో ఉంటుందన్నారు. కానీ ప్రయాణ తేదీలు మాత్రం మార్చి 1, 2025 నుంచి అక్టోబర్ 25, 2025 వరకు ఉంటాయన్నారు. భారతదేశంలో ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, అహ్మదాబాద్, బెంగళూరు, హైదరాబాద్, జైపూర్, నాగ్‌పూర్, గోవా, చెన్నై, కోయంబత్తూర్, తిరువనంతపురం, కొచ్చి, కోజికోడ్‌లతో సహ పరిమిత సంఖ్యలో బయలుదేరే విమానాశ్రయాలు కూడా ఉన్నాయని చెప్పారు. అయితే చౌకై ధరలకు టిక్కెట్లను పొందడానికి, విక్రయానికి సిద్ధం చేసిన ప్రత్యేక పేజీలో పేర్కొన్న కంపెనీ నిర్ణయించిన తేదీలలో మాత్రమే బుక్ చేసుకోవాలని గుర్తుంచుకోవాలి. మిగతా తేదీల్లో ప్రయాణిస్తే ఈ ఆఫర్లు వర్తించవు.*
*ఈ ఆఫర్ కింది భారతదేశ నగరాల్లోని విమానాశ్రయాల్లో అందుబాటులో ఉంది*
*ఢిల్లీ*
*ముంబై*
*కోల్‌కతా*
*అహ్మదాబాద్*
*బెంగళూరు*
*హైదరాబాద్*
*జైపూర్*
*నాగపూర్*
*గోవా*
*చెన్నై*

## కస్టమర్లకు ఎస్‌బీఐ గుడ్‌న్యూస్.. వడ్డీరేటు భారీగా తగ్గింపు



**ముంబై– నవభూమి:** ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐ తమ మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేట్ల (ఎంసీఎల్ఆర్)లో ఒకదాన్ని సవరించింది. ఒక నెల టెన్యూర్ కలిగిన ఎంసీఎల్‌ఆర్‌ను 8.20 శాతానికి తగ్గించింది. ఇంతకుముందు ఇది 8.45 శాతంగా ఉండేది. దీంతో పావు శాతం దిగినైట్టెంది. మంగళవారం నుంచే కొత్త రేటు అమల్లోకి వస్తుంది. ఫలితంగా ఆయా రుణాలను తీసుకున్న ఎస్బీఐ కస్టమర్లకు లాభించనున్నది.

**ఏమిటీ ఎంసీఎల్ఆర్?**

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) 2016 ఏప్రిల్‌లో ఈ ఎంసీఎల్‌ఆర్‌ను ప్రవేశపెట్టింది. అంతకుముందు బేస్ రేటు, బెంచ్‌మార్క్ ప్రైమ్ లెండింగ్ రేటు (బీపీఎల్ఆర్) అమల్లో ఉండేవి. 2016 ఏప్రిల్ తర్వాత రుణాలు తీసుకున్నవారికి ఎంసీఎల్‌ఆర్ ఆధారంగా వడ్డీరేట్లుంటాయి. అంతకుముందు లోన్లు తీసుకున్నవారికి బేస్ రేటు, బీపీఎల్ఆర్ ఆధారంగానే వడ్డీరేట్లు వర్తిస్తాయి. ఇక బ్యాంకులు ఈ ఎంసీఎల్ఆర్ కంటే తక్కువ వడ్డీరేటుకు రుణాలను ఇవ్వకూడదు. ప్రస్తుతం ఓవర్‌నైట్ దగ్గర్నుంచి మూడేండ్లదాకా రకరకాల ఎంసీఎల్‌ఆర్‌లు అమల్లో ఉన్నాయి. ఇప్పుడు ఎస్బీఐ మార్చింది నెల రోజుల ఎంసీఎల్‌ఆర్‌నే. మిగతా వాటిలో ఏ మార్పూ లేదు. ఎంసీఎల్ఆర్ పెరిగితే లోన్ల ఈఎంఐల భారం కూడా పెరుగుతుందన్న విషయం తెలిసిందే. అలాగే తగ్గితే రుణ వాయిదా చెల్లింపులూ తగ్గుతాయి. కాగా, ఎస్బీఐ బేస్ రేటు 10.40 శాతంగా ఉన్నది. బీపీఎల్ఆర్ 15.15 శాతం. ఇవి సెప్టెంబర్ 15 నుంచి అమల్లో ఉన్నాయి. ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ లెండింగ్ రేటు (ఈబీఎల్ఆర్) 9.15 శాతంగా ఉన్నది.

## భారతదేశంలో అందుబాటులోకి వచ్చిన డైసన్ వాష్‌జి1



**న్యూఢిల్లీ–నవభూమి:** డైసన్ తమ మొట్టమొదటి పూర్తి కార్డ్–ఫ్రీ వెట్ ఫ్లోర్ క్లీనర్ అయిన డైసన్ వాష్‌జి 1 ని విడుదల చేస్తున్నట్లు వెల్లడించింది. పరిశుభ్రమైన స్వచ్ఛత నిర్వహణ కోసం రూపొందించబడిన, డైసన్ వాష్‌జి1 వెట్ ఫ్లోర్ క్లీనర్, పూర్తి స్వచ్ఛత అనుభూతి కోసం తడి పొడి చెత్త సమస్యలను ఒకేసారి పరిష్కరిస్తుంది. 1–లీటర్ క్లీన్–వాటర్ ట్యాంక్‌తో, డైసన్ వాష్‌జి1 తడి పొడి చెత్తను ఒకేసారి తొలగించడానికి ఆర్ద్రీకరణ, శోషణ వెలికితీత సాంకేతికతల కలయికను ఉపయోగిస్తుంది– ఆటోమేటిక్‌గా దానిని వేరు చేస్తుంది, కాబట్టి నిర్వహణ మరింత పరిశుభ్రంగా ఉంటుంది. అలాగే, ఇది ఒక్కసారి ఛార్జింగ్ చేస్తే 3100చ.అడుగులను శుభ్రం చేస్తుంది.డైసన్ వద్ద డైసన్ హోమ్ ఇంజనీరింగ్ వైస్ ప్రెసిడెంట్, చార్లీ పార్క్ మాట్లాడుతూ "మనలో చాలా మంది తమ ఇళ్లను క్రమం తప్పకుండా వాక్యూమ్ క్లీనింగ్ చేస్తుంటారు. తడి బట్టతో శుభ్రపరచడం అనేది ప్రపంచవ్యాప్తంగా అవసరమైన పనిగా పరిగణించబడుతున్నప్పటికీ, పరిశుభ్రత అస్పష్టమైన భావనకు మించి మనం ఆ పని ఎందుకు చేస్తున్నామో మనలో చాలా మందికి తెలియదు. నిజానికి, నీటితో శుభ్రపరచడం అనేది రీహైడ్రేట్ చేయడం కోసం కఠినమైన, మొండి మరకలను తొలగించడానికి అది అవసరం. సంవత్సరాలుగా, ఈ పనిని చేయటంలో మనకు సహాయపడటానికి వెట్ ఫ్లోర్ క్లీనింగ్ ఫార్మాట్‌లకు సంబంధించి విస్తృత శ్రేణి ఉద్భవించింది, అయితే మరకలను తొలగించటం, పిక్–అప్ పనితీరు ఫ్లోర్ ఫినిషింగ్ విషయంలో వినియోగదారుల అంచనాలు తరచుగా చేరుకోలేవు. ఇతరులు విస్మరించే సమస్యలను డైసన్ ఇంజనీర్లు పరిష్కరిస్తారు. మెరుగైన సాంకేతికతను సృష్టించే సవాలుతో మేము అభివృద్ధి చెందాము. ఈ ప్రయత్నాల ఫలితం, డైసన్ వాష్‌జి1 బీ కఠినమైన నేలను సరిగ్గా పరిశుభ్రంగా శుభ్రపరచటానికి మా మొదటి వెట్ మెషీన్ ఇది' అని అన్నారు.
ఎక్కువగా పీల్చుకుంటుంది , కౌంటర్ రొటేటింగ్ రోలర్లు కలిగి వుంది రెండు వ్యక్తిగత శక్తిని కలిగిన రోలర్‌లు కౌంటర్ రొటేట్ అవుతాయి, అయితే పల్స్–మాడ్యులేటెడ్ పంప్ నీటిని ప్రతి రోలర్ పూర్తి వెడల్పుతో పాటు 26 ఖచ్చితంగా ఉంచబడిన హైడ్రేషన్ పాయింట్‌లలో సమానంగా పంపిణీ చేస్తుంది.ప్రతి రోలర్ ఒక చదరపు సెం.మీకి 64,800 ఫిలమెంట్స్‌తో అత్యంత శోషక మైక్రోఫైబర్‌తో రూపొందించబడింది. అధిక సాంద్రత కలిగిన మైక్రోఫైబర్ క్లీన్ వాటర్ స్థిరమైన అప్లికేషన్ ఈ కలయిక నేలపై చిందిన ద్రవాలు పూర్తిగా శోషించబడుతాయని నిర్ధారిస్తుంది, అదే సమయంలో పొడి ధూళి, శిధిలాలు జుట్టు మిలియన్ల ఫిలమెంట్స్ తో స్వీకరించబడతాయని నిర్ధారిస్తుంది. యంత్రం ముందు వెనుక భాగంలో రెండు రోలర్‌లను ఉంచడం ద్వారా, శక్తివంతమైన వేగవంతమైన రీతిలో మరకలను తొలగించడం కోసం డైసన్ ఇంజనీర్లు ప్రతి పాస్‌తో మరకలపై ఎక్కువ సమయం గడిపారు.

## ప్రధాన ఆకర్షణగా 'రోబోటిక్ డాగ్'



**న్యూఢిల్లీ–నవభూమి:** ఇండియన్ మొబైల్ కాంగ్రెస్ (ఐఎంసీ)లో రాకీ అనే రోబోటిక్ డాగ్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఎరిక్సన్ కంపెనీ అభివృద్ధి చేసిన ఈ 5జీ పవర్డ్ డాగ్ కేంద్ర టెలికాం మంత్రి జ్యోతిరాదిత్య సింధియాను కూడా ఆకర్షించింది. ఐఎంసీ సదస్సుకు హాజరైన ఆయన ఎరిక్సన్ స్టాల్‌కి వెళ్లి మరీ ఈ రోబోటిక్ డాగ్‌ను పరిశీలించి దాన్ని 'శభాష్ రాకీ' అంటూ అభినందించారు. ఈ విషయాన్ని ఆయన స్వయంగా తన 'ఎక్స్'లో పోస్టు చేశారు. అగ్ని ప్రమాదాల వంటి అత్యవసర సమయాల్లో ఈ రోబోటిక్ డాగ్ అద్భుతమైన సేవలు అందిస్తుందని ఎరిక్సన్ తెలిపింది. 4జీ, 5జీ సేవల్లో ఇతర దేశాలను అనుసరించిన భారత్ 6జీ టెక్నాలజీ విషయంలో మాత్రం నాయకత్వ పాత్ర పోషిస్తుందని సింధియా అన్నారు. ఇందులో భాగంగా ఈ టెక్నాలజీకి సంబంధించి అంతర్జాతీయంగా నమోదయ్యే పేటెంట్లలో కనీసం పది శాతమైనా మన దేశం నుంచి నమోదు కావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. దేశీయంగా 6జీ టెక్నాలజీ అభివృద్ధిని సమన్వయం చేసేందుకు 'భారత్ 6జీ అలయెన్స్' పేరుతో ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసినట్టు సింధియా తెలిపారు.




నవభూమి

www.navabhoomi.in
www.epaper.navabhoomi.in

7 హైదరాబాద్ గురువారం 17 | అక్టోబర్ | 2024


## గవర్నర్‌ను కలిసిన అమిత్‌షా, సైనీ.. 17న కొత్త ప్రభుత్వ ప్రమాణస్వీకారం



**చండీగఢ్-నవభూమి:** హర్యానాలో బీజేపీ ప్రభుత్వం మరి కొద్ది గంటల్లో కొలువుతీరనుంది. ముఖ్యమంత్రిగా నాయబ్ సింగ్ సైనీ ని రెండోసారి ముఖ్యమంత్రి కొనసాగించేందుకు బీజేపీ అధిష్ఠానం నిర్ణయించడం, ఇందుకు అనుగుణంగా బీజేపీ శాసనసభా పక్షం బుధవారం ఉదయం జరిపిన సమావేశంలో ఆయన పేరును ఏకగ్రీవంగా సభ్యులు ఆమోదించడంతో ప్రభుత్వం ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ఆ వెంటనే కేంద్ర పరిశీలకునిగా వెళ్లిన అమిత్‌షా, నయబ్ సింగ్ సైనీ రాజ్‌భవన్‌కు చేరుకుని గవర్నర్ బండారు దత్తాత్రేయను కలుసుకున్నారు. ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించాల్సిందిగా కోరారు. సైనీ ప్రభుత్వానికి మద్దతు ప్రకటించిన ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు సావిత్రి జిందాల్, దేవేంద్ర కద్యాన్, రాజేష్ దూన్‌లు కూడా గవర్నర్‌ను కలిసిన బీజేపీ ప్రతినిధి బృందంలో ఉన్నారు. మోదీ దీపావళి గిఫ్ట్.. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 3 శాతం డీఏ పెంపు దీనికి ముందు, పంచకులలో జరిగిన సమావేశంలో బీజేపీ శాసనసభా పక్ష నేతగా నయబ్ సింగ్ సైనీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

హర్యానా మాజీ ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టార్, రాష్ట్ర మాజీ మంత్రి అనిల్ విజ్‌లు సీఎం అభ్యర్థిగా సైనీ పేరును ప్రతిపాదించగా, సభ్యులు ఏకగ్రీవంగా అంగీకరించారు. దీంతో హర్యానా ముఖ్యమంత్రిగా రెండోసారి సైనీ ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

## కాంగ్రెస్ సంచలన నిర్ణయం.. వారికి బయట నుంచే మద్దతు..



**న్యూఢిల్లీ- నవభూమి:** జమ్మూకశ్మీర్‌లో ఒమర్ అబ్దుల్లా ప్రభుత్వంలో కాంగ్రెస్ భాగం కాబోదని, బయటి నుంచి మాత్రం మద్దతు ఇస్తుందని ఇవాళ (బుధవారం) ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. కాంగ్రెస్‌ను ప్రభుత్వంలో భాగం చేయాలని జమ్మూకశ్మీర్ కాంగ్రెస్ నేతలు అధిష్ఠానాన్ని కోరినప్పటికీ ఢిల్లీ పెద్దలు అందుకు నిరాకరించారు. అయితే ఆ రాష్ట్రంలో పార్టీ నేతల పనితీరుపై హైకమాండ్ అసంతృప్తిగా ఉందని కాంగ్రెస్ నేత ఒకరు తెలిపారు. అందుకే తమ పార్టీ ఎమ్మెల్యేలకు నూతనంగా కొలువుదీరే ప్రభుత్వంలో మంత్రి పదవులు ఇచ్చేందుకు ఒమర్ అబ్దులా సానుకూలంగా ఉన్నప్పటికీ అధిష్ఠానం ఒప్పుకోలేదని ఆయన తెలిపారు. పదవులకు కాకుండా జమ్మూకశ్మీర్‌లో పార్టీ బలోపేతానికే ప్రథమ ప్రాధాన్యం ఇచ్చి కృషి చేయాలని స్థానిక నేతలను ఆదేశించినట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి.

జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రిగా నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా ప్రమాణ స్వీకారోత్సవానికి కొన్ని గంటల ముందు ఈ పరిణామం చోటు చేసుకుంది. ఆర్టికల్ 370 రద్దు తర్వాత ఆ రాష్ట్రంలో జరిగిన తొలి అసెంబ్లీ ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్- కాంగ్రెస్ కూటమి గెలుపొందింది. మ్మొత్తం 90సీట్లలో ఎన్‌సీ 42 స్థానాల్లో విజయం సాధించగా మిత్రపక్షం కాంగ్రెస్ 6 స్థానాలు కైవసం చేసుకుంది. అలాగే ఐదుగురు స్వతంత్ర ఎమ్మెల్యేలు, ఆప్ ఎమ్మెల్యే ఒకరు ఒమర్ నేతృత్వంలో ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతు ప్రకటించారు.

సీఎంగా ఒమర్ అబ్దుల్లా ప్రమాణం..ఇవాళ (అక్టోబర్ 16) ఉదయం 11:30 గంటలకు శ్రీనగర్‌లోని షేర్-ఐ-కశ్మీర్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్(లో ఒమర్ అబ్దుల్లా ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. ఆయనతో సీఎంగా లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ప్రమాణం చేయించారు. అలాగే తొమ్మిది మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. కాగా, కార్యక్రమంలో పెద్దఎత్తున ఇండియా కూటమి నేతలు పాల్గొన్నారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ కార్యక్రమానికి హాజరయ్యారు.

అలాగే సమాజ్ వాదీ పార్టీ నేత అఖిలేశ్ యాదవ్, డీఎంపీ ఎంపీ కనిమెళి కరుణానిధి, ఎన్సీపీ- ఎస్పీ ఎంపీ సుప్రియా సూలే, సీపీఐ నేత డి.రాజా పాల్గొన్నారు. తమ అభిమాన నేత సీఎంగా ప్రమాణం చేస్తుండడంతో నేషనల్ కాన్ఫరెన్స్ నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చారు. దీంతో ఆర్టికల్ 370 రద్దు తర్వాత కేంద్రపాలిత ప్రాంతం జమ్మూకశ్మీర్ మ్మొట్టమ్మొదటి సీఎంగా ఒమర్ అబ్దుల్లా రికార్డు సృష్టించారు.

## చెన్నైలో కుండపోత.. నదుల్లా వీధులు.. చెరువుల్లా వాడలు

**చెన్నై- నవభూమి:** ఆకాశానికి చిల్లిపడిందా? వరుణుడు విరామం మరిచాడా?.. అన్నట్లుగా చెన్నైలో కుండపోత వర్షం కురిసింది. సోమవారం రాత్రి ప్రారంభమైన వర్షం మంగళవారం రాత్రి వరకు పడుతూనే వుండడంతో నగరం జలసంద్రంగా తయారైంది. వీధులన్నీ నదుల్లా, వాడలన్నీ చెరువుల్లా తయారయ్యాయి. దీంతో చెన్నైలో జనజీవనం స్తంభించింది. పలు ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యాలయాలు మూతబడ్డాయి.బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా రాజధాని నగరం చెన్నై సహా నాలుగు జిల్లాలోనూ సోమవారం రాత్రి ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. మంగళవారం ఉదయం మరింత తీవ్ర రూపం దాల్చటంతో నాలుగు జిల్లాల్లో జనజీవనం స్తంభించింది.

మంగళవారం ఉదయం నుంచి కుండపోత వర్షం కురిసింది. సోమవారం సాయంత్రం నుండే చెన్నై, తిరువళ్లూరు, చెంగల్పట్టు, కాంచీపురం జిల్లాల్లో చల్లటి గాలులతో వాన జల్లులు ప్రారంభమయ్యాయి. సౌత్ చెన్నై, సెంట్రల్ చెన్నై, నార్త్ చెన్నై తదితర ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురిశాయి. ముఖ్యంగా మెట్రోరైలు మార్గం పనులు జరుగుతున్న ప్రాంతాల్లో పరిస్థితి అధ్వాన్నంగా మారింది. ఆ ప్రాంతాల్లో వర్షపునీరంతా వరదలా ప్రవహించడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కోయంబేడు మెట్రో ఫ్లైఓవర్ దిగువ పూందమల్లి రహదారి వైపు వర్షపు నీరు వరదలా ప్రవహించడంతో ఆ మార్గంలో వెళ్లే వాహనాలు, ప్యారీస్ కార్నర్ వైపు వెళ్లే వాహనాలు నత్తనడక నడిచాయి.పురుషవాక్కం రిథడ్రన్ రోడ్డులో వర్షపు నీరు పొంగి ప్రవహించింది. అయనావరం నూర్‌హోటల్ బస్టాపు నుంచి సిగ్నల్ వరకు సుమారు వంద మీటర్ల వరకు అడుగుమేర వర్షపు నీరు ప్రవహించడంతో వాహనాలన్నీ నత్తనడక నడిచాయి. అయనావరం ఈఎసఐ ఆస్పత్రి వద్ద వర్షపునీరు వెళ్లేందుకు సరైన మార్గం లేక ఆ ప్రాంతం చెరువును తలపించింది. పురుషవాక్కం పాత మోక్షం థియేటర్ వద్ద వాననీటితో మురుగునీరు కూడా కలవటంతో దుర్వాసన వెదజల్లింది. దీంతో పాదచారులు కూడా ఆ మార్గంలో నడిచి వెళ్ళలేని పరిస్థితి నెలకొంది. దాస్ ప్రకాష్ బస్‌స్టాపు వద్ద రహదారిపూర్తిగా కనిపించనంతగా వర్షపు నీరు పొంగి ప్రవహించింది. అన్నానగర్ అన్నా ఆర్చ్ వద్ద ప్రభుత్వ సిద్ధ వైద్య ఆసుపత్రి ప్రవేశ ద్వారం వద్ద అడుగులోతున వర్షపునీరు ప్రవహించింది.టి.నగర్‌లో..నగరానికివాణిజ్యకేంద్రమైన టి.నగర్‌లోనూ రహదారులన్నీ జలమయమయ్యాయి. అక్కడి రాష్ట్ర చలనచిత్ర కార్మిక సంఘం భవన ప్రాంతం, టి.నగర్ బస్‌స్టేషన్ చుట్టూ మోకాలిలోతున వర్షపు నీరు ప్రవహించింది. పెరియమేడు, వేప్పేరి, కీల్పాక్, అమ్స్‌రోడ్డు, మైలాపూరు, కోట్టూరుపురం, అన్నాసాలై, థౌజెండ్‌లైట్స్, ట్రిప్లికేన్, ఐస్‌హౌస్ తదితర ప్రాంతాల్లో రహదారుల్లో వర్షపునీటిలో సుమారు వందకు పైగా బైకులు, స్కూటర్లు సైలెన్సర్లలో నీరు చేరి కదలకుండా మొరాయించాయి. నగరంలోని యాభైకి పైగా ప్రధాన రహదారులలో చెరువును తలపించేవిధంగా వర్షపునీరు వరదలా ప్రవహించాయి.కూలిన చెట్లు...నగరంలో మంగళవారం వేకువజామున పెనుగాలులకు నగరంలో మూడు ప్రాంతాల్లో చెట్లు కూలిపడ్డాయి. టినగర్ బర్కిట్‌రోడ్డులో ఓ పెద్ద వృక్షం కూలిపడింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక దళం వెళ్ళి ఆ వృక్షాన్ని కోసి తొలగించారు.

చూళైమేడు నెల్సన్ మాణిక్కం రోడ్డు, నుంగంబాక్కం వీరభద్రన్ వీధిలోనూ చెట్లు కూలిపడ్డాయి.

# మహిళలకు మళ్లీ గుడ్ న్యూస్.. ఇవాళ కూడా..





**హైదరాబాద్- నవభూమి:** దసరా, దీపావళి పండగల సందర్భంగా బంగారానికి సాధారణ రోజుల కంటే గిరాకీ బాగా పెరిగింది. ముఖ్యంగా భారతీయ సంప్రదాయం ప్రకారం ఎక్కువగా పండగల సమయంలోనే పసిడిని ఇంట్లోకి తెచ్చుకునేందుకు ఎక్కువ మంది మహిళలు ఇష్టపడుతుంటారు. అలాగే వీటిని ఓ పెట్టుబడిగానూ చూస్తుంటారు. అయితే బంగారం రేట్లు అనేవి ప్రతి రోజూ తగ్గుతూ, పెరుగుతూ ఉంటాయి. బంగారం, వెండి ధరలు ఎప్పుడూ అంతర్జాతీయ మార్కెట్ మీద ఆధారపడి ఉంటాయి. అయితే మూడు నెలల కిందట తగ్గిన వీటి ధరలు తాజాగా మళ్లీ పెరిగాయి. అయితే గత రెండ్రోజులుగా వాటి ధరలు స్వల్పంగా తగ్గాయి. ఆ వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం..

తెలుగు రాష్ట్రాల్లో బంగారం, వెండి ధరలు..తాజాగా బంగారం ధరలు స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి. ఇవాళ(అక్టోబర్ 16న) హైదరాబాద్‌లో 22 క్యారెట్ల పసిడి ధర రూ.70,940 ఉండగా.. 24 క్యారెట్ల ధర రూ.77,390లుగా ఉంది. విశాఖపట్నం, విజయవాడ నగరాల్లో 22 క్యారెట్ల బంగారం ధర రూ.70,940 కాగా.. 24 క్యారెట్ల ధర రూ.77,390లుగా ఉంది. అలాగే హైదరాబాద్‌లో వెండి కేజీ ధర రూ.102,900 ఉండగా.. విజయవాడ, విశాఖపట్నంలో రూ.102,900లుగా ఉంది. అయితే నిన్నటి రేట్లతో పోలిస్తే బంగారంపై రూ.10, వెండిపై రూ.100 మేర ధర తగ్గింది.

**ప్రధాన నగరాల్లో రేట్లు ఇలా..**

దేశ రాజధాని ఢిల్లీలో 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ.71,090ఉండగా.. 24 క్యారెట్ల రేటు రూ.77,540లుగా ఉంది. ముంబైలో 22 క్యారెట్ల పసిడి ధర రూ.70,940కాగా.. 24 క్యారెట్ల ధర రూ.77,390లుగా ఉంది. అలాగే చెన్నైలో 22 క్యారెట్ల ధర రూ.70,940 ఉండగా.. 24 క్యారెట్ల ధర రూ.77,390లుగా ఉంది. ఇక బెంగళూరులో 22క్యారెట్ల రేటు రూ.70,940 ఉండగా.. 24 క్యారెట్ల ధర రూ.77,390లుగా ఉంది. ఇక వెండి విషయానికి వస్తే చెన్నైలో కిలో వెండి ధర రూ.102,900 కాగా.. ఢిల్లీలో రూ.96,900, బెంగళూరులో రూ.91,900, ముంబైలో రూ.96,800లుగా ఉంది.

# మాదీ వికెట్‌కీపర్ల బతుకే..



**న్యూఢిల్లీ- నవభూమి:**'క్రికెట్‌లో వికెట్‌కీపర్లు, ఫుట్‌బాల్‌లో గోల్‌కీపర్లు ఎలాగో సెంట్రల్ బ్యాంకులూ అంతే. వారు సాధించే విజయాలను ఎవరూ గుర్తించరు. కానీ వైఫల్యాలను మాత్రం ఎత్తిచూపుతారంతా' అని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) డిప్యూటీ గవర్నర్లలో ఒకరైన స్వామినాథన్ జే ఒకింత నిరాశతో వ్యాఖ్యానించారు.

**సెంట్రల్ బ్యాంకులను చూస్తున్న తీరుపై**

ఆర్బీఐ డిప్యూటీ గవర్నర్ స్వామినాథన్ ఆవేదన

ముంబై, అక్టోబర్ 15: 'క్రికెట్‌లో వికెట్‌కీపర్లు, ఫుట్‌బాల్‌లో గోల్‌కీపర్లు ఎలాగో సెంట్రల్ బ్యాంకులూ అంతే. వారు సాధించే విజయాలను ఎవరూ గుర్తించరు. కానీ వైఫల్యాలను మాత్రం ఎత్తిచూపుతారంతా' అని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) డిప్యూటీ గవర్నర్లలో ఒకరైన స్వామినాథన్ జే ఒకింత నిరాశతో వ్యాఖ్యానించారు. 'సెంట్రల్ బ్యాంకింగ్ ఎట్ క్రాస్ రోడ్స్' అంశంపై జరిగిన ఆర్బీఐ90 ఉన్నతస్థాయి సదస్సులో స్వామినాథన్ మాట్లాడారు.గడిచిన కొన్నేండ్లలో బ్యాంకింగ్ రంగంలో, దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతిలో సెంట్రల్ బ్యాంకుల పాత్ర ఎంతో పెరిగిందన్నారు. నియంత్రణ, పర్యవేక్షణ, ద్రవ్యవిధానాలతో ఆర్థిక వ్యవస్థను సెంట్రల్ బ్యాంకులే సుస్థిరం చేస్తున్నాయని చెప్పారు. ఆర్థిక రంగమే దేశానికి వెన్నెముకని, అలాంటి కీలక రంగాన్ని రకరకాల సాధనాలతో వివిధ ముప్పుల నుంచి రక్షించేది సెంట్రల్ బ్యాంకులేనని పేర్కొన్నారు. అయినప్పటికీ ఎంత శ్రమించినా సంక్షోభం సమయాల్లో ఏం చేస్తున్నారన్న ప్రశ్నలే ఎదురవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు.

**ద్రవ్యోల్బణం 4.5 శాతంగానే..**

ఈ ఆర్థిక సంవత్సరం (2024-25)లో రిటైల్ ద్రవ్యోల్బణం సగటున 4.5 శాతంగానే నమోదు కావచ్చని ఆర్బీఐ డిప్యూటీ గవర్నర్లలో ఒకరైన మైఖేల్ దేబబ్రత పాత్ర ఆశాభావం కనబర్చారు. వినియోగదారుల ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణాన్ని 4 శాతానికి కట్టడి చేయాలని ఆర్బీఐ లక్ష్యంగా పెట్టుకున్న విషయం తెలిసిందే. దీనికి 2 శాతం తక్కువ, ఎక్కువలుండవచ్చన్న మినహాయింపులూ ఉన్నాయి. ఈ క్రమంలో గడిచిన 3 నెలలుగా ద్రవ్యోల్బణం రేటు 6 శాతం దిగువనే ఉన్నదని పాత్ర ఈ సదస్సు సందర్భంగా గుర్తుచేశారు. ఈ నేపథ్యంలోనే మొత్తం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణం సగటు 4.5 శాతంగా ఉండొచ్చన్న అంచనాను వెలిబుచ్చారు. కాగా, సెప్టెంబర్‌లో 9 నెలల గరిష్ఠాన్ని తాకుతూ 5.5 శాతంగా నమోదైన సంగతి విదితమే. కూరగాయల ధరలు పెరగడంతో ఆహార ద్రవ్యోల్బణం 9.2 శాతానికి ఎగిసింది.

# రెడ్ అలర్ట్.. నేడు చెన్నై సహా 4 జిల్లాలకు సెలవు



**చెన్నై- నవభూమి:** ఈశాన్య రుతుపవనాల ఆగమనం, బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా బుధవారం తొమ్మిది జిల్లాల్లో కుండపోతగా వర్షాలు కురిసే అవకాశముందన్న వాతావరణ కేంద్రం ఆయా జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించింది. సోమవారం అర్ధరాత్రి నుంచి చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు జిల్లాల్లో కుండపోతగా వర్షాలు కురిశాయి. దీంతో ఆ నాలుగు జిల్లాల్లో జనజీవనం స్తంభించింది. చెరువులు, జలాశయాల్లో నీటి మట్టం వేగంగా పెరుగుతోంది. ఈ పరిస్థితుల్లో మంగళవారం చెన్నై సహా నాలుగు జిల్లాలకే పరిమితమైన రెడ్ అలర్ట్ మరో ఐదు జిల్లాలకు కూడా ప్రకటించడంతో ఆయా జిల్లాల ప్రజలంతా ఆందోళన చెందుతున్నారు. బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన అల్పవాయు పీడనం వాయుగుండంగా మారనుండటంతో చెన్నై, చెంగల్పట్టు, కాంచీపురం, తిరువళ్లూరు, రాణిపేట, తిరువణ్ణామలై, వేలూరు, కడలూరు, విల్లుపురం జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించారు. ఈ జిల్లాల్లో బుధవారం ఉరుములు, మెరుపులు, పెనుగాలులతో కుండపోత వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. సముద్ర తీర ప్రాంతాల్లో గంటలకు 40 నుంచి 50 కి.మీల వేగంతో పెనుగాలులు వీస్తాయని ఈ నెల 18 వరకూ ఇదే పరిస్థితి కొనసాగుతుందని, జాలర్లు చేపలవేటకు వెళ్లరాదని హెచ్చరించారు. రాష్ట్రంలో ఉత్తర సముద్రతీర జిల్లాల్లోనూ పెనుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని అధికారులు పేర్కొన్నారు. మన్నార్ జలసంధి, కన్నియాకుమారి సముద్రతీరంలో గంటకు 35 నుండి 45 కి.మీ.ల వేగంతో పెనుగాలులు వీస్తాయని వివరించారు.చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు జిల్లాలకు వరద ముప్పు పొంచివుందని వాతావరణశాఖ ప్రకటించిన నేపథ్యంలో ఆయా జిల్లాల్లో ప్రభుత్వం సెలవు ప్రకటించింది. అయితే అత్యవసర సేవలందించే పోలీసు, అగ్నిమాపక, స్థానిక సంస్థలు, డైరీ తదితర శాఖలు, మెట్రో వాటర్ బోర్డు, ఆస్పత్రులు, మెడికల్ షాపులు, బ్యాంక్‌లు, విద్యుత్, ఎంటీసీ, చెన్నై మెట్రోరైల్, ఎమ్మార్టీఎస్ రైల్వే, విమానాశ్రయం, పెట్రోల్ బంక్‌లు, హొటళ్లు, వరద సహాయక చర్యల్లో పాల్గొనే శాఖలు యధావిధిగా పనిచేయనున్నాయి. కాగా హైకోర్టుతో పాటు పైన పేర్కొన్న నాలుగు జిల్లాల్లోని న్యాయస్థానాలకూ సెలవు ప్రకటించారు. ఇదిలా వుండగా బుధవారం కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి, కారైక్కల్‌లలోని విద్యాలయాలకు అక్కడి ప్రభుత్వం సెలవు ప్రకటించింది.

**డెల్టాలో నీటమునిగిన 6500 ఎకరాలు**

రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలకు డెల్టా జిల్లాలో 6500 ఎకరాల్లో కోతకు సిద్ధంగా ఉన్న వరి నీట మునిగింది. తంజావూరు, నాగపట్టినం, తిరువారూరు, మైలాడుదురై, పుదుకోట, తిరుచ్చి, కరూరు, అరియలూరు, పెరంబలూరు జిల్లాలో సోమవారం మధ్యాహ్నం నుండే చిరుజల్లులతో ప్రారంభమైన వర్షం సాయంత్రానికి తీవ్ర రూపం దాల్చింది. కుండపోతగా కురిసిన ప్రాంతాలకు జనజీవనం స్తంభించింది. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి.

**కంచిలో నిండిన చెరువులు..**


రెండు రోజులపాటు కురిసిన వర్షాలకు కాంచీపురం జిల్లాల్లోని ప్రధాన చెరువులు జలకళను సంతరించుకున్నాయి. ఆ జిల్లాలోని అనుమన్ తండలం, ఇలనగర్ చిత్తేరి, నందివరం, తిమ్మావరం, మధురాంతకం, అచ్చరపాకం చెరువు సహా మొత్తం 20 చెరువుల్లో నీటిమట్టం వేగంగా పెరిగింది. ఇదే విధంగా చెంబరంబాక్కం జలాశయంలోనూ నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. మంగళవారం మధ్యాహ్నం కాంచీపురం జిల్లా కలెక్టర్ కళైసెల్విమోహన్ జలశయాన్ని నీటివనరుల శాఖ ఉన్నతాధికారులతో కలిసి పరిశీలించారు. బుధవారం మధ్యాహ్నం అల్పపీడనం వాయుగుండంగా మారుతుందని, దాని ప్రభావంతో మరి నాలుగైదు రోజుల వరకు ఉత్తరాది జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీగా వర్షాలు కురుస్తాయని తెలిపారు. చెన్నై సబర్బన్ ప్రాంతాల్లో మరో రెండు రోజులు భారీగా వర్షాలు కురిసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆయన వివరించారు.

పెరంబూరులో 16.5 సెం.మీ.ల వర్షపాతం నగరంలో సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు భారీ వర్షాలు కురిశాయి. పెరంబూరు ప్రాంతంలో 16.5 సెం.మీల. వర్షపాతం నమోదైంది. కొళత్తూరులో 15.8 సెం.మీ., అన్నానగర్‌లో 15.2 సెం.మీ., అంబత్తూరు 13. సెం.మీ, బేసిన్‌బ్రిడ్జి 12.2 సెం.మీ, వేళచ్చేరి 12.2 సెం.మీ, మధురవాయల్, వడపళని, తండయార్‌పేటలో 10 సెం.మీల. చొప్పున వర్షపాతం నమోదైనట్లు స్థానిక వాతావరణ కేంద్రం అధికారులు ప్రకటించారు.

**ఈశాన్య రుతుపవనాలు ప్రారంభం..**

రాష్ట్రంలో మంగళవారం ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించాయని, అవి వస్తూ భారీ వర్షాలను వెంట తీసుకువచ్చాయని చెన్నై వాతావరణ కేంద్రం దక్షిణ మండల అధికారి బాలచంద్రన్ ప్రకటించారు. ఈశాన్య రుతుపవనాల ఆగమనానికి తోడు బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్ప పీడనం బుధవారంలోగా వాయుగుండంగా మారనుండటంతో తొమ్మిది జిల్లాకు రెడ్ అలర్ట్ ప్రకటించారు.

## కర్ణాటకలో 3 శాసనసభ స్థానాలకు ఉప ఎన్నికలు




**న్యూఢిల్లీ- నవభూమి:** కర్ణాటకలో మూడు శాసనసభ స్థానాలకు ఉప ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రకటించింది. శాసనసభ సభ్యులుగా కొనసాగుతూ, ఎంపీలుగా ఎన్నికైనవారు రాజీనామా చేసిన మూడు స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. రామనగర జిల్లా చన్నపట్టణ ఎమ్మెల్యే కుమారస్వామి మండ్య నుంచి ఎంపీగా ఎన్నికై కేంద్ర భారీ పరిశ్రమల మంత్రిగా వ్యవహరిస్తున్నారు. హావేరి జిల్లా శిగ్గావి ఎమ్మెల్యే, మాజీ సీఎం బసవరాజ్ బొమ్మై హావేరి ఎంపీగా ఎన్నికయ్యారు. బళ్లారి జిల్లా సండూరు ఎమ్మెల్యే తుకారాం బళ్లారి ఎంపీగా ఎన్నికయ్యారు. ఈ మూడు అసెంబ్లీ స్థానాల ఉప ఎన్నికలకు ఈ నెల 18న నోటిఫికేషన్ వెలువడనుంది. అదే రోజు నుంచి 25వ తేదీ వరకూ నామినేషన్‌లు స్వీకరిస్తారు. ఉపసంహరణలకు 31వరకు గడువు ఉంటుంది. నవంబరు 13న పోలింగ్ నిర్వహిస్తారు. నవంబరు 23న ఫలితాలు ప్రకటిస్తారు.

## వయనాడ్ నుంచి ప్రియాంక పోటీ



**న్యూఢిల్లీ- నవభూమి:**వయనాడ్ లోక్‌సభ సీటుకు ప్రియాంకా గాంధీ పోటీ చేస్తారని కాంగ్రెస్ పార్టీ అధికారికంగా ప్రకటించింది. మహారాష్ట్ర, ఝార్కండ్ అసెంబ్లీ ఎన్నికల తేదీలను మంగళవారం ప్రకటించిన ఎన్నికల కమిషన్, వయనాడ్ లోక్‌సభ సీటుతో పాటు 47 అసెంబ్లీ స్థానాలకు నవంబరు 13న ఉప ఎన్నికలు నిర్వహించనున్నట్లు వెల్లడించింది. ఆ వెంటనే వయనాడ్ సీటుకు ప్రియాంక అభ్యర్థిత్వంపై కాంగ్రెస్ ప్రకటన చేసింది. రాహుల్‌గాంధీ వయనాడ్(కేరళ) సీటును వదులుకొని రాయ్‌బరేలీ(యూపీ) లోక్‌సభ స్థానానికే ప్రాతినిధ్యం వహిస్తారని పార్టీ గతంలోనే తెలిపింది. కాగా, వయనాడ్‌లో గనక ఆమె గెలిస్తే.... ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు(సోనియా, రాహుల్, ప్రియాంక) మొట్టమొదటిసారిగా పార్లమెంటు సభ్యులుగా ఉంటారు.

## ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ లేకున్నా అయ్యప్ప దర్శనం



**తిరువనంతపురం- నవభూమి:** శబరిమల అయ్యప్ప దర్శనం విషయంలో కేరళ ప్రభుత్వం భక్తులకు ఉపశమనం కలిగించే వార్త చెప్పింది. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ లేకుండా వచ్చే భక్తులు కూడా ఎలాంటి ఆటంకాలు లేకుండా అయ్యప్ప దర్శనం చేసుకోవచ్చని కేరళ ప్రభుత్వం మంగళవారం స్పష్టం చేసింది. రానున్న యాత్రా సీజన్ నుంచి ఆన్‌లైన్ బుకింగ్ ద్వారానే దర్శనం కల్పించాలని ఇటీవల తీసుకున్న నిర్ణయంపై తీవ్ర వ్యతిరేకత రావడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ఈ మేరకు సీఎం విజయన్ అసెంబ్లీలో ప్రకటన చేశారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ లేకుండా వచ్చే భక్తులకు కూడా సజావుగా దర్శనం జరిగేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. గత యాత్రా సీజన్‌లోనూ ఈ సదుపాయం కల్పించామన్నారు. అయితే గత ఏడాది మాదిరిగా వర్చువల్ బుకింగ్‌తో పాటు స్పాట్ బుకింగ్ వ్యవస్థను కొనసాగిస్తారా? లేదా? అనే దానిపై సీఎం విజయన్ స్పష్టత ఇవ్వలేదు.

# యాక్షన్ కింగ్ అర్జున్ డైరెక్షన్‌లో మల్టీ లింగ్యువల్ సినిమా.. వివరాలివే






తెలుగు, కన్నడతోపాటు పాన్ ఇండియా మూవీ లవర్స్‌కు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని యాక్టర్ అర్జున్ యాక్షన్ కింగ్ డైరెక్టర్ అని కూడా తెలిసిందే. చివరగా లోకేశ్ కనగరాజ్ లియోలో మెరిశాడు అర్జున్. సుమారు ఆరేండ్ల విరామం తర్వాత మళ్లీ మెగాఫోన్ పట్టాడు. అర్జున్ డైరెక్ట్ చేస్తున్న కొత్త సినిమా సీత పయనం . ఈ విషయాన్ని తెలియజేస్తూ టైటిల్ లోగో ఆవిష్కరించాడు.
తాజా సమాచారం ప్రకారం మొదట ఈ సినిమాను కన్నడలో చిత్రీకరించనుండగా.. ఆ తర్వాత తెలుగు, తమిళ భాషల్లో కూడా విడుదల చేయనున్నారట. అర్జున్ హోం ప్రొడక్షన్ బ్యానర్ శ్రీరామ్ ఫిల్మ్ ఇంటర్నేషనల్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తుంటం విశేషం. ఈ ప్రాజెక్టులో ఈ చిత్రంలో కన్నడ యాక్టర్ నిరంజన్ సుధీంద్ర లీడ్ రోల్‌లో నటిస్తున్నాడు. ఇతర లీడ్ యాక్టర్లు ఎవరనేది ప్రస్తుతానికి సస్పెన్స్ నెలకొంది. పాపులర్ టెక్నీషియన్లు ఈ సినిమాలో భాగం కాబోతున్నట్టు సమాచారం.

నవచిత్ర





సమంత

# 11 నిమిషాలు.. సింగిల్ టేక్.. అదీ సమంత అంటే!

స్టార్ హీరోయిన్ నటించిన లేటెస్ట్ వెబ్ సిరీస్ సిటాడెల్ హనీ బన్నీ. బాలీవుడ్ స్టార్ హీరో వరుణ్ ధావన్ లీడ్ రోల్ లో యాక్ట్ చేస్తున్న ఆ సిరీస్ కు రాజ్ అండ్ డీకే దర్శకత్వం వహించారు. ప్రియాంక చోప్రా, రిచర్డ్ మ్యాడెన్ ప్రధాన పాత్రల్లో నటించిన హాలీవుడ్ సిరీస్ సిటాడెల్ కు ఇండియన్ వెర్షన్ గా సిటడెల్ : హనీ బన్నీని తెరకెక్కించారు. ఇప్పటికే అన్ని కార్యక్రమాలు పూర్తి కాగా.. త్వరలో ప్రముఖ ఓటీటీ ప్లాట్ ఫామ్ అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ కానుంది. ఫ్యామిలీ మ్యాన్2 సిరీస్ లో నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో అదరగొట్టిన సమంత.. సిటాడెల్ కోసం ప్రత్యేకంగా సిద్ధమయ్యారు. మార్షల్ ఆర్ట్స్ లో కూడా ట్రైనింగ్ తీసుకున్నారు. ఎలాంటి డూప్ లేకుండా స్వయంగా యాక్షన్ సీక్వెన్స్ ను పూర్తి చేశారట. అయితే మేకర్స్ రీసెంట్ గా ముంబైలో సిటాడెల్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో వరుణ్ ధావన్ చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతున్నాయి. సిరీస్ కోసం తాను, సమంత చాలా కష్టపడ్డామని తెలిపారు. సిటాడెల్ లో ఓ యాక్షన్ సన్నివేశం కోసం తనతోపాటు సామ్ సమంత అవిశ్రాంతంగా పనిచేశారని చెప్పారు. ఆ సీన్ కోసం ఎంతో కష్టపడ్డామని వెల్లడించారు. ఆ సన్నివేశం 11 నిమిషాలు ఉంటుందని, సింగిల్ టేక్‌లో ఎలాంటి కట్స్ లేకుండా షూట్ చేశామని పేర్కొన్నారు. అది సిరీస్ క్లైమాక్స్ లో వస్తుందని, కచ్చితంగా ఎంతో ఉత్కంఠ కలిగిస్తుందని అన్నారు. ప్రేక్షకులు థ్రిల్ ఫీల్ అవుతారని చెప్పారు. ! అయితే ఇప్పటికే సిటాడెల్ మేకర్స్.. ఓ వేడుకలో సిరీస్ కోసం మాట్లాడి అంచనాలు పెంచారు. క్లైమాక్స్ మరోస్థాయిలో ఉంటుందని తెలిపారు. ఆ యాక్షన్ సన్నివేశం సిరీస్ మొత్తానికి హైలైట్‌గా నిలుస్తుందని వివరించారు. ఇప్పుడు ఆ సీన్ కోసమే వరుణ్ చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో సిటాడెల్ పై అంచనాలు పెరిగిపోయాయని నెటిజన్లు చెబుతున్నారు. సమంతనా.. మజాకా అంటూ ఆమె ఫ్యాన్స్ కామెంట్లు పెడుతున్నారు. మంచి హిట్ అందుకుంటారని అంటున్నారు.వెజ్ కలిపి కుమ్మేస్తోన్న బుట్టబొమ్మ! ఇక.. మయోసైటిస్ బారినపడ్డ సమయంలోనే సిటాడెల్ షూటింగ్ లో సమంత పాల్గొన్నారు. అప్పుడు ఆరోగ్యపరంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఒకసారి కళ్లు తిరిగి కూడా పడిపోయారు. షూట్ పూర్తయ్యాక విదేశాలకు వెళ్లి రెస్ట్ తీసుకున్నారు. ట్రీట్ మెంట్ కూడా తీసుకున్నారు.

# రోడ్డు మీద వున్న సిమెంట్ పైపుల్లో నిద్రపోయాను: బలగం వేణు



తెలంగాణ నేపథ్యంతో.. తెలంగాణ ఆచారాలు, యాస, సంప్రదాయాలు, కట్టుబాట్లు ఇలా అన్ని కలగలిపి తెలుగు సినిమా చరిత్రలోనే ఓ క్లాసిక్‌గా మిగిలిపోయిన బలగం చిత్రాన్ని తెరకెక్కించి దర్శకుడిగా తన ప్రతిభను నిరూపించుకున్నాడు ఎల్దండి వేణు. బలగం సినిమా చూడని తెలంగాణ వాడు, తెలుగు వాడు లేడంటే అతిశయోక్తి కాదేమో.. అయితే వేణు సినీ పరిశ్రమలోకి ప్రవేశించ డానికి చాలా కష్టపడ్డాడు.. ఇటీవల ఓ సందర్భంలో ఆయన తన సినీ రంగ ప్రవేశం గురించి కొన్ని ఆసక్తికర విషయాలను పంచుకు న్నాడు.సినీ పరిశ్రమ మీద మక్కువతో ఇంట్లో చెప్పకుండా పారిపోయి హైదరాబాద్‌కు వచ్చాను. జేబులో రెండు వందల డెబ్బయ్ ఐదు రూపాయాలు బ్యాగులో రెండు జతల బట్టలు. ఇవే అప్పుడు నా ఆస్తిపాస్తులు. హైదరాబాద్ వచ్చిన తరువాత ఎక్కడ వుండాలో తెలియక 3 రోజులు బస్టాండులోనే వున్నాను. ఛాయ్, డబుల్ రొట్టే మాత్రమే తినేవాడ్ని. ఇక అన్నపూర్ణ స్టూడియో అడ్రస్ కనుక్కొని అక్కడికి వెళ్లిపోయాను. అక్కడ ఆ గేటు ముందు అందరి వారు నాలాగా అవకాశాల కోసం ఎదురు చూస్తున్నవాళ్లే. అక్కడ ఆ స్టూడియో ముందు రోడ్డు మీద వున్న పైపుల్లో నిద్రపోయేవాడ్ని. మంగళవారం, శుక్రవారం పెద్దమ్మ గుడిలో అన్నదానాలతో ఆకలి తీర్చుకునేవాడిని. మిగతా రోజులు దాదాపు పస్తులే. వున్న రెండు జతల బట్టల్లో ఒకటి ఒంటి మీద, ఇంకోటి ఊతికి ఆరేసి వుండేది. ఇక టవలు, చెప్పులు మాత్రం దగ్గర్లో వుండే ఇసుకను తవ్వి అందులో పెట్టి పూడ్చేవాళ్లం. లేదంటే పడుకున్నప్పుడు దొంగలు ఎత్తుకెళ్లాతరనే భయం వుండేది. అనుకోకుండా సెట్‌బాయ్‌గా అవకాశం వచ్చింది. ఆ తరువాత ఓ డైరెక్టర్ దగ్గర పనిచేశాను. అప్పుడే చిత్రం శ్రీను పరిచయమయ్యాడు. కొంతకాలం ఆయన దగ్గర టచప్ బాయ్‌గా చేశాను. తరువాత జై సినిమాలో నటుడిగా అవకాశాలు వచ్చే దాకా ఎన్ని కష్టాలు చూడాలో అన్ని చూసేశాను. దర్శకుడు తేజ అడిషన్ కోసం ఫోటోలు పంపడానికి కూడా నా దగ్గర డబ్బులు లేవు. నా మిత్రుడు కొత్తపల్లి శేషు సహాయంతో ఫోటోలు పంపాను. ఆ తరువాత అడిషన్‌లో సెలక్ట్ కాగానే నాలుగు జతల బట్టలు కూడా కుట్టించి షూటింగ్‌కు పంపాడు. ఆ స్నేహితుడి చేసిన సహాయం జీవితాంతం మరిచిపోలేని' అంటూ గుర్తుచేసుకున్నారు బలగం వేణు.

# నాని - శ్రీకాంత్ ఓదెల చిత్రంలో హీరోయిన్‌గా బాలీవుడ్ బ్యూటీ.?





దసరా దర్శకుడు శ్రీకాంత్ ఓదెల నాని కాంబోలో మరో సినిమా రాబోతున్న విషయం తెలిసిందే. దసరా పండుగను పురస్కరించుకుని ఈ సినిమా లాంచ్ అవ్వగా.. ఈ సినిమా దసరా సినిమాను మించే స్థాయిలో ఉంటుం దని కథ కథానాల్లో ఉహించని ట్విస్ట్‌లు ఉంటాయని నాని తెలిపారు.అయి తే ఈ సినిమాలో కథానాయికకు సంబంధించి ఒక సాలిడ్ న్యూస్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఈ మూవీలో హీరోయిన్‌గా 'స్త్రీ 2'తో బ్లాక్ బస్టర్ అందుకున్న శ్రద్ధా కపూర్ నటించబోతున్నట్లు బాలీవుడ్‌తో పాటు టాలీవుడ్ మీడియాలో వార్తలు వైరలవుతున్నాయి. అయితే దీనిపై చిత్రబృందం క్లారిటీ ఇవ్వవలసి ఉంది. శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సినిమాస్ పతాకంపై 'దసరా' నిర్మాత సుధాకర్ చెరుకూరి ఈ సినిమాను నిర్మిస్తుండగా.. నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే వెల్లడించనున్నారు.

# సంక్రాంతి రేసు నుంచి తప్పుకోనున్న వెంకీ - అనిల్ రావిపుడి సినిమా.?



టాలీవుడ్ సీనియర్ నటుడు విక్టరీ వెంకటేష్.అనిల్ రావిపూడి కాంబోలో ఓ సినిమా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే వీరిద్దరి కాంబోలో వచ్చిన ఎఫ్2, ఎఫ్3 చిత్రాలు మంచి విజయాలను అందుకున్నాయి. దీంతో వీరిద్దరి కాంబినేషన్‌లో మరో చిత్రం రాబోతుంది. ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు నిర్మిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో వస్తున్న ఈ చిత్రం కామెడీ అండ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రానుంది. ఈ చిత్రం ప్రస్తుతం రామోజీ ఫిలిం సిటీలో శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. అయితే ఈ సినిమా సంక్రాంతి రేసు నుంచి తప్పుకున్నట్లు తెలుస్తుంది. సంక్రాంతి రేసు నుంచి ఇప్పటికే విశ్వంభర వాయిదా పడిన విషయం తెలిసిందే. తాజాగా ఈ లిస్ట్‌లోకి వెంకీ – అనిల్ రావిపూడి ప్రాజెక్ట్ వచ్చినట్లు తెలుస్తుంది. రామ్ చరణ్ నటిస్తున్న గేమ్‌ఛేంజర్ సినిమాను అక్టోబర్ 10న విడుదల చేయనున్నట్లు నిర్మాత దిల్ రాజు ప్రకటించాడు. అయితే ఆయన నిర్మాణంలోనే వస్తున్న మరో చిత్రం వెంకీ అనిల్ రావిపుడి ప్రాజెక్ట్. ఈ ప్రాజెక్ట్‌ను మొదట సంక్రాంతికి తీసుకువద్దాం అనుకున్నారు. కానీ అదే టైంలో దిల్ రాజు సోంత ప్రోడక్షన్ నుంచి గేమ్ ఛేంజర్ వస్తుంది. దీంతో వెంకీ అనిల్ రావిపుడి సినిమాను వాయిదా వేయబోతున్నట్లు తెలుస్తుంది. ఒకవేళ ఈ సినిమా తప్పుకుంటే అటు గేమ్ ఛేంజర్‌తో పాటు నాగ చైతన్య తండేల్, బాలయ్య ఎన్‌బీకే 109 సినిమాలకు ఇది ప్లస్ అవ్వనుంది. ఈ ప్రాజెక్ట్‌లో కథానాయికలుగా మీనాక్షి చౌదరితో పాటు ఐశ్వర్య రాజేష్ నటించబోతుండగా.. ఈ మూవీలో ఐశ్వర్య రాజేష్ వెంకటేశ్ భార్యగా నటించనున్నట్లు తెలుస్తుంది.

# యువ గ్రాండ్‌మాస్టర్లు విదిత్, దివ్యకు కోటి నజరానా



ముంబై : యువ గ్రాండ్‌మాస్టర్లు విదిత్ గుజరాతి, దివ్య దేశ్‌ముఖ్‌కు మహారాష్ట్ర ప్రభుత్వం నగదు బహుమతి ప్రకటించింది. ఇటీవలే హంగేరి వేదికగా ముగిసిన 45వ చెస్ ఒలింపియాడ్‌లో స్వర్ణం గెలిచిన భారత పురుషుల, మహిళల జట్లలో సభ్యులుగా ఉన్న విదిత్, దివ్యకు చెరో కోటి రూపాయల చొప్పున నజరానా ప్రకటిస్తున్నట్టు మహారాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం తెలిపింది.


# జైలు గదిలో ఒంటరిగా ఇమ్రాన్ ఖాన్.. మాజీ భార్య జెమీమా ఆందోళన



లండన్: పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ప్రస్తుతం జైలు జీవితం గడుపుతున్నారు. అయితే జైలు గదిలో ఉన్న అతనిపై ఆయన మాజీ భార్య జెమిమా గోల్డ్‌స్మిత్(%జీవఎఱఎఝ +శీశ్రీసంఎత్‌ష్త్ర%) ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చీకటి గదిలో ఇమ్రాన్‌ను బంధించారని, అక్కడ విద్యుత్తు సరఫరా లేదని ఆమె ఆరోపించారు. సరైన రీతిలో ఇమ్రాన్‌ను జైలు అధికారులు ట్రీట్ చేయడం లేదన్నారు. కుటుంబసభ్యుల్ని కలుసుకోనివ్వడం లేదని, కోర్టు విచారణలు వాయిదా వేస్తున్నారని, గత సెప్టెంబర్ నుంచి ఇద్దరు కుమారులతో మాట్లాడే వీలు కూడా కల్పించడం లేదని జెమీమా గోల్డ్‌స్మిత్ ఆందోళన వ్యక్తం చేశారు.

నవక్రీడ

# కివీస్‌తో తొలి టెస్టు.. రెండు సెషన్లు వర్షార్పణం.. తొలి రోజు ఆట రద్దు



బెంగుళూరు: బెంగుళూరులో వర్షం కురుస్తోంది. దీంతో కివీస్, భారత్ మధ్య ఇవాళ ప్రారంభం కావాల్సిన టెస్టు మ్యాచ్ ఆలస్యం అవుతోంది. ఇప్పటికే తొలి రెండు సెషన్లు ముగిశాయి. చిన్నస్వామి స్టేడియంలో ఇంకా కొన్ని కవర్స్ అలాగే ఉన్నాయి. బెంగుళూరులో ఉదయం నుంచి అడపాదడపా జల్లు కురుస్తోంది. టీ టైం కూడా పూర్తి కావడంతో.. ఇవాళ ఆట జరిగేది అనుమానంగా ఉన్నది. మరో వైపు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ, యశస్వి జైస్వాల్.. ఇండోర్ ప్రాక్టీస్ చేశారు. టీ బ్రేక్ తర్వాత .. పిచ్‌ను పరిశీలించిన అంపైర్లు ఆటను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**